

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+20 వెల: ₹5.00
సంపుటి: 10
సంచిక: 322

సోమవారం 12-2-2018



సంపన్న నగరాల్లో ముంబై
రూ.60.8 లక్షల కోట్ల సంపదతో ప్రపంచంలో 12వ స్థానం - బిజినెస్‌లో



నియామకాల జోరు!
ఈ ఏడాది 10–15 శాతం వృద్ధి ఉంటుందన్న 'పీపుల్ స్ట్రాంగ్' - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

చంద్రబాబు కొత్త 'షో' తెరవెనుక..!



ఎన్నికలు దగ్గరపడుతుండడంతో స్వరం మార్చిన సీఎం

చంద్రబాబు వ్యవహార శైలిపై వివిధ వర్గాల విస్మయం

- నాలుగేళ్లుగా తెలుగుదేశం సర్కారు వరుస వైఫల్యాలు
- స్వప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టిన బాబు
- విభజన చట్టంలోని హామీల సాధనలో నిర్లక్ష్యం
- ప్రతి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం జరిగినా నోరెత్తని వైనం
- నెపాన్ని కేంద్రంపైకి నెట్టి తప్పించుకునే ఎత్తుగడ

సాక్షి, అమరావతి

గత పది రోజులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెర వెనుక నుంచి నడుపుతున్న రాజకీయ క్రీడ ఆదివారం కూడా కొనసాగింది. ఆయన తాజాగా టీడీపీ ఎంపీలతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చించారు. బీజేపీపై విరుచుకుపడాలని ఆదేశించారు. దాంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు తదితరులు బీజేపీపై విమర్శల దండకం అందుకున్నారు. రాష్ట్రానికి చాలా ఇచ్చామంటూ ఆ పార్టీ విడుదల చేసిన లెక్కల్లో నిజం లేదని అన్నారు. బీజేపీ ఇచ్చింది తక్కువ.. చెప్పుకుంటోంది ఎక్కువని ఆరోపించారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే నిధులిచ్చారు తప్ప ప్రత్యేకంగా ఏమీ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే సహించబోమని చెప్పారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ కేంద్రంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబు సూచించారని పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీల అమలు, నిధుల కేటాయింపు విషయంలో నాలుగేళ్లుగా రాష్ట్రానికి అన్యాయం జరుగుతూనే ఉన్నా మౌనవ్రతం కొనసాగించిన చంద్రబాబు తీరా ఇప్పుడు స్వరం మార్చుతుండడం పట్ల వివిధ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఆయన వ్యవహార శైలి తెలిసిన వారు మాత్రం

మిగతా 2వ పేజీలో ▶

కాలయాపనా?

కాపాడే వ్యూహమా?

పవన్ కళ్యాణ్ వైఖరిపై పలువురి అనుమానాలు

- సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదా వద్దన్నప్పుడు పల్లెత్తు మాటనలేదే
- పట్టిసీమలో కాగ్ కడిగేస్తే కంటికి కనిపించలేదా?
- నాలుగేళ్లుగా సాగుతున్న నాటకానికి కొనసాగింపుగానే నిజనిర్ధారణ కమిటీ!

- వివరాలు 8లో




అబుదాబిలోని ప్రఖ్యాత దుబాయ్ ఒపెరా హౌస్‌లో జరిగిన సభలో భారతీయులకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

గల్ఫ్‌తో శతాబ్దాల అనుబంధం

- యూఏఈ, ఒమన్ దేశాల పర్యటనలో మోదీ
- యూఏఈ, గల్ఫ్ దేశాలతో బంధం దృఢమైనది
- అబుదాబి భారత సంతతి ప్రజల భేటీలో వెల్లడి
- అబుదాబిలో స్వామినారాయణ్ ఆలయానికి శంకుస్థాపన
- ఒమన్‌లోనూ ప్రధాని మోదీ ప్రసంగం

7లో



గాల్లో పేలిన విమానం

71 మంది దుర్మరణం

రష్యాలో ఘోర ప్రమాదం

- టేకాఫ్ తీసుకున్న నాలుగు నిమిషాలకే విమానంతో తెగిపోయిన రేడియో సంబంధాలు
- మృతుల కుటుంబాలకు అధ్యక్షుడు పుతిన్ సంతాపం

7లో

నాలుగేళ్లుగా నిద్రపోయారా?



అకస్మాత్తుగా ఇప్పుడు ఆందోళనా?

టీడీపీపై సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్‌కారత్ మండిపాటు

- ఏమైనా బేరసారాలు జరుగుతున్నాయా!
- విభజన హామీలు అమలుకాకుంటే రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత
- వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో ఫ్రంట్
- ఎమ్మెల్యేలను టీడీపీ కొనుగోలు చేసినా వైఎస్సార్‌సీపీ పునాదులు పటిష్టం

(భీమవరం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

'నాలుగేళ్లుగా నిద్రపోయారు. ఇప్పుడు అకస్మాత్తుగా మేల్కొని పార్లమెంటులో ఆందోళన చేస్తున్నారు. ప్రత్యేక హోదాతో సహా విభజన చట్టంలోని అంశాలను అమలుచేయాలని వామపక్ష పార్టీలు మొదట్నుంచీ డిమాండ్ చేస్తూనే వచ్చాయి. ఎవరూ కలిసి రావడంలేదని టీడీపీ ఇప్పుడెలా అడుగుతుంది? ఇంత అకస్మాత్తుగా టీడీపీ ఆందోళన చేయడం వెనుక ఏమైనా బేరసారాలు (బార్గెయినింగ్) జరుగుతున్నాయేమోనని అనుమానించాల్సి వస్తోంది'.. అని సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్‌కారత్ అన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పుడు తెలిసొచ్చిందా? అని ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 25వ మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన

మిగతా 2వ పేజీలో ▶

ఎలుక పిల్లా?

- మూడో సంతానంగా మళ్లీ ఆడపిల్లే. ఆ పిల్లను వదిలించుకుంటేనే సంసారభాగ్యం అంటూ భర్త హుకుం. కన్నపేగు కలుక్కుమంటున్నా.. మరో దారి లేదు. ఓ ఎలుకపిల్లను చంపేసినట్టే.. తన పొత్తిళ్ల పిల్లను నిద్రపుచ్చిందా తల్లి. అది శాశ్వత నిద్ర. మగపిల్లలెందరు పుట్టినా సరే గానీ మరోమారు ఆడపిల్లే పుట్టిందా.. అదే ఆ నలుసుకు ఆఖరు శ్వాస అనే కరకు సమాజాన్ని మౌనంగా నిగ్గదీసే వాస్తవగాథే.. 'ఎలుకపిల్ల'

నేను శక్తి సాక్షి

- ఫ్యామిలీలో

నేనూ.. టాంగ్‌జింగ్‌నే..! ఎన్నో ఉదాహరణలు, మరెన్నో ప్రత్యేక కథనాలకు www.sakshi.com క్లిక్ చేయండి.

ఇదండీ జోక్



పన్లోపని విమర్శలు చేసే వాళ్లను కూడా ఎన్‌కౌంటర్ చేస్తే పోలా సార్!!

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొత్తపాలెం వద్ద ఎడ్లబండిపై చెర్నాకోలతో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



నవరత్నాలతో పేదలకు చేయూత

వీటి గురించి అందరికీ మీరే తెలియజెప్పాలి

అక్కచెల్లెమ్మలతో ప్రతిపక్షనేత వైఎస్ జగన్

- మనందరి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల వారినీ ఆదుకుంటాం
- చిట్టిపిల్లలను బాగా చదివించండి
- వారు పెద్ద చదువులు చదివితేనే మన తల రాతలు మారతాయి
- పిల్లలను బడికి పంపే తల్లికి ఏటా రూ.15 వేలు ఇస్తాం
- ఉన్నత చదువుకు ఎంత ఖర్చు అయినా భరిస్తామని హామీ

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

దేవుడు ఆశీర్వదించి, ప్రజలందరి దీవెనలతో రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదవర్గాల సంక్షేమం కోసం మనమేం చేయబోతున్నామో అందరికీ విస్తృతంగా తెలియజెప్పాలని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మహిళలను కోరారు. ఆదివారం 84వ రోజు ప్రజా సంకల్ప యాత్ర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం దగదర్తి మండలం బోడగుడిపాడు శివారు నుంచి

మిగతా 6వ పేజీలో ▶

న్యాయవాదులు సామాజిక నిర్మాతలు!

- అనుభవం, నైపుణ్యం ఉన్నవారినే జడ్జీలుగా నియమించాలి
- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ రంజన్ గొగొయ్
- తెలుగులోనే న్యాయ పరిపాలన సాగాలి
- బెజవాడలో వినియోగదారుల ఫోరం బెంచ్
- రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్న జస్టిస్ ఎన్వీ రమణ

5లో



బెజవాడ బార్ అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు, హైకోర్టు జస్టిస్ రామ సుబ్రమణియన్ తదితరులు

బోధనా సిబ్బంది నియామకానికి కొత్త విధానాలు

ముసాయిదాను ప్రజాభిప్రాయానికి పెట్టిన యూజీసీ

సాక్షి, అమరావతి: దేశంలో ఉన్నత విద్యను బలోపేతం చేయడం, ముఖ్యంగా వర్సిటీ విద్యలో పలు సంస్కరణలు తెచ్చేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కొత్త విధానాలను ప్రతిపాదిస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదాను శనివారం విడుదల చేసింది. దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలను కోరుతూ వెబ్సైట్లో ముసాయిదాను పొందుపరిచింది. వర్సిటీల్లో పరిశోధనా కోర్సుల్లో ప్రవేశాలు, వివిధ విభాగాల బోధనా సిబ్బంది నియామకాలకు అనుసరించాల్సిన విధానాల్లో పలు మార్పులు చేస్తూ కొత్త ప్రతిపాదనలు రూపొందించింది. అర్హతలు, అనుభవం, ఇతరత్రా అనేక అంశాలను ఇందులో పొందుపరిచింది. వీటిపై ఈనెల 28 లోగా అభిప్రాయాలు తెలుపవచ్చని వివరించింది. "ugcregulations2017@gmail.com' మెయిల్‌కు తమ అభిప్రాయాలు పంపాలని పేర్కొంది.

నియోజకవర్గానికో డీఈవోను నియమించాలి

ఏపీ హెడ్మాస్టర్ల అసోసియేషన్ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక ఉప విద్యాధికారిని (డీఈవో) నియమించాలని రాష్ట్ర హెడ్మాస్టర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలో సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు, ఇతర కార్యవర్గ సభ్యులు, పలు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. సర్వీసు రూల్స్ అమలుకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగించాలని, పాఠశాల నిర్వహణ గ్రాంటు, స్కూలు గ్రాంటు పెంచాలని, అవుట్ సోర్సింగ్‌లో అయినా అదనపు బోధనా సిబ్బందిని నియమించాలని, పదోన్నతులు కల్పించాలని కోరుతూ తీర్మానాలు చేశారు.

'కస్తూర్బా'ల్లో ఇక ఇంటర్ విద్య

మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి

పద్మనాభం (భీమిలి): రాష్ట్రంలోని కస్తూర్బా విద్యాలయాల్లో జూన్ నుంచి ఇంటర్ విద్యను ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లాలోని పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని ఆదివారం మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 352 కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయని, వీటిల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు 70,400 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని తెలిపారు. పదో తరగతి పూర్తి చేశాక వీరంతా ఇంటర్ చదువుకునేందుకు వేరే కళాశాలలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా కస్తూర్బా విద్యాలయాల్లో ఇంటర్ విద్యను అందిస్తామన్నారు. అనంతరం మంత్రి గంటా ఆ పాఠశాల విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. డీఈవో డి.లింగేశ్వరరెడ్డి, సర్వశిక్షా అభియాన్ పీవో టి.శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో జస్టిస్ సీతారామ్మూర్తి



జస్టిస్ సీతారామ్మూర్తి దంపతులకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం (ప్రత్తిపాడు): తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సీతారామ్మూర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఈవో జితేంద్ర, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ సీతారామ్మూర్తి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఈవో ప్రసాదాలను అందజేశారు.

త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న జస్టిస్ రజని



కోటప్పకొండలో జస్టిస్ రజని

నరసరావుపేట రూరల్: గుంటూరు జిల్లా కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి రజని ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆమెకు ఈవో బైరాగి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా జస్టిస్ రజని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆమెకు స్వామివారి తీర్థ,ప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య డిమాండ్

సాక్షి, అమరావతి: ఆర్టీసీ డిపోల్లో, జోన్, రీజనల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలోని ఓ కళ్యాణమండపంలో రాష్ట్రస్థాయి ఆర్టీసీ కార్యాలయ సిబ్బంది సదస్సు జరిగింది. ఇందులో ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఆఫీసుల్లోని సిబ్బందికి ఐదేళ్లకు ఒకసారైనా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ల మాదిరే క్లరికల్ సిబ్బందికి గ్రేడ్ పే ఇవ్వాలన్నారు. మొత్తం 33 డిమాండ్లతో యాజమాన్యానికి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. సదస్సులో ఎన్ఎంయూ రాష్ట్ర నేతలు రమణారెడ్డి, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఇచ్చింది తక్కువ.. చెప్పేది ఎక్కువ

బీజేపీపై టీడీపీ ఎంపీలు విమర్శ

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చాలా ఇచ్చామంటూ బీజేపీ విడుదల చేసిన లెక్కలన్నీ అవాస్తవమని టీడీపీ ఎంపీలు విమర్శించారు. బీజేపీ ఇచ్చింది తక్కువ.. చెప్పుకుంటుంది ఎక్కువని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడు తదితరులతో సమావేశమయ్యారు. అనంతరం గల్లా జయదేవ్ మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే నిధులిచ్చారు తప్ప ప్రత్యేకంగా కేంద్రమేమీ ఇవ్వలేదని చెప్పారు. విభజన చట్టంలోని హామీలకు సంబంధించి ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. బీజేపీ మద్దతుతోనే విభజన జరిగిందని, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే సహించబోమన్నారు. ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొన్నవన్నీ నెరవేర్చాలని కళా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. న్యాయం జరిగే వరకూ కేంద్రంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు తెలిపారు.

త్రిపురలో యువతకు ఉచిత స్మార్ట్‌ఫోన్లు

ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ వాగ్దానాలు

అగర్తలా: త్రిపురలో అధికారంలోకి వస్తే యువతకు ఉచితంగా స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేయటంతోపాటు రాష్ట్రంలో సెజ్‌లను ఏర్పాటు చేస్తామని బీజేపీ పేర్కొంది. ఆ పార్టీ నేత, కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ ఆదివారం త్రిపుర ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆహార శుద్ధి, ఐటీ, వెదురుకు సంబంధించిన పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల(సెజ్) ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇంటికో ఉద్యోగం, కళాశాల స్థాయి వరకు మహిళలకు ఉచిత విద్య, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏడో వేతన సంఘం సిఫారసుల అమలు కూడా ఉన్నాయన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులతోపాటు ఎయిమ్స్ స్థాయి ఆస్పత్రిని కూడా నెలకొల్పుతామని చెప్పారు. అగర్తలా విమానాశ్రయానికి త్రిపుర చివరి రాజు బీర్ బిక్రమ్ కిశోర్ మాణిక్య పేరు పెడతామన్నారు. అరవై మంది సభ్యులుండే త్రిపుర అసెంబ్లీకి ఈనెల 18వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి.

చంద్రబాబు కొత్త 'షో' తెరవెనుక..!



▶ మొదటి పేజీ తరువాయి

ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదని అంటున్నారు.

టీడీపీ ఎంపీల నిరసన డ్రామాలు

ఈ నెల 1వ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి కేంద్రం మొండిచేయి చూపింది. విభజన చట్టంలోని హామీల అమలు గురించి మాటమాత్రంగానైనా ప్రస్తావించలేదు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం వంటి కీలక అంశాల గురించి ఊసే లేదు. కొన్ని సంస్థలకు కేంద్రం అరకొరగా నిధులు కేటాయించి మమ అనిపించింది. కేంద్రం తీరుపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్ లోపలా, బయటా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ ఎంపీలు మాత్రం మౌనం వహించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా సీఎం చంద్రబాబు ఎక్కడా ప్రత్యక్షంగా నోరెత్తలేదు. కొన్నిరోజుల తర్వాత టీడీపీ ఎంపీలు సభలో నిరసన డ్రామా నడిపారు. అనంతరం బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇచ్చిన వివరణలోనూ ఏమాత్రం కొత్తదనం లేదు. విభజన హామీల అమలు, రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై జైట్లీ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోయినా కేంద్ర సహాయ మంత్రి సుజనా చౌదరి బల్లలు చరిచి హర్షం వ్యక్తం చేయడం గమనార్హం.

అన్యాయం జరిగినా కితాబులే

రాష్ట్ర విభజనలో కాంగ్రెస్, బీజేపీలతోపాటు టీడీపీ పాత్ర సైతం ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను విభజించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ చంద్రబాబు నాయుడు అప్పట్లో కేంద్ర ప్రభుత్వానికి స్వయంగా లేఖ రాసిన సంగతి అందరికీ తెలిసిందే. గత ఎన్నికల సమయంలో బాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. ఆ పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇస్తామన్న ప్రత్యేక హోదా ఐదేళ్లు సరిపోదు, కనీసం 15 ఏళ్లయినా కావాలన్నారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి 15 ఏళ్లు ప్రత్యేక హోదా సాధిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ, రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామిగా చేరాయి. ఇప్పటివరకూ కేంద్రం ప్రవేశపెట్టిన ఐదు బడ్జెట్లలోనూ టీడీపీ పాలుపంచుకుంది. టీడీపీ సభ్యులున్న కేంద్ర మంత్రివర్గం ఆమోదించించిన బడ్జెట్లను ఐదు సార్లు ఎన్డీయే సర్కారు ప్రవేశపెట్టింది. అన్ని బడ్జెట్లలోనూ ఏపీకి అన్యాయమే జరిగింది. అయినా ఇదేమిటని టీడీపీ అధిష్టానం ఏనాడూ ప్రశ్నించిన పాపాన పోలేదు. పైగా బడ్జెట్ అద్భుతం, కేటాయింపులు బాగున్నాయి, దేశంలో మిగిలిన అన్ని రాష్ట్రాలకంటే మన రాష్ట్రానికే ఎక్కువ నిధులొస్తున్నాయంటూ కీర్తించింది.

వెక్కిరిస్తున్న వైఫల్యాలు

నాలుగేళ్లుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రిక్తహస్తమే ఎదురవుతున్నా మౌనం వీడని చంద్రబాబు ఇప్పుడు హఠాత్తుగా నిద్ర నుంచి మేల్కొని తన పార్టీ నేతలను బీజేపీపైకి ఉసిగొల్పడం వెనుక మర్మం ఏమిటి? ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బాబు స్వరం మారిపోతోంది. సీఎంగా ఆయన నాలుగేళ్లలో రాష్ట్రానికి చేసింది పెద్ద గుండు సున్నా అని ప్రజలు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాబు ప్రత్యేక హోదా వద్దనుకున్నారు. ప్రత్యేక ప్యాకేజీ కూడా సాధించలేకపోయారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. ఇక ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాజధాని అమరావతి నిర్మాణానికి ఒక్క ఇటుక వేయడం కాదు కదా కనీసం ఒక పునాది కూడా తవ్వలేకపోయారు. బాబు వచ్చాడు గానీ జాబులైతే రావడం లేదు. ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. జాబు లేని వారికి ఇస్తామన్న నిరుద్యోగ భృతి అడ్రస్ లేకుండా పోయింది. రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు రావడం లేదు. పెట్టుబడుల రప్పిస్తానని నమ్మబలికి చంద్రబాబు రూ.వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి ఆర్భాటంగా సదస్సులు నిర్వహించారు. రూ.వేల కోట్ల పెట్టుబడులు సాధించుకొస్తానంటూ ప్రత్యేక విమానాల్లో విదేశాలకు వెళ్లొచ్చారు. ఇంత చేసినా ఒక్క రూపాయి పెట్టుబడి కూడా వచ్చిన దాఖలాలు లేవు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ఎక్కడ అమలవుతున్నాయో టీడీపీ నేతలు కూడా చెప్పలేని దుస్థితి. అధికార పార్టీ నేతల అవినీతి తారస్థాయికి చేరింది. మద్యం, ఇసుక, మట్టి, గనులు... కాదేదీ దోపిడీకి అనర్హం. ఎక్కడ చూసినా అక్రమ దందాలే. కాపులను బీసీల్లో, బోయలను ఎస్టీల్లో చేరుస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు స్పష్టంగా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక అసెంబ్లీలో తీర్మానాలు చేసి, కేంద్రానికి పంపించి ఈ విషయంలో తన పనైపోయిందంటూ చేతులు దులిపేసుకున్నారు. ఆ నెపాన్ని కేంద్రంపైకి తోసేశారు. అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైన టీడీపీ సర్కారు పాలనపై ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. దీంతో తన వైఫల్యాలను కేంద్రంపైకి నెట్టి, ఎన్నికల రణరంగంలో గట్టెక్కేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హోదాను అమ్మేశారు.. ప్యాకేజీకి పాతరేశారు

ఐదేళ్లు కాదు, పదేళ్లు సరిపోదు, పదిహేనేళ్లు ప్రత్యేక హోదా కావాల్సిందేనని ఎన్నికల సమయంలో ఊరూవాడా ప్రచారం చేసిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా గద్దెనెక్కాక ఆ సంగతే మర్చిపోయారు. తన సొంత ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను కేంద్రానికి అమ్మేశారు. దాని స్థానంలో 'ప్రత్యేక ప్యాకేజీ'కి సై అంటూ తలూపారు. ప్యాకేజీ పేరిట కేంద్ర ప్రభుత్వం అర్ధరాత్రి తర్వాత చిమ్మచీకట్లో చేసిన ప్రకటనను స్వాగతించారు. రాష్ట్రాభివృద్ధికి హోదా కంటే ప్యాకేజీ మేలు అంటూ జనాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఆయన అనుకూల మీడియా సైతం అదే రాగం అందుకుంది. నిజానికి ప్రత్యేక ప్యాకేజీలో ప్రత్యేకత ఇసుమంతైనా లేదు. సాధారణంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, సంస్థలకే కేంద్రం ప్యాకేజీ ముసుగు తొడిగింది. ఆ ప్యాకేజీలతో ప్రయోజనం సున్నా అని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ, ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెత్తీనోరూ బాదుకున్నా టీడీపీ లెక్కచేయలేదు. పైగా తాము రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షం అడ్డు తగులుతోందంటూ దుష్ప్రచారం సాగించింది. కేంద్రం నుంచి రాష్ట్రానికి అద్భుతంగా ఆర్థిక సాయం అందుతోంది, ఇకపై మన రాష్ట్రమే నంబర్ వన్ అంటూ సాక్షాత్తూ చంద్రబాబుతో సహా టీడీపీ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ పొగిడేశారు.

నాలుగేళ్లుగా నిద్రపోయారా?

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వర రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రత్యేక హోదాను పక్కనబెట్టారు.. ఆ తర్వాత ప్రత్యేక ప్యాకేజీ అన్నారు.. దాన్నీ పక్కనబెట్టారు.. ఇప్పుడు అదనపు నిధులు అంటున్నారు.. ఇవేవీ వచ్చేలా కనిపించడంలేదని ఆయన తెలిపారు. ఏపీకి ఇచ్చిన అన్ని హామీలను కేంద్రం అమలు చేయాల్సిందేనని, అలా కాలేదంటే అందుకు బాధ్యత ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వానిది కూడా అని కారత్ స్పష్టంచేశారు. కాగా, ఏవో ఇచ్చామంటూ కేంద్రం ఇప్పుడు అంకెలు చెబుతోందని, అవి ఎంతవరకు నిజమో చూడాలన్నారు.

నిధులు కేటాయించకుండా 'మద్దతు' ఎలా?

వ్యవసాయంలో ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇస్తామని ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారని.. నిధుల కేటాయింపులు లేకుండా చేసిన ఈ ప్రకటనవల్ల రైతులకు ఉపయోగం ఏముంటుందని కారత్ ప్రశ్నించారు. ఆరోగ్య పథకం కూడా అలాంటిదేనని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా తమ విధానం ఉంటుందని కారత్ స్పష్టంచేశారు. వచ్చే ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరిగే పార్టీ జాతీయ మహాసభల్లో తమ ఎన్నికల ఎత్తుగడపై చర్చిస్తామని చెప్పారు. సీపీఎం రాజకీయ ముసాయిదా ప్రణాళిక ఈనెల 13న విడుదల అవుతుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ కారత్

వామపక్ష ఐక్యతను విస్మరిస్తే ఎలా?

కాగా, గత మూడేళ్ల కాలంలో వివిధ రాజకీయ, సామాజిక ఆర్థికాంశాలపై ప్రత్యక్ష, పరోక్ష పోరాటాల కోసం తాపత్రయపడినప్పటికీ అదే సమయంలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను విస్మరించామని పార్టీ అభిప్రాయపడింది. అలాగే, ఉద్యమం పెరుగుతున్న స్థాయిలో నిర్మాణం పెరగడంలేదని, నిర్మాణ బలహీనతలు అధిగమించనిదే పునాదులు పటిష్టంకావని ప్రతినిధులు వివరించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా కొందరు నాయకులు విలాస జీవితాలకు లొంగిపోతున్నారన్న ఆవేదన వ్యక్తమైంది. ఇదిలా ఉంటే, రాష్ట్రంలోని సామాజికాంశాల ఆధారంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో ఫ్రంట్‌ను ఏర్పాటుచేయాలని మహాసభలో రెండో రోజైన ఆదివారం పార్టీ తీర్మానం చేసింది. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రత్యేక హోదాపై రాజీలేని పోరాటం చేయాలని కూడా మహాసభ తీర్మానించింది. కాగా, మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం రాష్ట్ర పార్టీకి నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటారు. ఈసారి కూడా రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పి.మధు మళ్లీ ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. ఎంఏ గఫూర్, వి. శ్రీనివాసరావులు కూడా పోటీలో ఉన్నప్పటికీ మధుకే మళ్లీ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని తెలిసింది.

పటిష్టంగా వైఎస్సార్‌సీపీ పునాదులు

రాష్ట్ర మహాసభల్లో ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. వివిధ రాజకీయ పార్టీల స్థితిగతులను, పార్టీ నిర్మాణ స్వరూపాన్నీ, గత కార్యక్రమాల తీరును నిశితంగా సమీక్షించారు. రాజకీయ పార్టీలలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై జరిగిన చర్చలో.. 23 మంది ఎమ్మెల్యేలను అధికార టీడీపీ కొనుగోలు చేసినా ఆ పార్టీ పునాదులు పటిష్టంగానే ఉన్నాయని ప్రతినిధులు అభిప్రాయపడినట్లు తెలిసింది. వైఎస్సార్‌సీపీని ఆదరిస్తున్న ఆయా వర్గాలు చెక్కుచెదరలేదని, ఆ వర్గాలలో ఆ పార్టీ బలంగానే ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

విద్య, సాహిత్యాధ్యాయం జ్ఞానార్జనకు ఉపయోగించాలి

కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



సాక్షి, న్యూఢిల్లీ: విద్య, సాహిత్యాధ్యాయాన్ని కేవలం ఉపాధి, వ్యాపారానికే పరిమితం చేయకుండా జ్ఞానార్జనకు సాధనంగా ఉపయోగించాలని హార్వర్డ్ విద్యార్థులకు కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సూచించారు. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన భారతీయ ఉత్సవం–2018 సమ్మేళనంలో సాహిత్యంపై జరిగిన చర్చాగోష్టిలో ప్రధాన కర్తగా యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విజ్ఞానం, ఇంటర్నేట్ విస్తరణతో విద్యార్థుల్లో గ్రంథ పఠనం తగ్గిపోతోందన్నారు. వారిని గ్రంథ పఠనం దిశగా మళ్లించడం రచయితల బాధ్యతన్నారు. మారుతున్న కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సామాజిక సమస్యలకు పరిష్కారం చూపేలా రచనలు చేయాలన్నారు. ఈ సమ్మేళనంలో ఆచార్య హోమి బాబా సమన్వయకర్తగా, బాల సాహిత్య రచయిత్రి పారో ఆనంద్, భారతీయ ఆంగ్ల రచయిత అమిష్ త్రిపాఠి వక్తలుగా పాల్గొన్నారు.

పరీక్షలో నెగ్గినా.. ఇంటర్వ్యూలో నెగ్గునా?

- ఏపీపీఎస్సీ మౌఖిక పరీక్షలపై అనుమానపు మబ్బులు
- మార్కుల కేటాయింపునకు ఓ ప్రాతిపదిక లేకపోవడంపై అభ్యర్థుల ఆందోళన
- ఇంటర్వ్యూ బోర్డుకు 50 మార్కులు అప్పగించడంపైనా అనుమానాలు
- నెగిటివ్ మార్కులున్నప్పుడు బోర్డు తీరుతో మెరిట్ తారుమారు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న మౌఖిక పరీక్షల (ఇంటర్వ్యూలు) తీరుపై అనుమానాలు ముసురుకుంటున్నాయి. ఇంటర్వ్యూ బోర్డుకు ఏకంగా 50 మార్కులు అప్పగించడం, అభ్యర్థులకు మార్కుల కేటాయింపులో విపరీత వ్యత్యాసం కనిపిస్తుండడంతో అనుమానాలు ఎక్కువవుతున్నాయి. డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల మార్కుల సమాచారాన్ని ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేయడం తెలిసిందే. ఈ పోస్టుల ఆన్‌లైన్ రాత పరీక్షలో తక్కువ మార్కులు సాధించిన వారికి ఇంటర్వ్యూల్లో అత్యధిక మార్కులు వచ్చాయి. టెస్టులో ఎక్కువ మార్కులు సాధించిన వారికి తక్కువ మార్కులు పడ్డాయి. వీరి మధ్య తేడా ఏకంగా 35 మార్కుల వరకు ఉండడంతో మెరిట్ అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. ఇంటర్వ్యూ బోర్డు.. మార్కుల కేటాయింపునకు ఒక ప్రాతిపదిక, స్కేలింగ్ విధానం అంటూ లేకుండా కనిష్టంగా 9 మార్కులు, గరిష్ఠంగా 45 మార్కులు కేటాయిస్తోంది. అంటే అభ్యర్థుల మార్కుల మధ్య వ్యత్యాసం 35కు పైగా ఉంటోంది. ఫలితంగా మెరిట్‌లో కిందనున్నవారు ఇంటర్వ్యూల తరువాత మొదటిస్థానానికి చేరుతుండగా, అగ్రస్థానంలో ఉన్న వారు కిందకి జారిపోతూ అవకాశాలను కోల్పోతున్నారు. ఉదాహరణకు డిగ్రీ లెక్చరర్ హిస్టరీ సబ్జెక్టు ఆన్‌లైన్ టెస్టులో జి.పుష్పలత అనే అభ్యర్థి ఓపెన్ కేటగిరీ మెరిట్‌లో అగ్రస్థానంలో ఉన్నారు. రాతపరీక్షలో ఆమె కన్నా 10 మార్కులు తక్కువ ఉన్న మరో ముగ్గురు ఇంటర్వ్యూల అనంతరం అగ్రస్థానానికి రావడం గమనార్హం. ఇలా చాలా మందికి జరిగిందని పేర్కొంటున్నారు. డిగ్రీ లెక్చరర్ పోస్టులకే కాకుండా గ్రూప్ 1తో పాటు మరికొన్ని పోస్టుల ఇంటర్వ్యూల్లోనూ ఇదే విధానం ఉండడంతో అభ్యర్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

అభ్యర్థుల అనుమానాలు..

- నెగిటివ్ మార్కుల విధానం ఉన్నప్పుడు మౌఖిక పరీక్షల బోర్డులకు 50 మార్కులు కేటాయించవచ్చా? మార్కుల కేటాయింపులో భారీ తేడాలుండడం వల్ల మెరిట్ జాబితాలు తారుమారు అవ్వవా? ఒకే కేటగిరీలో ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలో కనిష్ఠ, గరిష్ఠ మార్కుల కేటాయింపులో ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు ఉంటోంది?
- ఇంటర్వ్యూల్లో 50 మార్కులకు గాను గరిష్ఠంగా 45 మార్కులు అంటే 90 శాతం ఇస్తున్నారు. అంటే ఆన్‌లైన్ రాత పరీక్షలో 23 ప్రశ్నలను కరెక్టుగా రాస్తే వచ్చే మార్కులతో ఇది సమానం. నెగిటివ్ మార్కుల విధానం ఉన్నప్పుడు ఇంటర్వ్యూల్లో ఏ ప్రాతిపదికన ఇంత భారీగా మార్కులు కేటాయిస్తున్నారు? అలాంటప్పుడు నెగిటివ్ మార్కుల విధానం ఎందుకు?
- ఇంటర్వ్యూలకు 1:2 చొప్పున పిలుస్తున్నందున ఒక్కరికి మాత్రమే ఉద్యోగం వస్తుంది. కానీ వారి ఇంటర్వ్యూ మార్కుల మధ్య తేడా మూడో, నాలుగో కాకుండా ఏకంగా 20 నుంచి 30 మార్కుల తేడా ఉండడంలో మతలబేమిటి?
- ఆన్‌లైన్ రాత పరీక్షల మార్కులను ముందుగానే మెయిల్ ద్వారా పంపిస్తున్న ఏపీపీఎస్సీ.. ఇంటర్వ్యూ మార్కులు కలపడానికి రెండు నెలల సమయం తీసుకోవడంలో ఆంతర్యమేమిటి? గతంలో ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూలు నిర్వహించినప్పుడు అదే రోజు సాయంత్రం లేదా మరునాడు ఆయా అభ్యర్థులకు వచ్చిన మార్కులను ప్రకటించేది.

సద్వినియోగం చేసుకునేవారికే దానం చేయాలి

జస్టిస్ బి.శివశంకరరావు



భైరవకోన (సీఎస్‌పురం): యోగ్యత ఉన్నవారికి, దానాన్ని సద్వినియోగం చేసుకునే వారికే దానం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీ దుర్గా భైరవ బ్రాహ్మణ అన్నదాన సత్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ నిర్వహించిన గణపతి హోమం, అన్నపూర్ణేశ్వరి శాంతి హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ శివశంకరరావు మాట్లాడుతూ.. విద్య వినయాన్ని ప్రదర్శిస్తుందని చెప్పారు. అహంతో ఎవరైనా దానం చేస్తే ఫలితం ఉండదని, మంచితనం మానవత్వం మనిషికి ముఖ్యమన్నారు. అలాగే చట్టాలు పేదవాళ్లకు అండగా ఉండేలా చూడాలన్నారు. భైరవకోనను పర్యాటక కేంద్రంగా మారుస్తామని, మిట్టపాలెం, మాలకొండ ఆలయాలను అనుసంధానం చేసేలా ప్రణాళిక రూపొందించనున్నట్టు ఎమ్మెల్యే బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఎస్పీ రాజశేఖర్‌బాబు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనందసూర్య, బద్వేలు మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'సిరివెన్నెల'కు 'నాగభైరవ' అవార్డు ప్రదానం

పురస్కారంతో మధురానుభూతి : సీతారామశాస్త్రి



నాగభైరవ అవార్డు అందుకున్న అనంతరం సభలో మాట్లాడుతున్న సిరివెన్నెల సీతారామశాస్త్రి

నెల్లూరు (బృందావనం): సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి 2017 సంవత్సరానికి సంబంధించి సుప్రసిద్ధ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక నాగభైరవ అవార్డు అందుకున్నారు. నెల్లూరు పుర మందిరంలో ఈ అవార్డును ఆదివారం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రముఖ సంఘసేవకులు, ఆధ్యాత్మికవేత్త, వీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. అవార్డుతోపాటు రూ.25వేల పారితోషికం, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ, సందేశాత్మకమైన పాటలు అందించిన సిరివెన్నెల సీతారామశాస్త్రిని నాగభైరవ అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. 'సిరివెన్నెల' మాట్లాడుతూ, ఎందరో మహోన్నత వ్యక్తులకు జన్మనిచ్చిన సింహపురి సీమలో నాగభైరవ అవార్డును తాను అందుకోవడం మధురానుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ చిన్ని నారాయణరావు, కళాంజలి అనంత్, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, మాజీమంత్రి ఎం.మహీధర్‌రెడ్డి, డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు కుమార్తెలు కూకట్ల రాజ్యలక్ష్మి, ధూళిపాళ్ల రవీంద్రకుమారి, మన్నం మనోరమ, కుమారుడు వీరబాహు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు చట్టం తేవాలి

నాస్తికుల డిమాండ్



సదస్సులో ప్రసంగిస్తున్న కత్తి పద్మారావు

నిడమర్రు (మంగళగిరి టౌన్): మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టం తీసుకురావాలని నాస్తికులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామం చార్వాక ఆశ్రమంలో నిర్వహిస్తున్న 26వ జాతీయ నాస్తికమేళా ముగింపు సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో భూములను పలు మత, ఆధ్యాత్మిక సంస్థలకు, స్వామీజీలకు కట్టబెట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. దేవ లౌకిక వ్యవస్థను అవమానపరుస్తూ పాలకులు, అధికారులే మత ప్రచారం, దేవాలయాలు దర్శించుకోవడం మానుకోవాలని హితవుపలికారు. ఈ సదస్సులో హేతువాద సంఘం పూర్వ కార్యదర్శి కత్తి పద్మారావు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దేశద్రోహులని అభివర్ణించారు. కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. చరిత్రలో వేమన నుంచి గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, పెరియార్ రామస్వామి వంటి అనేక మంది అందించిన హేతువాద సాహిత్యాన్ని భౌతికవాద సాహిత్య విద్యా విధానం ద్వారా మరుగున పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘాల రాష్ట్ర కార్యదర్శి పి.వరలక్ష్మి, కార్మిక సంఘ నాయకుడు జేవీ కిశోర్‌బాబు, మోతుకూరి అరుణకుమార్, సమాజ అధ్యక్షులు కె.అయ్యన్న, బి.సుధాకర్, గృహలక్ష్మి, జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



13, 20 తేదీల్లో వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం

14, 21 తేదీల్లో చంటిపిల్లల తల్లిదండ్రులకు..

సాక్షి, తిరుమల: వయో వృద్ధులు (65 ఏళ్లు పైబడినవారికి), దివ్యాంగులకు ఈనెల 13, 20 తేదీల్లో తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం టోకెన్లను టీటీడీ అదనంగా జారీ చేయనుంది. ఆయా తేదీల్లో ఉదయం 10.00 గంటలకు వెయ్యి, మధ్యాహ్నం 2.00 గంటలకు రెండు వేల టోకెన్లు, 3.00 గంటలకు వెయ్యి టోకెన్లను జారీ చేయనున్నారు. అలాగే ఈనెల 14, 21 తేదీల్లో ఐదేళ్ల లోపు చంటి పిల్లల తల్లిదండ్రులకు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుపథం మార్గం ద్వారా శ్రీవారిని దర్శించుకునేందుకు అనుమతిస్తారు.

ముగిసిన గుణదలమాత మహోత్సవాలు


గుణదల మేరిమాత ఉత్సవాలలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ తెలగతోటి రాజారావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులు పాటు జరిగిన మహోత్సవాల్లో ఆఖరి రోజు ఆదివారం సెలవు కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గుణదల కొండ మార్గాలు, పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆదివారం ఉదయం బిషప్ గ్రాసీ హైస్కూల్ గ్రౌండ్‌లోని ఆధ్యాత్మిక కళావేదికపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, గుణదల మాత పుణ్యక్షేత్రం రెక్టార్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ పసల తోమస్, ఫాదర్ తెలగతోటి పాలు, డీజీఎం ఫాదర్ జి.మైఖేల్, కరస్పాండెంట్ ఫాదర్ ఇంటి ఆంథోని, ఫాదర్ కొండ్రు సింహరాయులుతో పాటు, విజయవాడ కేథలిక్ పీఠానికి చెందిన 120 మందికిపైగా గురువులతో సమష్టి దివ్యపూజా బలి సమర్పించారు. కాగా, సాయంత్రం జరిగిన ముగింపు ఉత్సవాల్లో బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావుతో పాటు పెద్ద సంఖ్యలో ఫాదర్స్ పాల్గొన్నారు. సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హామీలు ఎక్కడ అమలుచేశారో చూపండి!

బీజేపీకి కేవీపీ డిమాండ్ ● 85శాతం అమలుచేసినట్లు మభ్యపెడుతున్నారు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో 85శాతం వరకు అమలుచేశామని రాష్ట్ర ప్రజలను బీజేపీ మభ్యపెడుతోందని ఎంపీ కేవీపీ రామచంద్రారావు విమర్శించారు. ఢిల్లీలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీల్లో బీజేపీ ఎక్కడ అమలుచేసిందో చూపాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ శనివారం విడుదల చేసిన 27 పేజీల్లో ఎక్కడా కూడా హామీల అమలుపై స్పష్టత లేదన్నారు. ప్రత్యేక హోదాను ఆర్థిక సంఘం అడ్డు చెబుతోందన్న సాకుతో బీజేపీ దానిని అమలుచేయకపోవడం ఆశ్చర్యకరమన్నారు.

సర్దు'బాట'లో చంద్రబాబు

రాష్ట్ర విభజన రోజు ఏపీ రాజధాని అభివృద్ధికి రూ.ఐదు లక్షల కోట్లు ఇవ్వాలని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు కేవలం రూ.2,500 కోట్లతో సర్దుకున్నారని కేవీపీ మండిపడ్డారు. పోలవరం, ఇతర నిర్మాణాలకు సంబంధించిన లెక్కలు అడగకపోతే చాలు అన్న ప్రతిపాదనతో కేంద్రం ఇచ్చేదానితో చంద్రబాబు సర్దుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఏపీకి ఇచ్చిన నిధులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, ఎంపీ గోకరాజు గంగరాజు లెక్కలు చెప్పడంపై చంద్రబాబు వారిని నిలదీసినట్టు తనకు సమాచారం అందిందన్నారు. 'మీరు నా ప్రయోజనాల కోసం మాట్లాడారా? లేక మీ ప్రయోజనాల కోసం మాట్లాడారా?' అని వారిని ప్రశ్నించినట్టు తెలిసిందని కేవీపీ చెప్పారు.సొంత పార్టీ నేతలను కాంగ్రెస్ గౌరవించుకోలేదని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలో నిజంలేదని కేవీపీ స్పష్టంచేశారు.

మార్చి 31లోపు కాపులకు బీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం



పుంగనూరు: కాపు, బలిజలకు బీసీ–ఎఫ్ సర్టిఫికెట్లు మంజూరు చేయకుండా మోసం చేయాలని చూస్తే సీఎం చంద్రబాబునాయుడుకు తగిన గుణపాఠం చెబుతామని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం హెచ్చరించారు. మార్చి 31లోపు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బలిజల ఆత్మీయ కలయికలో భాగంగా ఆదివారం ఆయన చిత్తూరు జిల్లా పుంగనూరుకు వచ్చారు. సభ అనంతరం ముద్రగడ విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయ రిజర్వేషన్లు లేకుండా కేవలం విద్య, ఉద్యోగాలకు మాత్రమే కల్పిస్తే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. ప్రస్తుతం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసినందున వెంటనే తమకు రిజర్వేషన్లు వర్తింపజేసి, బీసీ–ఎఫ్ కోటాలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

భావితరాలకు గురజాడ స్ఫూర్తి

గురజాడ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అరుణ


స్ఫూర్తి పురస్కారాలను అందుకున్న వారితో గురజాడ ఫౌండేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు స్ఫూర్తిని భావితరాలకు అందించాలని గురజాడ ఫౌండేషన్ (యూఎస్ఏ) వ్యవస్థాపకురాలు అరుణ గురజాడ పిలుపునిచ్చారు. విజయనగరంలో ఫౌండేషన్ తరఫున ఆదివారం నలుగురికి స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురజాడ పేరు మీద ఏటా ఫౌండేషన్ తరఫున నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల వేంకట రమణమ్మకు గురజాడ అంతర్జాతీయ స్ఫూర్తిరత్న పురస్కారం, మాడిశెట్టి గోపాల్ (కరీంనగర్), నండూరి సూర్యనారాయణ (హైదరాబాద్), పల్లి గోవిందరావు (విశాఖ)లకు అంతర్జాతీయ గురజాడ సేవారత్న పురస్కారాలు అందజేశారు. ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు శాంతమ్మను సత్కరించారు.

టీడీపీ ఎంపీలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి



తిరుపతి అన్నమయ్య సర్కిల్: పార్లమెంట్ సమావేశాల్లో టీడీపీ ఎంపీలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని, వారిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ విషయంలో ఏపీకి అన్యాయం జరిగిందని మిత్ర పక్షంగా ఉన్న టీడీపీ అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. విభజన హామీల్లో కొన్నింటిని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించిందని, మరికొన్ని సమస్యలు పరిష్కారం దిశగా సాగుతున్నాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ముఖమే చూడని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు శివప్రసాద్ విచిత్ర వేషధారణతో నరేంద్రమోదీని తప్పుపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీ గల్లా జయదేవ్ విశ్వసనీయత గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చిత్తూరు జిల్లాలో గల్లా కుటుంబ అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు ప్రజలందరికీ తెలుసునని అన్నారు. అమరరాజా ఫ్యాక్టరీ విషయంలో అమాయక ప్రజల నుంచి మోసపూరిత హామీలతో భూములు లాక్కొన్న ఘన చరిత్ర గల్లా కుటుంబానిదేనని ఎద్దేవా చేశారు.

వివాహమై ఏడాది గడవక ముందే..

దంపతుల ఆత్మహత్య

మృతురాలు ఏడో నెల గర్భిణి



ఉరేసుకున్న నాగార్జున, భవాని దంపతులు

పల్లెర్లమూడి (నూజివీడురూరల్): అన్యోన్యంగా సాగిపోతున్న వారి జీవితంలో ఏం జరిగిందో ఏమోగాని అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని దంపతులిరువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన కృష్ణా జిల్లాలోని పల్లెర్లమూడి అనే గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కలిదిండి నాగార్జున(26)కు పెడన మండలం బలిపర్రు గ్రామానికి చెందిన భవానీ(22)తో గతేడాది ఏప్రిల్ నెలలో వివాహమైంది. నాగార్జున ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా భవాని ఇంట్లోనే ఉంటోంది. భవాని ప్రస్తుతం ఏడో నెల గర్భిణి. శనివారం రాత్రి నిద్రపోయిన దంపతులు ఆదివారం ఉదయం తలుపు తెరవలేదు. తలుపు ఎంత కొట్టినా స్పందన లేకపోవడంతో నాగార్జున తండ్రి నాగరాజు తలుపు గడియను కర్రతో తీసి పరిశీలించారు. అప్పటికే వారు రేకుల షెడ్డుకు వేలాడుతూ విగతజీవులుగా కనిపించారు. వారి గదిలో 'మా చావుకు ఎవ్వరూ కారణం కాదు జీవితం మీద విరక్తితోనే ఆత్మహత్య చేసుకుంటున్నాం' అని రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం నూజివీడులోని ఏరియా ఆస్పత్రికి భవానీని వైదపరీక్షలకు నాగార్జున తీసుకెళ్లాడు. దంపతులు తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఆందోళనతో వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. వైద్యులు వీరికి రక్త పరీక్షలు చేశారని, ఆ రిపోర్టే వీరి బలవన్మరణానికి కారణమై ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడులోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగాలు భర్తీ చేయకుంటే అమరావతి ముట్టడిస్తాం

తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, లేకపోతే నిరుద్యోగ యువతతో కలిసి అమరావతిని ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖలోని ఎంవీపీ కాలనీలో ఒక ప్రైవేట్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస ఉపాధి లేక రాష్ట్ర యువత అల్లాడుతోందన్నారు. పలు ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ వాటిని భర్తీ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు.



విజయవాడ | సోమవారం | ఫిబ్రవరి | 12 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com

నాగరిక కాటు

పాము కాటుకు మందుంది. అమాయక గిరిజన్నలో విరుగుడుంది. పాలు తాగిన నాగరిక మనిషిలో తిరుగుడుంది... తిరుగు కాటుంది.

కథాసారం

ఏలూరులో చూసుకోవాల్సిన పని అయిపోయింది. ప్లీడరు గారు పక్కలు ఏర్పాటు చేయిస్తానన్నా వినక కారు స్టార్టు చేశాడు రామచంద్రం. రాత్రి పది దాటింది. సరిగ్గా తొక్కితే గంటన్నరలో తణుకులో ఉండొచ్చు.



కలెక్టరు గారింట్లో పెళ్లి సరీగా ఉదయం ఏడు గంటలకి. నాగభూషణం మీదా, రామచంద్రం మీదా భరోసా వేసుకుని కూర్చున్నారు కలెక్టరు గారు. కలెక్టరు గారింట్లో శుభకార్యమంటే వేరే చెప్పాలా!

రామచంద్రం పెద్ద టెన్నీస్ చాంపియన్. కాలవ ఒడ్డున పెద్ద మేడవుంది. నాగభూషణం కలప వ్యాపారం నడుపుతున్నాడు. కట్టడం ఎప్పుడూ ఖద్దరే. భూషణం అల్లుడు అవధాని కూడా వాళ్లెంబడి వున్నాడు. ఇంకా కుర్రాడు.

ఆరుమైళ్లు వచ్చేప్పటికి కారు ఆగిపోయింది. రామచంద్రం దిగి బానెట్ తీసి చూశాడు. 'వెధవ కారులా ఉంది. నడచి వెనక్కి పోదాం పద' అన్నాడు నాగభూషణం.

'అర్జునుడు గాండీవాన్ని తిట్టినా సహిస్తాడేమో గానీ యీ కారుని తిడితే మాత్రం నేనూరుకోను' అన్నాడు రామచంద్రం. కారు కిందా మీదా ఏవో పరీక్ష చేశాడు. చివరికి ఆల్‌రైట్ అంటూ కారులో కూర్చున్నాడు.

ఎర్రని పొడుగాటి రోడ్డు మీద కారు వెళుతూంటే చల్లని గాలి మొహానికి కొడుతోంది. నల్లని ఆకాశం మీద జ్వాలా పుష్పాల లాగా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

మళ్లీ కారు సడెన్‌గా ఆగిపోయింది. రామచంద్రం విసుగ్గా దిగాడు. బానెట్ తీసి పరీక్షించాడు. 'సరిగ్గా కనపడడం లేదు యీ గుడ్డి వెన్నెలలో' అన్నాడు. అంతవరకూ వెన్నెల ఉన్నట్టు అవధానికి అనిపించలేదు. ఆకాశం కేసి చూశాడు. జేగురు రంగుగా ఉన్న చంద్రుడి మీద పల్చని మబ్బులు తారాడుతున్నాయి. దారి వెంట వెళ్తున్న ఆసామీలు గీసిన అగ్గిపుల్లల వెలుగులో ఏదో మరమ్మత్తు చేశాడు రామచంద్రం. బయలుదేరుతుండగా, ఆసాములు 'జాగ్రత్త బాబూ. అడవిలో ఏదో చిరుతపులి' ఉందన్న కబురును చెవిన వేశారు. దాన్ని కొట్టేస్తూ, ఏక్సిలేటర్ మీద కాలు నొక్కాడు రామచంద్రం. కారు రయ్యిమని దూసుకుపోయింది. 'అడవి వచ్చేసింది. ఇది దాటితే యింక పదిహేను మైళ్లు తణుకు' అన్నాడు రామచంద్రం. నాగభూషణం వెనక్కి జేర్లబడి నిద్దరోతున్నాడు. అవధాని దట్టంగా అలుముకుపోయిన అడవిని చూస్తున్నాడు. అంతా కటిక చీకటి.

ఇంజన్‌లో ఏదో ఠప్‌మని పేలినట్టయింది. నాగభూషణం ఉలిక్కిపడ్డాడు. కారు ఒక గంతు వేసి ఆగిపోయింది. రామచంద్రం దిగి పనిముట్లు టిక్‌టిక్‌మనిపించాడు. 'వద్దురా యీ కార్లో ప్రయాణం అంటే విన్నావు కాదు' అన్నాడు భూషణం. 'అబ్బ చంపకు, వెధవ గోలా నువ్వూ' రామచంద్రం సహనం కోల్పోయాడు. 'ఆఖరి ప్రయత్నం చేస్తాను. ఒక లావుపాటి కర్రవుంటే చూడాలి. కారును పైకి ఎత్తి పట్టుకోవాలి' అంటూ రోడ్డు వారకు పోయి కర్ర కోసం వెదుకుతున్నాడు.

రోడ్డు వారనే చింతచెట్లూ రావిచెట్లూ ఉన్నాయి. ఒక పెద్ద మర్రిచెట్టు ఊడలతో భయంకరంగా వుంది. చెట్టుచెట్టుకీ మధ్య యీత ముళ్ల పొదలు, బ్రహ్మచెముడు డొంకలు, రకరకాల తీగలూ అల్లిబిల్లిగా చుట్టుకున్నాయి.

హఠాత్తుగా 'భూషణం పాము పాము' అన్న కేక నిశ్శబ్దాన్ని చీలుస్తూ వినపడింది. 'రామచంద్రం' అంటూ భూషణం పరుగెత్తుకెళ్లాడు. పెద్ద పాము మెలికలు తిరుగుతూ గుడ్డి వెన్నెలలో మెరుస్తూ వెళ్లిపోయింది. అవధాని ప్రాణాలు బిగుసుకుపోయాయి. రామచంద్రం వణికిపోతున్నాడు. రెండు చేతులతోనూ పొదివి పట్టుకుని రామచంద్రాన్ని తీసుకువచ్చాడు భూషణం. అవధాని కారు తలుపు తీశాడు. వెనుక సీటులో పడుకోబెట్టారు. కండువా తీసి కాలిమీద గట్టిగా బిగించి కట్టారు. రామచంద్రం కళ్లల్లో విపరీతమైన భయం సుళ్లు తిరిగింది. పెదవుల చివరి నుండి నురగ కక్కుతున్నాడు. 'మనకెంత గతి పట్టిందిరా' ఏడుస్తున్నాడు భూషణం.



తిలక్

బాలగంగాధర తిలక్ (1921–66) 'నల్లజర్ల రోడ్డు' కథ సారాంశం ఇది. ఈ కథ ఆంధ్రపత్రిక ప్లవ సంవత్సరాది సంచిక (1961)లో ప్రచురితం. కథకుడు కూడా అయిన తిలక్ కవిగా మరింత ప్రసిద్ధుడు. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అన్నాడు. 'అమృతం కురిసిన రాత్రి' ఆయన కవితల సంకలనం.

ఇంతలో ఏదో మువ్వల చప్పుడు. ఒక ముసలివాడు రోడ్డు మీద నున్న పొదలను తప్పించుకుని వస్తున్నాడు. నల్లని వంగిపోయిన ఒళ్లు. భూషణం తడబడుతూ అన్నాడు: 'ఎ ఎ ఎవరది?'

'సిద్దయ్యని బాబూ పాములవాణ్ణి' అన్నాడు ముసలాయన.

'పాములవాడివా?' దైవసంకల్పం వుంటే కానీ యీ అడవిలో యిటువంటి వేళ ఒక మనిషి, అందులో పాములవాడు కనిపించడు. భూషణం కారులోంచి దూకి సిద్దయ్య రెండు చేతులూ పట్టుకున్నాడు. రామచంద్రాన్ని సిద్దయ్య పరీక్షగా చూశాడు. 'ఇంకా బతికే వున్నారు బాబయ్యా' అన్నాడు బాధతో తోక తెగిన బల్లిలా గిజగిజలాడుతూన్న ప్రాణిని చూసి. 'మంత్రం వేసి బతికించావా సగం ఆస్తి నీకు రాయిస్తాను' అన్నాడు భూషణం.

'అదృష్టం వుంటే బతకొచ్చును బాబయ్యా, అక్కడ పాకలోకి తీసుకురండి. వేరు ముక్కతో మంత్రం వెయ్యాలి'.

రామచంద్రాన్ని గుడిసెలోకి మోసుకెళ్లారు. నులకమంచంలో పడుకున్న యువతిని 'సూరీడు లే లే' అంటూ ముసలాయన తట్టి లేపాడు. దాని మీద రామచంద్రాన్ని పడుకోబెట్టారు. సిద్దయ్య రెండు మూడు సంచీలలో చెయ్యి పెట్టి వెదికాడు. పూసలూ పెంకులూ వేర్ల ముక్కలూ రాళ్లూ ఏవేవో ఉన్నాయి. కావాల్సిన వేరు ముక్కలేదు.

దూరంగా వెలగచెట్టు అవతల పొదల కాడ ఆ వేరుగల మొక్కలున్నాయి. అక్కడ పాముపుట్టలూ ముళ్లపొదలూ జాస్తి. ముసలాయనకు చీకటిపడితే చూపు సరీగా ఆనదు. భూషణం పర్సులోంచి డబ్బు తీయబోయాడు. 'నీ డబ్బుకి ఆశపడ్డానా మంత్రం పనిచెయ్యదు' కఠినంగా అన్నాడు సిద్దయ్య.

'ఈ అయ్యకి పెదవులు నల్లపడి పోతున్నాయి' అంది సూరీడు. భూషణం అదిరిపడ్డాడు. ఇంతకు ముందు రేగిన ఆశ గప్పున ఆరిపోయినట్టయింది. 'పోనీ నేను వెళ్లి తీసుకురానా' అంటూ సూరీడు పరుగెత్తింది. రామచంద్రం చివరి ఘడియల్లో ఉన్నాడు. ఒక్కొక్క నిమిషమే బలవంతంగా గడుస్తోంది. ఇంతలో సూరీడు తలుపు తోసుకుని లోపలికి వచ్చింది. చేతిలో అయిదారు మొక్కలున్నాయి. సిద్దయ్య సంజ్ఞతో గబగబా వేరు అరగదీసి రామచంద్రం కంట్లోనూ నోట్లోనూ పెట్టింది. అరిపాదాల్ని ఒళ్లో పెట్టుకుని రాసింది.

అరగంట తర్వాత, రామచంద్రం మొహంలో చావునీడలు తప్పుకున్నాయి. శ్వాస యథాస్థితికి వస్తోంది. 'ఇదంతా నీ చలవ సూరీడు' అంటూ ఆమె కాళ్లమీద పడ్డాడు భూషణం. 'తప్పండి బాబూ' అంటూ సూరీడు సిగ్గు పడింది. ఆమె నవలావణ్యంతో ఆకర్షణీయంగా వుంది. అప్పుడు సమయం మూడు గంటలవుతోంది. అందరూ నడుం వాల్చారు.

సుమారు వో గంటకు భూషణం లేచి సూరీడు వొంటి మీద చెయ్యి వేసి లేపాడు. జేబులోంచి డబ్బు ఇస్తూ, 'నా మనసు తీర్చు' అన్నాడు. 'అందుకు డబ్బెందుకు బాబూ' అంది సూరీడు. మరి? 'నేనలాంటిదాన్ని కాను. పోయి పడుకో అయ్యా' అంటూ మరోవైపు తిరిగి పడుకుంది. అవధాని నవ్వాపుకున్నాడు.


తెల్లారి అంతా నిద్రలేచారు. ఆరు గంటల బస్సు వచ్చే వేళయింది. కలెక్టర్ గారింట్లో పెళ్లికి సమయానికి వెళ్లొచ్చు! రోడ్డు వైపు నడుస్తున్నారు. రామచంద్రం ఉత్సాహంగా ఉన్నాడు. మళ్లీ శ్రీమంతుడూ టెన్నీస్ చాంపియనూ అయిపోయాడు. 'ఎప్పుడైనా మా ఊరు వస్తే కనిపించు సిద్దయ్యా' అన్నాడు కృతజ్ఞతగా. 'చిత్తం' అని ముసలాయనా, సూరీడూ వెనక్కి వెళ్లిపోయారు.

కారు తడిసిపోయింది మంచులో. తణుకు వెళ్లగానే దీన్ని తీసుకువచ్చే ఏర్పాటు చేయాలనుకున్నారు.

ఇంతలో 'బాబయ్యా' అని కీచుగా కేక వినపడింది. సూరీడు పరుగెత్తుకొస్తోంది. 'బాబూ, మా అయ్యని పాము కరిచింది. ఒక్కసారి రండి బాబూ'. అరెరెరె! 'సగం దూరం వెళ్లగానే వేరు ముక్క కోసం పొదలో చెయ్యిపెట్టి మొక్క పీకబోయాడు. బుస్సున లేచి కాటు వేసింది బాబూ తాచుపాము'. అయ్యో! ఈ బస్సు దాటితే ఎలాగ? 'మీరుంటే ధైర్యం బాబూ' సూరీడు ఏడుస్తోంది. 'కలెక్టర్ గారింట్లో పని అంతా నేను చూసుకుంటానని మాట ఇచ్చానే' రామచంద్రానికి సమస్య వచ్చి పడింది. అదిగో బస్సు వచ్చేస్తోంది. అవధాని నిశ్చేష్టుడై చూస్తున్నాడు. బస్సు ఆగింది. రామచంద్రం గబుక్కున రెండు పదిరూపాయల నోట్లు సూరీడు చేతిలో పెట్టి బస్సు ఎక్కేశాడు. అవధానిని బస్సులోకి తోసి, భూషణం కూడా ఎక్కాడు. బస్సు బర్రున సాగింది. సూరీడు గుడ్లప్పగించి చూస్తూ నిలబడింది. పది రూపాయల నోట్లు గాలిలో పల్టీలు కొట్టుతున్నాయి.

గ్రేట్ రైటర్

ఎర్నెస్ట్ హెమింగ్వే




రచయిత కాకమునుపు పాత్రికేయుడిగా పనిచేశారు ఎర్నెస్ట్ హెమింగ్వే (1899–1961). నేపథ్యానికి మరీ ఎక్కువ పదాలు వృథా చేయకుండా, తక్కువ మాటల్లో ఉపరితల సారాన్ని చేరవేయగల ప్రజ్ఞ అలా అబ్బింది. అదే 'ఐస్‌బెర్గ్ థియరీ'(మంచుకొండ సిద్ధాంతం) శైలిగా ఇరవయ్యో శతాబ్దపు కాల్పనిక సాహిత్యం మీద అత్యంత ప్రభావం చూపింది. ఆయన, 'ద సన్ ఆల్సో రైజెస్', 'ఎ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్', 'ఫర్ హూమ్ ద బెల్ టోల్స్' లాంటి నవలలు అమెరికా సాహిత్యంలో క్లాసిక్స్‌గా నిలిచాయి. సముద్రం మీద ఒక పెద్ద చేపతో చేసిన ముసలి జాలరి పోరాట గాథను 'ది ఓల్డ్‌మాన్ అండ్ ద సీ'గా మలిచారు. ఇది ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది. దీనికి వచ్చిన కీర్తి ఆయన పాత రచనల మీద వెలుగు ప్రసరించేట్టు చేసింది. ఈ నవలిక కేశవరెడ్డి సుప్రసిద్ధ తెలుగు నవల 'అతడు అడవిని జయించాడు'కు స్ఫూర్తిగా నిలిచింది. 1954లో హెమింగ్వేను నోబెల్ సాహిత్య పురస్కారం వరించడానికి ఇదే ప్రధాన కారణమైంది. మొత్తం పది నవలలూ, పది కథా సంకలనాలూ, ఐదు నాన్‌ఫిక్షన్ రచనలూ రాసిన హెమింగ్వే జీవితాన్ని గాఢమైన యుద్ధానుభవాలూ, దాదాపుగా మృత్యువు ఒడికి చేర్చిన విమాన ప్రమాదాలూ ప్రభావితం చేశాయి.

ప్రతిధ్వనించే పుస్తకం



ఒక పసిదాన్ని కేవలం కన్యాశుల్కం మీది దురాశతో ఒక వయోవృద్ధుడికి కట్టబెట్టబోయిన తండ్రికి బుద్ధొచ్చేలా ఆ పెళ్లిని ఎత్తగొట్టడానికి పలువురు వారి వారి కారణాల కోసం ఆడిన నాటకం 'కన్యాశుల్కం'. అంతేనా కన్యాశుల్కం? అప్పటి విధవ వివాహాలు, బాల వితంతువులు, సాని కొంపలు, కుహనా మేధావులు, దొంగ సాక్ష్యాలు, లౌక్యాలు, రాజ్య హింస, మత గారడీలు, ప్రలోభాలు, ఆంగ్ల విద్య... వెరసి మొత్తంగా అప్పటి సమాజపు స్థితికీ, మనుషుల స్వభావానికీ కొండంత అద్దం పట్టిన నాటకం ఇది.

అయినా, కన్యాశుల్కం లోని కథ ఏమిటో చెప్పుకోవడంలో అర్థం లేదు. కన్యాశుల్కం కథేమిటో మాత్రం ప్రతి సాహిత్యజీవీ తెలుసుకోవాలి. అప్పటికి అత్యంత ఆధునికుడు అయిన గురజాడ అప్పారావు(1862–1915) అప్పటి వ్యవహారిక భాషకు పట్టం కట్టి రాసిన నాటకం ఇది. ముందు ప్రదర్శితమై తర్వాత పుస్తక రూపం దాల్చింది. పుస్తకంగానూ మళ్లీ మార్పులు చేసుకుంది. నూటా పాతికేళ్లుగా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేస్తూనేవుంది. నాటకాన్ని విశ్లేషిస్తూ పదులకొలదీ పుస్తకాలు వస్తూనేవున్నాయి. కేవలం నాటకంలోని మాటలను వివరిస్తూ కూడా పుస్తకాలు వచ్చాయి.



గురజాడ అప్పారావు

'డామిట్ కథ అడ్డం తిరిగింది', 'తాంబూలం ఇచ్చేశాను, ఇహ తన్నుకు చావండి', 'ఒపీనియన్స్ అప్పుడప్పుడు చేన్జి చేస్తుంటేగానీ పొలిటీషియన్ కానేరడు', 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది', 'తెలిసిన చోట చేస్తే మోసం తెలియని చోట చేస్తే లౌక్యం', 'నాతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్', 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్', 'కుప్పుసామయ్యర్ మేడ్ డిఫికల్ట్' లాంటి వాక్యాలు తెలుగు సమాజంలో జాతీయాల్లాగా స్థిరపడిపోయాయి. దొంగ పెద్దమనిషి, అనితరసాధ్యమైన లౌక్యం ఉన్న గిరీశం, అతిసాధారణ వేశ్యగా కనబడినా అత్యధిక కాలం గుర్తుండిపోయే మధురవాణి, బుచ్చమ్మ, రామప్పంతులు, సౌజన్యారావు, అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, వెంకటేశం లాంటి పాత్రలు తెలుగువారేనేమో, ఈ నేల మీద అప్పారావులాగే వారు కూడా పుట్టి పెరిగారేమో అనిపించేంతగా తెలుగుజనంలో కలిసిపోయారు. కన్యాశుల్కం అభిమానులమని తమను తాము ప్రత్యేకంగా పిలుచుకునేవారు దీనికి ఏర్పడ్డారంటే అతిశయోక్తి కాదు.

సాహిత్య మరమరాలు

రాజెక్కువా? ఆసెక్కువా?

ఒకసారి హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు, విజయనగర సంస్థానాధీశుడు ఆనంద గజపతి 'మూడు ముక్కలాట'(తీన్ పత్తా) ఆడుతున్నారు. వాళ్లు ముందు పందెంగా పెట్టేవి అగ్గిపుల్లలు. నెగ్గిన అగ్గిపుల్లల్ని చూపిస్తే వాటిని లెక్కించి పేష్కార్ ధనం ఇచ్చేవాడు. అదే పద్ధతిలో ఈసారి కూడా ఆడుతున్నారు. గజపతికి మూడు ఆసులు(ఎక్కాలు) పడ్డాయి. మూడు రాజులు నారాయణదాసుకు పడ్డాయి. గజపతి ఉత్సాహంగా ఉన్నారు. నారాయణదాసు కూడా ఏమీ తగ్గడం లేదు. పందెం పై పందెం పెరుగుతోంది. అగ్గిపుల్లల సంఖ్య హెచ్చవుతోంది. ఆట తన వైపే ఉందని గజపతికి తెలుస్తోంది. అయినా నారాయణదాసు ఎంతకీ చాలించకపోవడంతో– 'దాసుగారూ! మీకు మూడు రాజులు బడినయీ; అయినా ఎందుకు ఆడుతున్నారు?' అన్నారు ఉండబట్టలేక.

అదేమీ పట్టించుకోకుండా, 'నేనే గెలిచాను, నేనే గెలిచాను' అన్నారు ఉద్రేకంగా దాసు.



ప్రశ్నలాగా ముఖం పెట్టారు రాజు.

'మహారాజా! చిన్న మనవి ఆలకించండి. ఆసులెక్కువా? రాజులెక్కువా?' అని సూటిగా అడిగారు దాసు.


ఆ ప్రశ్నలో ఉన్న ఆంతర్యం ఇట్టే గ్రహించారు రాజు. ఆసులెక్కువని చెబితే, రాజు తక్కువని తనే ఒప్పుకున్నట్టు. రాజు ఎక్కువని చెబితే గనక ఆట ఓడిపోయినట్టు. దాసుగారి గడుసుతనానికి మెచ్చకుండా ఉండలేకపోయారు మహారాజు.

కొత్త బంగారం

హిప్పీ సంస్కృతిలోని అమ్మాయి కథ

ఎమ్మా క్లెయిన్ మొదటి పుస్తకం, 'ద గర్ల్స్' అమెరికాలోని నార్త్ కాలిఫోర్నియాలో 1969 సంవత్సరపు వేసవి నేపథ్యంతో రాసినది. మధ్యవయస్కురాలైన ఈవీ తన టీనేజిలో చేసిన తప్పులని తలచుకోవడంతో నవల ప్రారంభం అవుతుంది.

ఈవీ బోయ్డ్ ధనిక కుటుంబపు 14 ఏళ్ళమ్మాయి. స్నేహితులెక్కువ ఉండరు. తల్లిదండ్రులకి విడాకులవుతాయి. పార్కులో విచ్చలివిడిగా తిరుగుతున్న కొందరు యువతులని చూసి ఆకర్షితురాలవుతుంది. ప్రత్యేకంగా, సూసన్ అన్న అమ్మాయి పట్ల. తాముంటున్న రాంచ్‌కి చెత్తబుట్టల్లోంచి తిండి పట్టుకెళ్ళడానికి వచ్చే ఆ యువతులు మరోరోజు ఈవీని తమ నాయకుడి వద్దకి, కొండల్లో ఉన్న రాంచ్‌కి తీసుకెళ్తారు. అతడు రసెల్ హేడ్రిక్. అతని పాత్ర ఛార్ల్స్ మాన్సన్ మీద మలచబడినది. హిప్పీ సంస్కృతి పాటిస్తారక్కడ. ఫ్రీ సెక్స్, ఎల్‌ఎస్‌డీ వినియోగం సాగుతుంటాయి. 'కొండకొమ్ము నుంచి రాలే చెత్త లాగే తన రోజులూ గడుస్తున్నా'యని అనుకున్న ఈవీ, తనూ వారిలో భాగం అవడానికి ప్రయత్నిస్తుంది. ఆ 'కల్ట్'కి చెందిన అమ్మాయిలు చిల్లర దొంగతనాలు చేస్తుంటారు. రసెల్–డబ్బూ పరపతీ ఉన్న యువతుల కోసమే వెతుకుతుంటాడు. నిజ జీవితపు మాన్సన్ లాగానే, తన పక్కలోకి వచ్చే అమ్మాయిలనే సమకూర్చుకుంటాడు.



మర్నాడే, ఈవీ తన కొత్త స్నేహితుల కోసం తనింట్లోంచి దొంగిలిస్తుంది. రసెల్‌కి రాక్ స్టార్ అవ్వాలన్న ఆశ. మొదట్లో ఆ గుంపు పట్ల మెచ్చుకోలుండే ఈవీ– రసెల్‌కి ఉన్న మానసిక రుగ్మతనీ, యువతుల మనఃస్థితులనీ అర్థం చేసుకుంటుంది. ఆఖరిసారి ఆమె అక్కడికి వెళ్ళినప్పుడు, రసెల్ గుంపు తినడానికి తిండి కూడా లేక, మత్తు పదార్థాల సేవనలో మునిగుంటారని చూస్తుంది. తెలివి తెచ్చుకుని, ఇవన్నీ వదిలి బోర్డింగ్ స్కూల్లో చేరుతుంది.

నవల– ఛార్ల్స్ మేన్సన్, అతని అనుచరులూ 1969లో చేసిన భీకరమైన హత్యల వల్ల స్ఫూర్తి పొందినదే కానీ కేంద్రీకరణ ఉన్నది మాత్రం ఈవీ మీదే. దీన్లో లైంగిక వివరాలూ చాలానే ఉంటాయి.

మధ్య వయస్కురాలైన ఈవీ ప్రస్తుత జీవితం గురించీ, తను రాంచ్‌కి వెళ్ళినప్పటి గతకాలం గురించీ మార్చి మార్చి రాస్తారు రచయిత్రి. నవల్లో ఆడంబరం కనబడదు. నింపాదితనం ఉంది. అప్రతిష్ఠాకరమైన మాన్సన్ హత్యల గురించి సూచనప్రాయంగా చెప్తారు. ప్రతీ పేజీలోనూ గమనార్హమైన పదబంధమో, రూపకమో, ఉపమానమో ఉంటాయి. నవల కవిత్వ ధోరణిలో ఉంటుంది. ప్రధాన పాత్రలని కథకురాలు బయట ఉండి చూస్తూనే, వాటికి చిన్న చిన్న సంఘటనల ద్వారా ప్రాణం పోస్తారు. ఇక్కడ కథాంశం అప్రధానమైనది. 'మాన్సన్ యువతులు నన్ను ఆకట్టుకున్నారు. రాత్రంతా మేలుకుని– వారి గురించిన పుస్తకాలూ, యూట్యూబ్ వీడియోలూ చూస్తుండేదాన్ని' అంటారు రచయిత్రి. మాన్సన్ ఫ్యామిలీ గురించి వచ్చిన అనేకమైన పుస్తకాల్లోకల్లా, ఇదే ఎక్కువ గుర్తింపు పొందినది.



ఎమ్మా క్లెయిన్

2016లో విడుదల అయిన ఈ నవల 12 వారాలు, న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్ లిస్టులో ఉన్నది. 'సెంటర్ ఫర్ ఫిక్షన్ నోవెల్' ప్రైజ్‌కి షార్ట్ లిస్ట్ అయింది. 'జోన్ లెనార్డ్'అవార్డ్‌కి షార్ట్ లిస్ట్ అయింది. లాస్ ఏంజెలెస్ టైమ్స్ బుక్ ప్రైజ్‌కి ఫైనలిస్టు అయింది. 2017లో గ్రాంటా, 'బెస్ట్ యంగ్ అమెరికన్ నావెలిస్ట్'గా క్లెయిన్‌ని ఎంచుకుంది. ఈ నవల ఆడియో పుస్తకం కూడా ఉంది.

◆ **కృష్ణ వేణి**

ఈవారం పుస్తకాలు



మూడు తరాల తెలంగాణ కథ
సంపాదకులు: డాక్టర్ సదానంద్ శారద, డాక్టర్ ఎ.ఎం.అయోధ్యా రెడ్డి, డాక్టర్ బి.వి.ఎన్.స్వామి
పేజీలు: 720; వెల: 300



తెలంగాణలో భావకవితా వికాసం
సంపాదకుడు: సామిడి జగన్ రెడ్డి
పేజీలు: 638; వెల: 700




మాదిరాజు రామకోటీశ్వరరావు స్వీయచరిత్ర
పేజీలు: 444; వెల: 200



సాతవాహనుల నుండి కాకతీయుల వరకు తెలంగాణ
సంపాదకులు: ఆచార్య జి.అరుణకుమారి, డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్
పేజీలు: 260; వెల: 110

పై అన్ని పుస్తకాల ప్రచురణ:
తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, సైఫాబాద్, హైదరాబాద్–500004.



పదం పలికింది - పాట నిలిచింది

హిమమే కురిసే చందమామ కౌగిట



ఒక్కోసారి గొప్ప మూడ్ సృష్టించడం కోసం, కవి తూచి తూచి పదాలను ఎంపిక చేసుకుంటాడు. దానికి ఉదాహరణ 'సాగర సంగమం చిత్రంలోని 'మౌన మేలనోయి ఈ మరపురాని రేయి' పాట. నాయికానాయకుల మధ్య కొత్త భావనేదో మొలకెత్తిన నేపథ్యంలో వేటూరి సుందరరామ్మూర్తి ఇలా రాస్తాడు:
'హిమమే కురిసే చందమామ కౌగిట / సుమమే విరిసే వెన్నెలమ్మ వాకిట ఇది ఏడడుగుల వలపు మడుగుల / కన్నె ఈడు ఉలుకులు కంటిపాప కబురులు'.
ఇళయరాజా అనితరసాధ్యమైన సంగీతం కూర్చిన ఈ గీతాన్ని పాడింది ఎస్.జానకి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం. దర్శకుడు కె.విశ్వనాథ్. నటీనటులు కమల హాసన్, జయప్రద.
(గతవారం ఈ శీర్షిక కింద ఇచ్చిన 'మేఘసందేశం' చిత్రంలోని 'ఆకాశ దేశాన' పాట కూడా వేటూరి రాసిందే. కృష్ణశాస్త్రి అని పొరపాటుగా ప్రచురితమైంది. అయితే, కృష్ణశాస్త్రి శైలిలో వేటూరి దీన్ని రాశారని సినీ గీతాల పరిశోధకుడు డాక్టర్ పైడిపాల చెప్పడం గమనార్హం.)

రారండోయ్

- కెన్యా రచయిత గుగి వా థియాంగో 'యుద్ధకాలంలో స్వప్నాలు– బాల్య జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ(అనువాదం: జి.ఎన్.సాయిబాబా) ఫిబ్రవరి 18న సాయంత్రం 5:30కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరగనుంది. నిర్వహణ: మలుపు.
- డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డికి రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 12న ఉదయం 11 గంటలకు రంగినేని ట్రస్ట్ ప్రాంగణం, సిరిసిల్లలో జరగనుంది.
- 'కలల దారుల్లో' కవిత్వ సంకలనం ఆవిష్కరణ ఫిబ్రవరి 15న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో జరగనుంది. సంపాదకుడు: కాంచనపల్లి. నిర్వహణ: జాగృతి సాహిత్య విభాగం.
- సోమేపల్లి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం ఫిబ్రవరి 18న ఉదయం 10:30కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గన్నవరం, ప్రకాశం జిల్లాలో జరగనుంది. నిర్వహణ: రమ్యభారతి.
- ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కవిసంధ్య సంయుక్త నిర్వహణలో కవి పఠాభి శతజయంతి ఉత్సవం ఫిబ్రవరి 19న యానాంలో జరగనుంది.
- 'మంచి పుస్తకం' వారు సమకాలీన అంశాలతో రాసే 6–10వ తరగతి విద్యార్థుల కథలతో 'తెలంగాణ బడి పిల్లల కథలు–2018' వెలువరించనున్నారు. ఏప్రిల్ 5 చివరి తేది. వివరాలకు: 9490746614.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు. మాఘ మాసం. తిథి బ.ద్వాదశి రా.8.26 వరకు, తదుపరి త్రయోదశి. నక్షత్రం పూర్వాషాఢ రా.2.33 వరకు, తదుపరి ఉత్తరాషాఢ. వర్జ్యం ఉ.10.06 నుంచి 12.21 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.50 నుంచి 3.39 వరకు. అమృత ఘడియలు రా.9.13 నుంచి 10.44 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.31
జొహర్ : 12.30
అసర్ : 4.40
మగ్రీబ్ : 6.17
ఇషా : 7.30

పార్టీ మారేటప్పుడు పదవులు త్యజించాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- రోశయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం



రోశయ్యను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో టి.సుబ్బిరామిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజకీయ నాయకులు పార్టీలు మారేటప్పుడు పదవులు త్యజించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామని, పార్టీలు మారటం మంచిది కాదని సూచించారు. ప్రస్తుతం ఉన్న పార్టీ మారాలనుకున్నప్పుడు, ఆ పార్టీ ద్వారా వచ్చిన, పొందిన పదవిని వదులుకోవాలని స్పష్టం చేశారు. ఆదివారం రాగస్వప్తస్వరం ఆధ్వర్యంలో తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యకు వెంకయ్య నాయుడు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి, భాషా కోవిదుడు, అజాత శత్రువు అయిన రోశయ్యకు సన్మానం చేయడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. రాజకీయ నాయకులందరూ ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ప్రస్తుతం అసెంబ్లీ, చట్టసభలు జరిగే తీరు చూస్తుంటే బాధ కలుగుతోందన్నారు.

పదవులన్నీ యాదృచ్ఛికంగా వచ్చినవే: రోశయ్య

రోశయ్య మాట్లాడుతూ శాసనమండలి, పార్లమెంట్, శాసనసభల్లో వివిధ హోదాల్లో దాదాపు 35 ఏళ్లు పని చేశానని చెప్పారు. పదవులన్నీ యాదృచ్ఛికంగా వచ్చినవే తప్ప వెంపర్లాడి తెచ్చుకున్నవి కావని స్పష్టం చేశారు. వెంకయ్య, టి.సుబ్బరామిరెడ్డి తదితర పెద్దల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరగడం జీవితంలో మర్చిపోలేని సంఘటనగా ఆయన అభివర్ణించారు.

హామీలు అమలుకాకపోవడానికి బాధ్యత మీదే

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు రఘువీరా స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: నాలుగేళ్లుగా రాష్ట్ర విభజన హామీలు అమలుకాకపోవడానికి ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. ప్రధాని మోదీకి రాసిన బహిరంగ లేఖను ఆయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం బీజేపీ, టీడీపీ ఎత్తులు, పైఎత్తులతో రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విభజన విషయంలో కాంగ్రెస్‌ను విమర్శిస్తున్న మీరు ఆనాడు ప్రతిపక్షంలో ఉండి ఏం చేశారని రఘువీరా ప్రశ్నించారు. ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదా అని మాట్లాడిన బీజేపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎందుకు హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

ఏపీ ప్రజలకు 44 నెలలుగా అన్యాయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: విరుద్ధమైన ప్రకటనలతో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 44 నెలలుగా అన్యాయం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి రాష్ట్రం నుంచి గెలిచిన ఇద్దరు బీజేపీ ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబుకు రామకృష్ణ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రానికి ఎంతో సాయం చేసినట్టు ఈ నెల 10న విడుదల చేసిన 27 పేజీల నివేదికలోను పరస్పర విరుద్ధమైన లెక్కలు, వివరాలు ఉన్నాయన్నారు.

నాడు తలుపులు మూసి.. నేడు తలుపులు తెరచి..

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారు • ఉప ముఖ్యమంత్రి కేఈ

లాలాచెరువు (రాజానగరం): విభజన సమయంలో నాడు పార్లమెంటు తలుపులు మూసి రాష్ట్రానికి అన్యాయం చేశారని, నేడు తలుపులు తెరచి మరీ అన్యాయం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి మండిపడ్డారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో ఆదివారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ లోటు రూ.16 వేల కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ ఇచ్చింది రూ.3,800 కోట్లు మాత్రమేనన్నారు.

న్యాయవాదులు సామాజిక నిర్మాతలు కావాలి

- అనుభవం, నైపుణ్యం ఉన్నవారినే న్యాయమూర్తులుగా నియమించాలి
- అటువంటివారిలో నిష్పక్షపాతంగా తీర్పు ఇచ్చే ధైర్యం ఉంటుంది
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి రంజన్ గొగొయ్ స్పష్టీకరణ
- తెలుగులోనే న్యాయపరిపాలన సాగాలి
- బెజవాడలో వినియోగదారుల ఫోరం బెంచ్
- రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్న జస్టిస్ ఎన్వీ రమణ



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్‌ను సత్కరిస్తున్న బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు, చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్‌ను సత్కరిస్తున్న బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి, అమరావతి/విజయవాడ లీగల్/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): సామాజిక వివాదాలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించడంలో న్యాయవాదుల పాత్ర చాలా కీలకమని, న్యాయవాదులు సామాజిక నిర్మాతలుగా ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి రంజన్ గొగొయ్ అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ 111వ వార్షిక దినోత్సవం, జ్యుడీషియల్ ఎగ్జిబిషన్‌ను విజయవాడ ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ రంజన్ గొగొయ్ మాట్లాడుతూ అనుభవం, నైపుణ్యం కలిగిన న్యాయవాదులను న్యాయమూర్తులుగా నియమించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అటువంటివారిలో న్యాయమూర్తి పదవికి కావాల్సిన వ్యక్తిత్వం, నిష్పక్షపాతంగా తీర్పునిచ్చే ధైర్యం ఉంటాయని చెప్పారు. బార్–బెంచ్ న్యాయ వ్యవస్థకు రెండు కళ్లు అన్నారు. న్యాయమూర్తుల కంటే న్యాయవాదుల సంఖ్యే ఎక్కువని తెలిపారు. న్యాయం చేసే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర అధికంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రతి న్యాయవాది గుర్తుంచుకోవాలన్నారు.

బెజవాడలో వినియోగదారుల ఫోరం బెంచ్ ఏర్పాటుకు చర్యలు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్.వెంకట రమణ మాట్లాడుతూ 1982–83లో న్యాయవాదిగా, ఆ తర్వాత బెజవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా చేరి సుప్రీం కోర్టు న్యాయమూర్తి స్థాయికి వెళ్లానని గత స్మృతులను నెమరువేసుకున్నారు. విజయవాడలో జాతీయ వినియోగదారుల ఫోరం బెంచ్ ఏర్పాటు చేయడానికి సుప్రీంకోర్టు కమిటీని నియమించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుంటే విజయవాడలో జాతీయ వినియోగదారుల ఫోరం బెంచ్ ఏర్పడుతుందని చెప్పారు. తెలుగులోనే న్యాయపరిపాలన సాగాలని కోరారు. పేద కక్షిదారులకు న్యాయవాదులు సహాయం చేయాలని సూచించారు. న్యాయవాదులు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు హక్కులపై అవగాహన కల్పించాలన్నారు.

కేసుల సత్వర పరిష్కారంలో బెజవాడ భేష్

కేసుల సత్వర పరిష్కారంలో బెజవాడ బార్ ముందుందని హైకోర్టు జడ్జి వి.రామసుబ్రమణియన్ అన్నారు. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బెజవాడ కోర్టుల సముదాయం నిర్మాణ వ్యయాన్ని రూ.58 కోట్ల నుంచి రూ. 86.66 కోట్లకు పెంచి నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు ఏజే శేషసాయి, సి.ప్రవీణ్‌కుమార్, ఎం.సత్యనారాయణ మూర్తి, టి.సునీల్‌చౌదరి, లా సెక్రటరీ డి.వెంకటరమణ, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, కృష్ణా జిల్లా జడ్జి వై.లక్ష్మణరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎన్వీ రమణలను బెజవాడ బార్ సభ్యులు సత్కరించారు. న్యాయమూర్తులుగా నియమితులైన బీబీఏ న్యాయవాదులను సన్మానించారు. పలు ఆటల పోటీల్లో గెలుపొందిన న్యాయవాదులకు జస్టిస్ వి.రామసుబ్రమణియన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. భాగవతుల సౌమ్య బృందం చేసిన భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగు భాష పరిరక్షణపై కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న వివిధ అంశాలపై గేయాలు ఆలపించారు.

దుర్గమ్మను దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రంజన్ గొగొయ్, నూతలపాటి వెంకటరమణ కుటుంబ సమేతంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఏఈవో అచ్యుత రామయ్య, పాలక మండలి సభ్యులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు.

రవాణా కార్యాలయాల్లో పౌరసేవలు రద్దు

- ఇకపై వినియోగదారుల సేవా కేంద్రాలు, మీ–సేవ కేంద్రాల్లో రవాణా సేవలు
- నిర్వాహకులకు బయోమెట్రిక్ పరికరాలు, సాఫ్ట్‌వేర్ అందించిన రవాణాశాఖ

సాక్షి, అమరావతి: రవాణా శాఖ కార్యాలయాల్లో అందించే పౌర సేవల్ని రద్దు చేస్తూ ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. కార్యాలయాల్లో పౌరసేవలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను తొలగించనున్నారు. రవాణా సేవలన్నీ ఆన్‌లైన్ చేయడంతో ఇకపై రవాణా కార్యాలయాలకు వెళ్లకుండానే అన్ని సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు. మార్చి 1 నుంచి పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ ద్వారానే రవాణా లావాదేవీలన్నీ జరగనున్నాయి. వాహన వినియోగదారులకు రవాణా శాఖ 83 రకాల సేవలు అందిస్తోంది. రవాణా శాఖ కార్యాలయాల్లో ఏజెంట్ల వ్యవస్థ రద్దు చేసేందుకు ఇప్పటికే 43 రకాల సేవలు ఆన్‌లైన్ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు స్లాట్ బుక్ చేసుకోవడం, వాహన రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు తదితర సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుతున్నాయి. ఇకపై ఈ సేవలన్నీ గ్రామ స్థాయిలో వినియోగదారుల సేవా కేంద్రాలు (సీఎస్‌సీలు), మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చు. ఆన్‌లైన్ లావాదేవీలకు కేవలం రూ.10 మాత్రమే చెల్లించి సేవలను పొందేలా రవాణా అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ఈ సేవా కేంద్రాల నిర్వాహకులకు అందించారు. ఏదైనా పాత వాహనం కొన్నప్పుడు యాజమాన్య హక్కుల కోసం రవాణా శాఖ కార్యాలయంలోనే సంప్రదించాల్సి వచ్చేది. ఇప్పుడు రవాణా కార్యాలయానికి వెళ్లకుండానే గ్రామ స్థాయిలో సీఎస్‌సీ కానీ, మీ సేవ కేంద్రంలో కానీ కొనుగోలు చేసిన, అమ్మిన యజమానులు బయోమెట్రిక్‌తో పరస్పరం యాజమాన్య హక్కులు మార్చుకోవచ్చు. ఇందుకు సంబంధించి బయోమెట్రిక్ పరికరాలు (డివైస్), సాఫ్ట్‌వేర్‌ను రవాణా శాఖ అందించింది. డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ కార్డు పోగొట్టుకున్నా.. పోలీసు ధ్రువపత్రం తీసుకుని రవాణా కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లోనే డూప్లికేట్ కార్డులు పొందవచ్చు.

మీ సేవ కేంద్రాల వద్ద ఏజెంట్లు ఉంటే చర్యలు

రవాణా కార్యాలయాల వద్ద ఏజెంట్ల వ్యవస్థని రూపుమాపేందుకు అధికారులు ఆన్‌లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అయితే ఏజెంట్లను సీఎస్‌సీ, మీ సేవ కేంద్రాల వద్ద ప్రోత్సహిస్తే, ఆ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ యోచిస్తోంది. ఈ కేంద్రాలన్నీ జిల్లా స్థాయిలో సంయుక్త కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతాయి.

ప్రజాసంకల్ప యాత్ర

మీ భవిత కోసమే..



తూర్పుగుడ్లదొన వద్ద చిన్నారిని ఆప్యాయంగా హత్తుకున్న జగన్



జక్కేపల్లి గూడూరు క్రాస్, కొత్తపాళెం వద్ద జగన్‌తో కలసి నడుస్తున్న విద్యార్థులు



తూర్పుగుడ్లదొన సమీపంలో గ్రామస్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న ప్రతిపక్ష నేత జగన్

నవరత్నాలతో పేదలకు చేయూత

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభమైంది. ఉదయగిరి నియోజకవర్గంలోని కొత్తపాళెం (జలదంకి మండలం), తూర్పుగుడ్లదొన గ్రామాలకు చేరుకున్నప్పుడు జగన్‌తో మాట్లాడేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు వేచి ఉన్నారు. అక్కడ కొద్ది సేపు ఆగిన జగన్ వారితో ముఖాముఖి మాట్లాడారు. 'రేపు మనందరి ప్రభుత్వం రాగానే ఏం చేయబోతామో ఇప్పటికే చెప్పాను. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల వారిని ఆదుకుంటాం. మనం ప్రకటించిన నవరత్నాల గురించి ఇంకా ఎవరైనా తెలియని వారుంటే.. వారందరికీ మీరు విస్తృతంగా తెలియజేయాలి. ఊర్లో ఎవరెవరికి తెలియదో తెలుసుకుని వారికి నవరత్నాల గురించి గట్టిగా చెప్పండి. అద్దో.. ఆ (చిన్న పిల్లల వైపు చేయి చూపిస్తూ...) ఆ చిట్టి పిల్లలను బడికి పంపితేనే మన తల రాతలు మారతాయి. వారు పెద్ద చదువులు చదువుకుంటేనే పేదరికం నుంచి బయట పడేందుకు వీలవుతుంది. అందుకోసం ఆ చిట్టి పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ సంవత్సరానికి రూ.15 వేలు జగన్ ఇస్తాడని చెప్పండి. ఈ చిట్టి పిల్లలు రేపు ఇంజినీర్లు, డాక్టర్లు అయితేనే మన కుటుంబాలు బాగు పడతాయి. అలా వారు పెద్ద పెద్ద చదువులు చదవడానికి ఎన్ని లక్షలు ఖర్చు అయినా మన ప్రభుత్వం భరిస్తుందని చెప్పండి. అంతేకాదు హాస్టల్ ఖర్చుల కోసం ఏటా రూ.20 వేలు ఇస్తారని కూడా చెప్పండి' అని మహిళలకు పిలుపునిచ్చారు.



తూర్పుగుడ్లదొన క్రాస్ వద్ద అక్కచెల్లెమ్మలతో మాట్లాడుతున్న జగన్

అక్కచెల్లెమ్మలను నిండా ముంచారు..

'ఎన్నికలప్పుడు చంద్రబాబు డ్వాక్రా అక్క చెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పాడు. తీరా ముఖ్యమంత్రి అయ్యాక మోసం చేశారు. ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు. రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. అక్క చెల్లెమ్మల రుణం ఎన్నికల నాటికి ఎంత మొత్తం ఉంటుందో.. ఆ సొమ్మును నాలుగు దఫాలుగా నేరుగా వారి చేతికే ఇస్తాం. గతంలో రైతులకు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీకే రుణాలు లభించేవి. అయితే చంద్రబాబు వచ్చాక ఆ రుణాలపై వడ్డీని చెల్లించడం మానేశారు. దాంతో అవి ఆగిపోయాయి. మన ప్రభుత్వం రాగానే మళ్లీ సున్నా వడ్డీకే రుణాల పథకాన్ని పునరుద్ధరిస్తాం. ఆ వడ్డీని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుందని హామీ ఇస్తున్నా. మనం నవరత్నాల్లో భాగంగా ప్రకటించిన ప్రథకాలన్నింటినీ జగనన్న అమలు చేసి తీరతారని ప్రచారం చేయండి. రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, తద్వారా పేద ప్రజలకు మేలు జరగాలని దేవుడిని ప్రార్థించండి' అని జగన్ కోరారు.

ఆగి మాట్లాడుతూ.. వేగంగా నడుస్తూ..

పాదయాత్రలో వైఎస్ జగన్.. తనకు ఎదురుపడిన చిన్న పిల్లలు మొదలు అవ్వాతాతల వరకు అందరితో ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. వారు సమస్యలు చెప్పుకుంటుంటే ఓపికగా వింటున్నారు. వారికి ధైర్యం చెబుతున్నారు. ఒక్కోసారి ఒక్కో గ్రామం దాటడానికి గంట నుంచి రెండు గంటలు కూడా పడుతోంది. దీంతో ఆ గ్రామం దాటాక ఆయన నడక ఒక్కసారిగా వేగం అందుకుంటోంది. 'జగనన్న చూడన్నా.. ఎలా నడుస్తున్నాడో.. ఆయన వెంట నడవలేక చాలా మంది పరుగు పెడుతున్నారు చూడు' అంటూ ఆదివారం జలదంకి మండలం కేశవరం గ్రామానికి చెందిన మాలకొండయ్య తన మిత్రులతో అంటుండటం వినిపించింది. ఎదురుపడిన వారిని పలకరించడానికి జగన్ నడక వేగం తగ్గించి.. ఆగి మాట్లాడుతుంటే గానీ ఆయన వెంట నడిచే వాళ్లు చేరుకోలేకపోతున్నారు.

పలకరింపులో ఎంత ప్రేమో..

వరి పొలాల వద్ద కాపలా పనికి ఉన్న తూర్పు గుడ్లదొన గ్రామానికి చెందిన పున్నమ్మ అనే మహిళ పాదయాత్రగా వస్తోన్న జగన్‌ను చూసేందుకు రోడ్డు వారగా నిలుచుంది. జగన్‌తో మాట్లాడే అవకాశం వస్తుందో రాదోనని ఒకింత ఆందోళనతో ఉంది. జగన్ ఆమెను గమనించి అక్కడకు రాగానే ఆగిపోయారు. ఆమెను దగ్గరకు పిలిపించుకుని ఆప్యాయంగా మాట్లాడారు. 'జగన్ ఎంత బాగా మాట్లాడారయ్యా.. ఇంట్లో మనిషిలా కష్టసుఖాలు అడిగారు.. ఎంత కలుపుగోలుగా ఉన్నారంటే మాటల్లో చెప్పలేను' అని ఆమె జగన్ అక్కడి నుంచి వెళ్లిన తర్వాత వ్యాఖ్యానించింది. దారిపొడవునా జననేతతో మాట కలపాలని ఎదురు చూస్తున్న వారు కొందరైతే, తమ కష్టాలు చెప్పుకోవాలనుకునే వారు మరి కొందరు. కొత్తపాలెం గ్రామంలో పలువురు వృద్ధ మహిళలు కేవలం రాజకీయ కారణాలతో తమకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడం లేదని జగన్‌కు ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారంటూ గ్రామంలోని జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నేతలు 70 మంది నిరుపేదలకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న మద్యం దుకాణం తొలగించాలని అధికారులపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. తమ గ్రామంలో సాగునీటి అవసరాలకు ప్రత్యేక లిఫ్ట్ ఇరిగేషన్ పథకం చేపట్టాలని తూర్పుగుడ్లదొన రైతులు జగన్ దృష్టికి తీసుకొచ్చారు.



తూర్పుగుడ్లదొన క్రాస్‌లో జగన్‌తోపాటు నడుస్తున్న జనం



కొత్తపాలెం వద్ద జగన్‌కు స్వాగతం పలకడానికి వేచి ఉన్న అక్కచెల్లెమ్మలు



తూర్పుగుడ్లదొన వద్ద జగన్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

అవ్వాతాతలకు భరోసా



తూర్పుగుడ్లదొన సమీపంలో ఓ అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న జగన్



అనంతాపురంలో అవ్వ, తాతల సమస్యలను ఓపికగా విని.. వారికి ధైర్యం చెబుతున్న జననేత



తూర్పుగుడ్లదొన క్రాస్ సమీపంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తాతకు ధైర్యం చెబుతున్న జగన్

ప్రజాసంకల్ప యాత్ర 84వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం

1,140.9 కిలో మీటర్లు

84వ రోజు నడిచిన దూరం **15.7** కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు దగదర్తి మండలం బోడగుడిపాడు శివారు

ముగింపు: సా. 5.30 గంటలకు కలిగిరి మండలం అనంతాపురం

ముఖ్యాంశాలు: బోడగుడిపాడు శివారు, జక్కేపల్లి గూడూరు క్రాస్‌రోడ్డు, ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం కొత్తపాళెం, కలిగిరి మండలం తూర్పుగుడ్లదొన క్రాస్, పడమట గుడ్లదొన, అనంతాపురం గ్రామాల్లో జనంతో మమేకం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం


ఉ. 8 గంటలకు అనంతాపురం

ముఖ్యాంశాలు

- అనంతాపురం, సిద్దనకొండూరు, సిద్దనకొండూరు హరిజనవాడ, పరికోట, 14వ మైలు, అయ్యప్పరెడ్డిపాళెం, పెద్ద కొండూరు గ్రామాల్లో ప్రజలతో మమేకం

84వ రోజు

11-02-2018, ఆదివారం
అనంతాపురం,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



మహిళల కన్నీటికి కారణమైన మద్యం వ్యాపారం అవసరమా?

ఈ రోజు కొత్తపాళెం గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు కలిశారు. ఆ అమ్మలను ఆప్యాయంగా పలకరించాను. 'మద్యం రక్కసి మా ఊరిని పీడిస్తోందయ్యా..' అంటూ చెప్పుకొచ్చారు. చంద్రబాబు ప్రభుత్వంపై కాళికలై కన్నెర్రజేశారు. మద్యం రాయుళ్ల ఆగడాలకు హద్దే ఉండటం లేదన్నారు. అర్ధరాత్రి అపరాత్రి.. వీధి వాడ.. ఊరంతా తాగుబోతులేనట. చీకటి పడితేచాలు.. బయటికెళ్లాలంటేనే మహిళలు భయపడుతున్నారట. రోడ్డున వెళుతుంటే.. తాగుబోతుల అసభ్య ప్రవర్తనతో చచ్చిపోతున్నామని చెప్పారు. చదువుకునే అమ్మాయిల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. టెన్త్ పరీక్షలకు ప్రత్యేకంగా సిద్ధమవుతున్న అమ్మాయిలు రాత్రి వేళ ఇళ్లకు చేరే వరకూ టెన్షన్‌గానే ఉంటోంది.. బడికెళ్లే దారిలోనే బ్రాందీ షాపు ఉందయ్యా.. అన్నారు. దొంగతనాలు జరుగుతున్నాయి.. మెడలో గొలుసులు తెంచుకుపోతున్నారంటూ ఎంతో బాధగా చెప్పుకొన్నారు. విసిగిపోయాం.. భరించలేకపోతున్నాం.. ఈ ఊళ్లో మాత్రమే మూసేస్తే ప్రయోజనం లేదు.. చుట్టుపక్కల ఊళ్లలోనూ ఆ మద్యం షాపులు తీసేయించి పుణ్యం కట్టుకోండి.. అంటూ వేడుకున్నారు. ఆ అమ్మల ఆవేదన, ఆవేశమూ చూస్తే ఆశ్చర్యమేసింది. మద్యం మహమ్మారిపై సమరభేరీ మోగించిన చరిత్ర నెల్లూరు జిల్లాదే. కొంగు నడుముకు చుట్టి యావత్ రాష్ట్రాన్నీ కదిలించిన వీర వనితలకు ఈ జిల్లా పుట్టినిల్లు. ఇలాంటి జిల్లాలో మహిళలు కన్నీళ్లు పెడుతుంటే.. ఈ పాలకులకు చీమకుట్టినట్లయినా అనిపించదా? ఆ కన్నీటికి కారణమైన మద్యం వ్యాపారం అవసరమా?

దారిలో గొట్టిగుండాల గ్రామస్తులు కలిశారు. ఆ ఊరి పేదలకు గతంలో భూపంపిణీ కింద దాదాపు 2,000 ఎకరాల భూములు పంచారట. 1995లో వేరే జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది అప్పటి చంద్రబాబు ప్రభుత్వం సహకారంతో, ఆ పార్టీ నాయకుల అండదండలతో దొంగ సర్టిఫికెట్లు సృష్టించి, రికార్డులు తారుమారు చేసి ఆ భూములను లాగేసుకున్నారట. ఆ తర్వాత ఎవరైనా నోరు విప్పితే బెదిరించడం మొదలెట్టారట. 'మీ నాన్నగారి ప్రభుత్వం వచ్చాక మాకు న్యాయం జరిగే దిశగా ప్రయత్నాలు జరిగాయి సార్.. దాదాపు 700 ఎకరాల అసైన్డ్ భూములు తిరిగి అసలైన లబ్ధిదారులకు అందించారు. ఇంకా దాదాపు 1,200 ఎకరాలకు పైగా ఆక్రమణదారుల ఆధీనంలోనే ఉన్నాయి.. కోర్టులో కేసులూ నడుస్తున్నాయి.. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఆక్రమణ దారుల నుంచి గ్రామస్తులకు బెదిరింపులు మొదలయ్యాయి. వేధింపులు ఎక్కువయ్యాయి' అంటూ ఆ గ్రామస్తులు బాధగా చెబుతుంటే, అసైన్డ్ భూముల ఆక్రమణల కోసమే ఈ ప్రభుత్వం నడుస్తోందా.. అనిపించింది. వేరే ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇక్కడ అసైన్డ్ భూములు ఎలా అందాయన్నదానిపై విచారణ నిర్వహిస్తే నిజాలు బయటకురావా? చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడు వచ్చినా అసైన్డ్ భూముల నుంచి గుడి మాన్యాల వరకు వేటికీ భద్రత ఉండదు. గుడినే కాదు.. గుడిలో లింగాన్నీ మింగేసే అరాచకీయాలే నడుస్తుంటాయ్.

చివరిగా ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. గత ఎన్నికల సమయంలో 'మహిళలకు భద్రత కావాలంటే బాబు రావాలి' అంటూ ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించారు. మరి నేడు మీరు పెంచి పోషిస్తున్న మద్యం మహమ్మారితో తమపై అరాచకాలు పెరిగిపోతున్నాయని కన్నీరు పెడుతూ మహిళలు రోడ్డెక్కుతున్నారు. వీరికేం సమాధానం చెబుతారు?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

తెలుగు భాషకు ఢోకా లేదు

జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్

ఘంటసాల (అవనిగడ్డ)/శ్రీకాకుళం: తెలుగు భాష దేదీప్యమానంగా వెలుగొందుతోందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షుడు జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్ అన్నారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ కృష్ణదేవరాయుల ఉత్సవాలను పురస్కరించుకుని తెలుగుభాషా బ్రహ్మోత్సవాలను రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జస్టిస్ భవానీప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఏటా శ్రీ కృష్ణదేవరాయులు ఉత్సవాల్లో భాషకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించి తెలుగు ప్రత్యేకతను చాటుతున్నామన్నారు. సినీగేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. 12వ తరగతి వరకు తెలుగు విద్యను ప్రోత్సహించాలని కోరారు. తెలుగుభాష ప్రాచుర్యానికి సాహిత్యపరంగా తనవంతు సహకారం అందిస్తానన్నారు. కాగా, కల్చరల్ సెంటర్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రాసిన ఆంధ్రమహావిష్ణు ఆలయ చరిత్ర గ్రంథాన్ని ఈ సందర్భంగా అతిథులు ఆవిష్కరించారు. అంతకుముందు ఆముక్తమాల్యద మండపంలోని శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి, పక్కనే ఉన్న కాసుల పురుషోత్తమకవి విగ్రహానికి జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్, అనంత్ శ్రీరామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారిని డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ఏపీ సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వాణాధికారి డాక్టర్ విజయ్‌భాస్కర్ శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బందరు ఆర్డీవో ఉదయభాస్కర్, తహసీల్దార్ కె.శివరామకృష్ణారావు, సర్పంచ్ తిరుమలశెట్టి భవానీ, జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మల వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



జస్టిస్ భవానీప్రసాద్‌ను సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్. చిత్రంలో విజయ్‌భాస్కర్, అనంత శ్రీరామ్ తదితరులు

శ్రీకాకుళేశ్వరుడిని దర్శించుకున్న జస్టిస్ భవానీ ప్రసాద్..: ఆంధ్రమహావిష్ణువు శ్రీకాకుళేశ్వరస్వామిని విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షుడు జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్, సినీగేయ రచయిత అనంత శ్రీరామ్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏసీ శారదాకుమారీ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

ముగిసిన శ్రీకృష్ణదేవరాయుల ఉత్సవాలు..

కృష్ణా జిల్లా శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న శ్రీకృష్ణదేవరాయుల ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ ఉత్సవాల ద్వారా తెలుగు భాష మాధుర్యాన్ని రుచి చూశామన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో కొండపల్లిలో భారీ స్థాయిలో తెలుగు భాషా ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. మాతృభాషను రక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత యువతపై ఉందన్నారు. తర్వాత కాసుల పురుషోత్తం కవి మనుమడు కృష్ణంరాజు రూపొందించిన పురుషోత్తమకవి డైరీని అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సినీగేయ రచయిత జొన్నవిత్తులతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

ఎస్ఎస్‌సీ నామినల్ రోల్స్‌లో తప్పులు

వెబ్‌సైట్‌లో వివరాలు చూసి విస్తుపోతున్న హెచ్‌ఎంలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి తప్పుల తడకగా ఉన్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదివారం వెబ్‌సైట్లో పొందుపరిచింది. జిల్లాల వారీగా, స్కూళ్ల వారీగా పొందుపరిచిన ఈ నామినల్ రోల్స్‌ను చూసిన పాఠశాలల అధికారులు విస్తుపోతున్నారు. అన్నీ తప్పుల తడకగా ఉన్నాయని పేర్కొంటున్నారు. గతంలో చైల్డ్ ఇన్ఫో డేటాకు తమ నుంచి సమాచారం తీసుకున్నారని, ఇంతకు ముందు ఇదే డేటాను వెబ్‌సైట్లో పెట్టి విద్యార్థుల వారీగా తప్పులుంటే సరి చేసి అప్‌లోడ్ చేయమన్నారని హెడ్మాస్టర్లు పేర్కొంటున్నారు. అలా సరి చేసి పంపిన జాబితాను కాకుండా వెబ్‌సైట్లో పాత జాబితానే దర్శనమిస్తోందని కొందరు పేర్కొన్నారు. దీన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరక్టర్ వీఎస్ భార్గవతో ప్రస్తావించగా అన్నీ సరిచూశాకనే తమ సిబ్బంది జాబితాలను పెట్టారని, లోటుపాట్లు ఉంటే సరిచేయిస్తామని చెప్పారు. తప్పులుంటే వాటిని సరిచేసి సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్లు అధికారులకు అందించాలని సూచించారు.

రష్యాలో కూలిన విమానం


రష్యాలోని స్టెపానోవ్స్కోయె గ్రామంలో విమాన శకలం

71 మంది సజీవదహనం ● గాల్లోనే పేలిపోయిన విమానం ● అధ్యక్షుడు పుతిన్ సంతాపం

మాస్కో: రష్యాలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. మాస్కోలోని డొమొడెడొవో విమానాశ్రయం నుంచి ఉరల్ పర్వతశ్రేణుల్లోని ఓర్స్క్ పట్టణానికి ఆదివారం బయలుదేరిన ఆంటొనోవ్ ఏఎన్–148 జెట్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయింది. దీంతో ఈ విమానంలో ప్రయాణిస్తున్న 71 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో ఆరుగురు సిబ్బందితో పాటు 65 మంది ప్రయాణికులు ఉన్నట్లు రష్యా అత్యవసర విభాగం తెలిపింది. సరతోవ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం మాస్కోకు 80 కి.మీ ఆగ్నేయాన ఉన్న రామెన్‌స్కీ జిల్లాలోని అర్గునోవో గ్రామం సమీపంలో కుప్పకూలిపోయిందని వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఏఎన్–148 విమాన శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని పేర్కొంది. తీవ్రంగా మంచు కురుస్తుండటంతో దాదాపు 150 మంది సహాయక సిబ్బంది కాలినడకన ప్రమాదస్థలికి చేరుకుంటున్నారు. మరోవైపు విమానం గాల్లోనే కాలిపోతూ కుప్పకూలిపోవడాన్ని తాము చూసినట్లు పలువురు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదస్థలితో పాటు మంచులో చెల్లాచెదురుగా పడిపోయి ఉన్న విమాన శకలాల వీడియోను రష్యా ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. అయితే విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్ అత్యవసర ల్యాండింగ్‌కు ఏటీసీ అనుమతి కోరారని ఓ రష్యన్ వెబ్‌సైట్ తెలిపింది.

టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే..

సరతోవ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఆంటొనోవ్ ఏఎన్–148 టేకాఫ్ తీసుకున్న నాలుగు నిమిషాలకే విమానంతో రేడియో సంబంధాలు తెగిపోయాయని రష్యా ఏటీసీ అధికారులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.21 గంటలకు బయలుదేరిన విమానం వెయ్యి మీటర్ల ఎత్తుకు చేరుకోగానే రామెన్‌స్కీ జిల్లా ప్రాంతంలో రాడార్ నుంచి అదృశ్యమైందన్నారు. ఏడాది క్రితం ఈ విమానాన్ని మరో సంస్థ నుంచి సరతోవ్ కొనుగోలు చేసిందన్నారు. విమానంలోని ఓ ఇంజిన్ పేలిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. ప్రమాదం ప్రతికూల వాతావరణం కారణంగా జరిగిందా? లేక మానవ తప్పిదమా? అన్న అంశాలను పరిశీలిస్తామని రష్యా రవాణా మంత్రి మాగ్జిమ్ సొకొలొవ్ తెలిపారు. ఈ ప్రమాదంపై రష్యా విచారణ కమిటీ క్రిమినల్ విచారణను చేపట్టిందన్నారు. అర్గునోవో గ్రామం సమీపంలో విమాన శకలాలతో పాటు కొన్ని మృతదేహాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ విమాన ప్రమాదంలో చనిపోయినవారిలో 60 మంది తమ ప్రాంతానికి చెందినవారేనని ఒరెన్‌బర్గ్ గవర్నర్ ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు మృతుల కుటుంబ సభ్యులు, స్నేహితులకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతాపం తెలిపారు. కాలం చెల్లిన విమానాలను వినియోగిస్తుండటంతో రష్యాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

గల్ఫ్‌తో శతాబ్దాల అనుబంధం


అబుదాబిలోని వాహత్ అల్ కరామాలో యూఏఈ అమర జవాన్లకు నివాళులు అర్పించేందుకు వచ్చిన మోదీ. చిత్రంలో యువరాజు షేక్ మహమ్మద్ బిన్ జయేద్

గల్ఫ్ దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం యూఏఈ, ఒమన్‌లలో బిజీబిజీగా గడిపారు. ఉదయం దుబాయ్‌లోని ఒపెరా హౌజ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అక్కడి భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. భారత్–యూఏఈ మధ్య శతాబ్దాల నాటి బంధం దృఢమైనదన్నారు. ప్రవాసీల కలల సాకారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. అనంతరం అబుదాబిలో నిర్మించనున్న స్వామినారాయణ్ మందిరానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. దుబాయ్‌లో వరల్డ్ గవర్నమెంట్ సమిట్‌లో ప్రారంభోపన్యాసం చేశారు. సాంకేతికతను వికాసానికే వాడాలి తప్ప విధ్వంసానికి కాదని సూచించారు. దుబాయ్ ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్‌తో సమావేశమై రక్షణ, వాణిజ్యరంగాల్లో ద్వైపాక్షిక బంధాల బలోపేతంపై చర్చించారు. అక్కడి నుంచి ఒమన్ చేరుకున్న ప్రధాని.. మస్కట్‌లో భారత సంతతి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఒమన్ పురోగతిలో భారతీయులు తమవంతు పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు.

యూఏఈ, ఒమన్ దేశాల పర్యటనలో మోదీ

సాంకేతికతను వికాసం కోసమే వాడాలి.. విధ్వంసానికి కాదు ● ప్రకృతిపై పోరాటం కాదు.. మమేకమవ్వాలి

యూఏఈ, గల్ఫ్ దేశాలతో బంధం దృఢమైనది ● అబుదాబి భారత సంతతి ప్రజల సమావేశంలో వెల్లడి

అబుదాబిలో స్వామినారాయణ్ ఆలయానికి శంకుస్థాపన ● ఒమన్‌లోనూ భారతీయులతో భేటీ

దుబాయ్/మస్కట్

సైబర్ స్పేస్ దుర్వినియోగం కాకుండా, ఉగ్రవాదుల చేతిలో చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సాంకేతికతను అభివృద్ధికోసం ఉపయోగించే ఓ నియంత్రణ వ్యవస్థగానే వినియోగించుకోవాలని విధ్వంసం కోసం కాదని ఆయన పేర్కొన్నారు. దుబాయ్‌లో ఆదివారం జరిగిన వరల్డ్ గవర్నమెంట్ సమిట్‌లో మోదీ ప్రసంగించారు. సైబర్‌స్పేస్‌ను ఉగ్రవాదులు, హ్యాకర్లు దుర్వినియోగం చేస్తున్నారని దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పాలనకు సరైన సాంకేతికత తోడైతే సరైన అభివృద్ధి జరుగుతుందన్నారు. భారత పురోగతిలో సాంకేతికత పాత్రను మోదీ తన ప్రసంగంలో వివరించారు. కృత్రిమ మేధస్సు, నానో టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర రంగాల్లో భారత్ త్వరలోనే కీలకస్థానం అందుకోనుందన్నారు. దాదాపు 140 దేశాలకు చెందిన 4వేల మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'6ఆర్'లు, '5ఈ'ల సూత్రంతోనే..

భారత జనాభాలో 65 శాతం.. జనాభా 35 ఏళ్ల లోపువారేనని.. అందుకే సాంకేతికత ద్వారా యువతకు సాధికారత కల్పిస్తూ నవభారత నిర్మాణానికి తమ ప్రభుత్వం ముందడుగేస్తోందని ఆయన తెలిపారు. 'సాంకేతికతతో ప్రకృతిపై పోరాటం చేయటం భవిష్యత్ మానవాళికి ప్రమాదకరం. ప్రకృతితో పోరాటం చేయవద్దు. దాంట్లో మమేకమయ్యే ప్రయత్నం చేయాలి' అని మోదీ సూచించారు. '6ఆర్' (రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్, రికవర్, రీడిజైన్, రీమ్యానుఫ్యాక్చర్), '5ఈ' (ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎనర్జీ, ఎంపతీ, ఈక్విటీ) సూత్రాల ద్వారానే మనం సంతోషంగా ఉంటామన్నారు. సదస్సులో భాగంగా యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధాని, మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తొమ్‌తో మోదీ సమావేశమయ్యారు. వాణిజ్యం, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తృతం చేసుకునే పలు అంశాలపై వీరిద్దరూ చర్చించారు. గల్ఫ్ సహకార మండలి వ్యాపారవేత్తలతోనూ ప్రధాని సమావేశమై 'నవభారతం' విజన్‌ను వారితో పంచుకున్నారు. పెట్టుబడులతో భారత్‌కు రావాలని వారిని ఆహ్వానించారు. ఫ్రెంచ్ ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్పీ, కిర్గిజ్‌స్తాన్ ప్రధాని సపర్ ఇసాకోవ్‌లతోనూ మోదీ వేర్వేరుగా భేటీ అయ్యారు.

భారత్–యూఏఈ బంధం దృఢమైంది

యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బంధం అమ్మకపుదారు–కొనుగోలుదారు పరిధికంటే లోతైనది, విస్తృతమైనదని, బలమైనదని మోదీ తెలిపారు. దుబాయ్ ఒపెరా హౌజ్‌లో భారత సంతతి ప్రజలనుద్దేశించి మోదీ మాట్లాడారు. దేశం, కుటుంబం నుంచి దూరంగా ఉన్నప్పటికీ.. 30 లక్షల మంది భారతీయులకు యూఏఈ సొంతింటిలా అక్కున చేర్చుకుందన్నారు. ప్రవాసీయుల కలలను నిజం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. 'ప్రపంచ బ్యాంకు వ్యాపారానుకూల జాబితాలో భారత్ స్థానం చాలా మెరుగుపడింది. ఇంతటితో సంతృప్తి చెందాలనుకోవట్లేదు. దీన్ని మెరుగుపరుచుకునేందుకు కావాల్సిన అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం' అని అన్నారు.

అబుదాబిలో దేవాలయ శంకుస్థాపన

అబుదాబిలో తొలి హిందూ దేవాలయ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. బీఏపీఎస్ నారాయణ్ ఆలయానికి ఒపెరా హౌజ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'యూఏఈ పాలకులు భారత్‌పై, భారత సంస్కృతి, సంప్రదాయాలపై తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. అందుకే ఇక మన పాత్ర నిర్వహణలో ఎలాంటి పొరపాట్లూ ఉండకూడదని ఈ ఆలయ నిర్మాణంతో ముడిపడిఉన్న అందరికీ చెబుతున్నా. మనం ఎవరికీ ఇబ్బంది కలిగించేలా వ్యవహరించొద్దు. మీనుంచి ఇదే ఆశిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. మందిర నిర్మాణానికి స్థలాన్నిచ్చిన అబుదాబి యువరాజుకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

ఒమన్.. మినీ ఇండియా!



యూఏఈ నుంచి రెండ్రోజుల పర్యటనకోసం ప్రధాని ఒమన్ చేరుకున్నారు. మస్కట్‌లో మోదీకి ఒమన్ ఉప ప్రధాని సయ్యద్ ఫహద్ బిన్ మహమ్మద్ ఘనస్వాగతం పలికారు. అనంతరం సుల్తాన్ ఖబూస్ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో భారత సంతతి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రసంగాన్ని ఒమన్ సుల్తాన్ ఖబూస్ స్టేడియంలోని రాయల్ బాక్స్ నుంచి వీక్షించారు. 'ఒమన్‌లోని 8 లక్షల మంది భారతీయులు.. సౌహార్ద్ర రాయబారులే. ఒమన్ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించారు. అందుకే ఒమన్‌ను చూస్తుంటే మినీ భారత్‌లా అనిపిస్తోంది. ఇరుదేశాల్లో రాజకీయ మార్పులొచ్చినా.. భారత్–ఒమన్ సంబంధాల్లో మాత్రం ఎప్పుడూ ఇబ్బందులు తలెత్తలేదు' అని మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కుంభకోణాల కారణంగా భారత ప్రతిష్ట మసకబారిందని పరోక్షంగా కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు చేశారు. పశ్చిమాసియాతో భారత్ సంబంధాల్లో ఇదొక కొత్త శకమన్నారు. తమ ప్రభుత్వ పథకాలను మోదీ వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారందరితో వందేమాతరం అని నినాదాలు చేయించారు. దీంతో స్టేడియం మార్మోగిపోయింది. వాహనంలో తిరుగుతూ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ అభివాదం చేశారు.

మస్కట్‌లో మోదీకి స్వాగతం పలుకుతున్న ఒమన్ ఉపప్రధాని ఫహద్ బిన్ మహమూద్ అల్ సయిద్

దోశ, బీట్‌రూట్ కబాబ్, పప్పు!

ప్రధాని నరేంద్ర మోదీ ఆహారంతో ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ చెప్పారు. ఆయన ఎప్పుడూ ఒకే రకమైన వంటకాలను తినే వ్యక్తి కాదనీ, మాంసాహారాన్ని ముట్టని మోదీ ఎలాంటి శాకాహార వంటలనైనా ఆరగించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. మోదీ యూఏఈ పర్యటన సందర్భంగా ఆయన ఆహారాన్ని సంజీవ్ కపూర్ తయారుచేస్తున్నారు. దోశ, బీట్‌రూట్‌తో చేసిన కబాబ్, పప్పు, అన్నం ఎప్పుడూ మోదీ ప్లేట్‌లో ఉంటాయని సంజీవ్ పేర్కొన్నారు. ఒక దేశం సంస్కృతీ సంప్రదాయాలను మరో దేశం సులభంగా తెలుసుకునేందుకు ఆహారాన్ని మంచి మార్గంగా మోదీ భావిస్తారన్నారు. వంటకు సంబంధించి మోదీ కొన్ని కొత్త విషయాలను తనకు నేర్పించారని సంజీవ్ చెప్పారు.

వెస్ట్‌మినిస్టర్‌లో గిల్ట్ ట్యాక్స్!



లండన్: బ్రిటన్ రాజధాని లండన్‌లో అంతర్భాగమైన వెస్ట్‌మినిస్టర్ ప్రాంతంలో స్థానిక పన్నుల ఆదాయాన్ని పెంచేందుకు ఓ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. లండన్‌లోనే కాక మొత్తం బ్రిటన్‌లోనే అత్యంత సంపన్న ప్రాంతాల్లో వెస్ట్‌మినిస్టర్‌ఒకటి. ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా వెస్ట్‌మినిస్టర్ కౌన్సిల్ అనే నగర పాలక సంస్థ కూడా ఉంది. ప్రజలందరూ సాధారణంగా కట్టే పన్నులకు అదనంగా సంపన్నులు స్వచ్ఛందంగా కూడా విరాళాలు ఇవ్వాలని వెస్ట్‌మినిస్టర్ కౌన్సిల్ ప్రతిపాదిస్తోంది. ఈ విరాళాలను అక్కడి మీడియా 'గిల్ట్ ట్యాక్స్' అని వ్యవహరిస్తోంది. గిల్ట్ ట్యాక్స్ ద్వారా వచ్చిన డబ్బును ఉద్యోగ కల్పన, రోడ్లపై నిద్రించేవారికి దుప్పట్లు ఇవ్వడం తదితర అవసరాలకు ఉపయోగిస్తామని వెస్ట్‌మినిస్టర్ కౌన్సిల్ చెబుతోంది. కోటి పౌండ్లకు పైగా ఆస్తులు ఉన్న వారి నుంచి స్వచ్ఛందంగానే గిల్ట్ ట్యాక్స్‌ను వసూలు చేస్తామనీ, ఇందుకోసం 15 వేల మంది సంపన్నులకు లేఖలు రాస్తామంటోంది.

ఓటేయనున్న ఇటలీ, స్వీడన్, అర్జెంటీనా!

మేఘాలయ ఎన్నికల జాబితాలో చిత్రాలు

ఉమ్మియా: మేఘాలయ ఎన్నికల్లో ఓ వింత చోటుచేసుకోబోతోంది. ఇటలీ, స్వీడన్, అర్జెంటీనా, ఇండోనేసియాతోపాటు ప్రామిస్‌లాండ్, హోలీలాండ్, జెరూసలేం...తదితరాలన్నీ అక్కడి ఎన్నికల్లో ఓటేయబోతున్నాయి. అదేంటీ..ఈ దేశాలకు మేఘాలయ ఎన్నికలతో ఏంటీ సంబంధం అని ఆశ్చర్యపోతున్నారా? అయితే, ఇవన్నీ ఇక్కడ ఈ నెల 27న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న యువ ఓటర్ల పేర్లు..! ఇవే కాదు, వారాలు.. సండే, థర్స్‌డే, రాష్ట్రాలు గోవా, త్రిపుర లాంటి పేర్లు కూడా ఉన్నాయి. రాష్ట్రంలోని ఖాసీ తెగ ప్రజల్లో ఇలాంటి విచిత్రమైన పేర్లుండటం సహజం. ఎన్నికల జాబితాలో ఈ పేర్లను చూసిన అధికారులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకుంటున్నారట..!

'పాత' నోట్ల లెక్కింపు సాగుతోంది: ఆర్బీఐ

న్యూఢిల్లీ: రద్దు చేసిన రూ.500, రూ.1,000 నోట్ల లెక్కింపు ఇంకా సాగుతోందని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వెల్లడించింది. నోట్ల రద్దు జరిగిన 15 నెలలు గడిచిన తర్వాత ఈ ఆశ్చర్యకర ప్రకటన చేసింది. రద్దైన నోట్ల వివరాలు తెలపాలని సమాచార హక్కు చట్టం ద్వారా ఓ వ్యక్తి కోరడంతో ఈ మేరకు ఆర్బీఐ స్పందించింది. 2017 జూన్ 30 నాటికి రూ.15.28 లక్షల కోట్ల నోట్లు (99 శాతం) వచ్చాయని వెల్లడించిన ఆర్బీఐ.. లెక్కింపు ఎప్పుడు పూర్తవుతుందో తెలపాలని కోరగా ప్రస్తుతం ప్రక్రియ వేగంగా జరుగుతోందంటూ సమాధానం దాటవేసింది. నోట్ల 'కచ్చితత్వం, వాస్తవికత' తెలుసుకునే ప్రక్రియ కొనసాగుతోందని.. ఇందుకు 59 అత్యాధునిక కరెన్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్ మెషీన్లు వినియోగిస్తున్నామని తెలిపింది.

స్మార్ట్ సిటీ పథకానికి రూ.9,940 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌కు రూ.588 కోట్లు విడుదల

న్యూఢిల్లీ: స్మార్ట్ సిటీ పథకం కింద ఇప్పటివరకూ అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.9,940 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. ఈ పథకంలో భాగంగా మహారాష్ట్రలోని 8 నగరాలకు రూ.1,378 కోట్లు ఇచ్చినట్లు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లోని 7 నగరాలకు రూ.984 కోట్లు, తమిళనాడులోని 11 నగరాలకు రూ.848 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు నగరాలకు రూ.588 కోట్లు ఇచ్చినట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ గణాంకాలను విడుదల చేసింది. స్మార్ట్ సిటీ పథకంలో చేరడానికి పశ్చిమ బెంగాల్ విముఖత చూపినా, కోల్‌కతాలోని న్యూ టౌన్‌కు రూ.8 కోట్లు విడుదల చేశామంది.

రజనీ కాషాయమైతే పొత్తు నో



- మెజారిటీ రాకుంటే ప్రతిపక్షంలో కూర్చుంటా
- హార్వర్డ్ కాన్ఫరెన్స్‌లో కమల్‌హాసన్
- ఈ నెల 21న కీలక ప్రకటన చేసే అవకాశం

కేంబ్రిడ్జ్ (మసాచుసెట్స్): సూపర్‌స్టార్ రజనీకాంత్ కాషాయ(బీజేపీ) రాజకీయాలు చేస్తే ఆయనతో ఎటువంటి రాజకీయ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ప్రకటించారు. తాము రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఇటీవల రజనీకాంత్, కమల్‌హాసన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతిష్టాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన యాన్యువల్ ఇండియన్ కాన్ఫరెన్స్‌లో కమల్‌హాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. తమిళనాడులో ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితులను మార్చాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చినట్టు చెప్పారు. రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడంపై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. తమ ఆలోచనలు, మేనిఫెస్టోలో ఏకాభిప్రాయం ఉంటే రజనీకాంత్‌తో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమని ప్రకటించారు. అయితే తమ మధ్య ప్రస్తుతం ఉన్న వ్యత్యాసం మతం.. కాషాయం మాత్రమే అని చెప్పారు. అవసరమైతే ఎవరితోనైనా చేయి కలిపేందుకు సిద్ధమని చెప్పారు. ఎన్నికల ముందు ఎవరితోనైనా పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా అనే ప్రశ్నకు లేదని సమాధానం చెప్పారు. ఎవరికీ మెజారిటీ రాకుండా ప్రజలు తీర్పు ఇస్తే.. తాను ప్రతిపక్షంలోనే కూర్చుంటానని, తర్వాత ఎన్నికల కోసం సిద్ధమవుతానని స్పష్టం చేశారు. తమిళనాడులోని అన్ని జిల్లాల్లోనూ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోనున్నట్లు కమల్ వెల్లడించారు. కాగా, ఈ నెల 21న కమల్ హాసన్ ఓ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని సమాచారం.

విదేశాల్లో ఎంబీబీఎస్‌కూ నీట్ ! కేంద్రం యోచన

న్యూఢిల్లీ: విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులకు జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)లో ఉత్తీర్ణత సాధించడాన్ని కేంద్రం త్వరలోనే తప్పనిసరి చేసే అవకాశముందని ఆరోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం చివరిదశ పరిశీలనలో ఉందన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులు దేశంలో వైద్య వృత్తిని చేపట్టేందుకు భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) ఫారిన్ మెడికల్‌గ్రాడ్యుయేట్ ఎగ్జామ్(ఎఫ్‌ఎంజీఈ)ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష రాసే మొత్తం విద్యార్థుల్లో కేవలం 12 నుంచి 15 శాతం మాత్రమే ఉత్తీర్ణులు అవుతున్నారని పేర్కొన్నారు. ఒకవేళ ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాకుంటే వైద్యవృత్తిని చేపట్టడం కుదరదన్నారు. దీంతో పలువురు చట్టవిరుద్ధంగా వైద్య వృత్తిని ప్రారంభిస్తున్నారని తెలిపారు.

పాక్ ఉద్యమకారిణి కన్నుమూత



- లాహోర్‌లో గుండెపోటుతో అస్మా మృతి
- మానవహక్కుల కోసం అలుపెరగని పోరాటం

లాహోర్: పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, మానవహక్కుల ఉద్యమకారిణి అస్మా జహంగీర్(66) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. పాకిస్తాన్ సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్‌కు తొలి అధ్యక్షురాలిగా ఎన్నికై చరిత్ర సృష్టించిన అస్మా.. శక్తిమంతమైన ఆర్మీ, నిఘా సంస్థ ఐఎస్ఐల వ్యవహారశైలిని తీవ్రంగా విమర్శించేవారు. 1952లో లాహోర్ జన్మించిన అస్మా, పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి 1978లో ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని 1983లో అప్పటి పాక్ నియంత జియా ఉల్ హక్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడంతో సైనిక ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. జైలు నుంచి విడుదలైన అనంతరం 1986లో స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు వెళ్లిన ఆమె.. డిఫెన్స్ ఫర్ చిల్డ్రన్ ఇంటర్నేషనల్ సంస్థకు రెండేళ్లు ఉపాధ్యక్షురాలిగా వ్యవహరించారు. 1987లో పాకిస్తాన్‌లో స్థాపించిన జాతీయ మానవహక్కుల సంఘానికి 1993 వరకూ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. ఆ తర్వాత చైర్మన్‌గానూ వ్యవహరించారు. 2007లో అప్పటి పాక్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఇఫ్తికార్ చౌధురిని సైనిక నియంత పర్వేజ్ ముషార్రఫ్ పదవి నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు పెద్దఎత్తున చేపట్టిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. మానవహక్కుల రంగంలో చేసిన కృషికి గానూ 2014లో రైట్ లైవ్లీహుడ్ అవార్డు, 2010లో ఫ్రీడమ్ అవార్డు, హిలాల్ ఏ ఇంతియాజ్ అవార్డులను ఆమె అందుకున్నారు. అస్మా మృతి పట్ల బాలీవుడ్ దర్శకులు మహేశ్ భట్, నందితా దాస్, రచయిత జావేద్ అక్తర్, నటి షబానా అజ్మీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'సంజువాన్' దాడిలో ఆరుగురి మృతి

- వారిలో ఐదుగురు ఆర్మీ సిబ్బంది
- కొనసాగుతున్న సోదాలు

సంజువాన్: జమ్మూ నగర శివార్లలోని సంజువాన్‌లో ఆర్మీ కుటుంబాలు నివసించే గృహ సముదాయంలో జైషే మహ్మద్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో చనిపోయిన వారి సంఖ్య ఆరుకు చేరింది. క్వార్టర్స్‌లో ఇంకా ఎవరైనా ఉగ్రవాదులు మిగిలిఉన్నారేమోనన్న అనుమానంతో సైన్యం సోదాలు కొనసాగిస్తోంది. ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు ఆర్మీ సిబ్బంది మరణించారని అధికారులు శనివారం చెప్పగా.. తాజా సమాచారం ప్రకారం ఒక పౌరుడు, ఐదుగురు ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం ఆరుగురు మృత్యువాతపడ్డారని వెల్లడించారు. ఓ మేజర్ సహా 10 మంది గాయపడ్డారని ఆదివారం చెప్పారు. చనిపోయిన వారిలో ఇద్దరు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్స్ (జేసీవో) ఉన్నారు. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ముష్కరులు శనివారం ఆర్మీ క్వార్టర్స్‌లోకి సైనిక దుస్తుల్లో ప్రవేశించి దాడి చేయడం తెలిసిందే.

మరో నాలుగు మృతదేహాలు లభ్యం

ఇప్పటికి మొత్తం ముగ్గురు ఉగ్రవాదులను సిబ్బంది మట్టుబెట్టగా శనివారం రాత్రి నుంచి ఎలాంటి కాల్పులూ జరగలేదనీ, అయినా ఇంకా ఎక్కడైనా ముష్కరులు దాగి ఉండొచ్చనే అనుమానంతో సోదాలు నిర్వహిస్తున్నామని అధికారులు వెల్లడించారు. తొలుత ఇద్దరు ఆర్మీ సిబ్బంది మృతదేహాలు లభించగా, క్వార్టర్స్‌ను శుభ్రం చేస్తుండగా మరో ముగ్గురు సిబ్బంది, ఒక పౌరుడి మృతదేహం కనిపించాయని అధికారులు తెలిపారు. ఈ ఆరుగురూ శనివారం తెల్లవారుజామునే చనిపోయారన్నారు. సుబేదార్ మదన్ లాల్ చౌదరి, సుబేదార్ మహ్మద్ అష్రఫ్ మిర్, హవిల్దార్ హబీబ్ ఉల్లా ఖురేషీ, నాయక్ మంజూర్ అహ్మద్, లాన్స్ నాయక్ ఇక్బాల్‌తోపాటు ఇక్బాల్ తండ్రి కూడా మరణించారనీ చెప్పారు. మదన్ లాల్ తన కుటుంబాన్ని రక్షించుకునేందుకు ఒట్టి చేతులతోనే ఉగ్రవాదులతో పోరాడాడనీ, ఆయన శరీరంలోకి అనేక బుల్లెట్లు చొచ్చుకుపోయినా కుటుంబ సభ్యులను కాపాడుకోగలిగాడన్నారు. గాయపడిన వారిలో ఓ మహిళ గర్భవతి కాగా, వైద్యులు ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ చేసి తల్లీ బిడ్డలను కాపాడగలిగారు.


సంజువాన్ మిలటరీ స్టేషన్‌లో అప్రమత్తంగా ఉన్న సైనికులు

క్వార్టర్స్‌పై బాంబులు

క్వార్టర్స్ నుంచి ఇప్పటికే ఆర్మీ కుటుంబాలను ఖాళీ చేయించిన ఇళ్లపై ఆర్మీ మోర్టార్ బాంబులను వేసింది. ఇంకా ఉగ్రవాదులు ఎవరైనా దాక్కొని ఉంటే వారినీ హతమార్చేందుకే ఈ చర్యకు పూనుకుంది. దీంతో ఆర్మీ క్వార్టర్స్‌కు మంటలంటుకున్నాయి. మరోవైపు ఈ దాడి పాకిస్తాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదుల పనేనన్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. విచారణ కూడా ప్రారంభం కాకుండానే తమపై ఆరోపణలు చేయడం భారత మీడియాకు, అధికారులకు అలవాటైపోయిందని పాకిస్తాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అన్నారు.

ఇదేనా దళిత తేజం



వేదిక ముందు కింద కూర్చున్న చియ్యపాడు దళిత మహిళలు. (ఇన్‌సెట్‌లో) కుర్చీలలో కూర్చున్న అగ్రవర్ణ టీడీపీ నాయకులు

దళితవాడల్లోని దళితుల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన దళిత తేజం కార్యక్రమంలో దళితులను టీడీపీ నాయకులు అగౌరవపరిచారు. వైఎస్సార్‌జిల్లా చాపాడు మండలంలోని చియ్యపాడు గ్రామంలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో జరిగిన దళిత తేజం–తెలుగుదేశం కార్యక్రమంలో అగ్రవర్ణ కులాల వారికి కుర్చీలు వేయగా, చియ్యపాడుకు చెందిన దళితులు మాత్రం వేదిక ముందు క్రింద కూర్చొన్నారు. దళిత క్రిస్టియన్ మహిళలు కింద కూర్చోగా, పురుషులు నిల్చున్నారు. దళిత తేజం అంటూ దళితులకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

– చియ్యపాడు(చాపాడు)

పరస్పర సహకారంతో రెండు రాష్ట్రాల అభివృద్ధి

తెలంగాణ మంత్రి హరీష్‌రావు



మంత్రి హరీష్‌రావుకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న జేఈవో శ్రీనివాసరాజు

సాక్షి, తిరుమల: రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి చెందాలని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించానని తెలంగాణా నీటి పారుదల శాఖా మంత్రి హరీష్‌రావు అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సకాలంలో వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నీటితో నిండి, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. అంతకుముందు ఆలయంలో జేఈఓ కేఎస్ శ్రీనివాసరాజు మంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక మర్యాదలతో శ్రీవారి దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణకిశోర్

నెల్లూరు రూరల్: నెల్లూరు నగరంలోని శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు జరిగిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు గత రెండేళ్లలో చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా జంపా కృష్ణకిశోర్, సురేష్ కుమార్, కోశాధికారిగా గోపాల్ నాయక్ ఎన్నికయ్యారు.

10% హామీలు మాత్రమే నెరవేర్చగలం: జేసీ

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేమీ సత్యసాయిబాబా కాదని టీడీపీ ఎంపీ జేసీ దివాకరరెడ్డి వ్యాఖ్యానించారు. అనంతపురం జిల్లా పుట్టపర్తిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ నిదానంగా నెరవేర్చుతారన్నారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీల్లో 2019లోపు 10 శాతం మాత్రమే నెరవేర్చగలరని, తక్కిన 90 శాతం నెరవేర్చాలంటే ప్రజలు మరోసారి అధికారం ఇవ్వాలని వ్యాఖ్యానించారు.

మీడియాకు చెబుతావా.. నీ అంతు చూస్తాం

సాక్షి, అమరావతి: 'మామీదే మీడియాకు చెప్పే మగాడివా. నీ అంతు చూస్తాం. నిన్ను తన్నితే దిక్కెవరు' అంటూ చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగిని పిరమిల్ స్వాస్థ్య యాజమాన్యం బెదిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నెల 9న 'ఈ అన్యాయమేంటి చంద్రన్న' అనే శీర్షికన 'సాక్షి' ప్రధాన సంచికలో అకారణంగా ఉద్యోగులను తొలగించే అంశంపై వార్త ప్రచురితమైంది. తనను పిరమిల్ ఉద్యోగులు తీవ్రంగా కొట్టి ఉద్యోగం నుంచి తీసివేశారని సుధాకర్ అనే ఉద్యోగి మీడియాకు సమాచారమిచ్చారు. దీంతో పిరమిల్ యాజమాన్యం ఉద్యోగులపై మరింతగా కక్షగట్టింది. తన అంతు చూస్తానంటూ పిరమిల్‌కు సంబంధించిన వ్యక్తులు బెదిరించారని బాధితుడు సుధాకర్ వాపోయారు. పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో భాగంగా పిరమిల్ స్వాస్థ్య కార్యాలయానికి వెళ్లగా ఆఫీసుకు తాళాలు వేసి అక్కడ్నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు సంస్థ అధికారులు సినిమాకు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పిరమిల్ స్వాస్థ్య యాజమాన్యం నుంచి తనను రక్షించాలని, తనలాగే చాలా మంది ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని పోలీసుల వద్ద బాధితుడు వాపోయారు.

పుష్ప పల్లకిలో విహరించిన ఆది దంపతులు



పుష్ప పల్లకీలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి వారు

శ్రీశైలం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆది దంపతులైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లు పుష్ప పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవ మూర్తులకు విశేష వాహన పూజలు నిర్వహించారు. మల్లికార్జునస్వామి అభిషేక ప్రియుడే కాక, పుష్పప్రియుడనే కారణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పుష్పపల్లకీ మహోత్సవాన్ని నిర్వహించినట్లు ఈవో నారాయణ భరత్ గుప్త పేర్కొన్నారు.

హంస-యాళి వాహనాలపై శివపార్వతుల విహారం



హంస, యాళి వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం గాంధర్వరాత్రిని పురస్కరించుకుని శివపార్వతులు హంస, యాళి వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పరమశివుడు బ్రహ్మ వాహనమైన రాజహంసపై పురవిహారం చేశారు. ఆలయ దాత, వైఎస్సార్ సీపీ నేత అయిన నెల్లూరుకు చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.1.60 కోట్లతో 8 వాహనాలకు స్వర్ణతాపడం చేయించి ఆలయానికి అందజేశారు. వాటికి తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లు బంగారు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు.

గూడూరులో అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

గూడూరు రూరల్: అప్పుల బాధ తాళలేక కర్నూలు జిల్లా గూడూరు పట్టణంలోని కోట వీధికి చెందిన రైతు శ్రీనివాసులు(65) ఆదివారం తెల్లవారు జామున విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గూడూరు మండలం ఆర్.ఖానాపురంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీనివాసులు పూజారిగా పని చేస్తున్నాడు. దేవునికి సేవ చేస్తున్నందున ఆరెకరాల మాన్యం భూమిని దేవదాయశాఖ అధికారులు అతనికి కేటాయించారు. అందులో సేద్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగేళ్లుగా వర్షాలు లేక పంటలు పండలేదు. పంట పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ ఏడాదీ పంట పండకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక.. విష గుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2017: ప్రతిభకు పట్టం కడదాం



సాక్షి మీడియా గ్రూప్ ఛైర్ పర్సన్ శ్రీమతి భారతి రెడ్డి, చీఫ్ గెస్ట్ ప్రముఖ జర్నలిస్ట్ బర్కాదత్ తదితర ప్రముఖులతో 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్-2016' పురస్కార గ్రహీతలు (ఫైల్)



సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదులతో పోరాడి ప్రాణత్యాగం చేసిన నాయక్ వెంకటరమణకు సలామ్ చేసింది...,భారత కీర్తి పతాకని విశ్వవీధుల్లో ఎగరేసిన పీవీ సింధును ఆకాశానికెత్తింది..., సమోసాలమ్ముకునే నిరుపేద కడుపున పుట్టి దేశపు అత్యున్నత ఐఐటీల్లోకి దూసుకెళ్లిన బిడ్డ అభ్యాస్‌ని ఆశీర్వదించింది...., సర్కారు బడుల్లో చదువుకు వన్నెలద్దిన 'వందేమాతరం' సేవలకు వందనాలంది...., దిక్కులేని దీనులకు అన్నీ తానై ఆదుకున్న 'సహృదయ' యాకుబ్ బీని అభినందించింది...., నవరస నటసార్వభౌముడు కైకాల సత్యనారాయణను జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించింది... ఇలా త్యాగాన్ని, నైపుణ్యాన్ని, ప్రతిభని, సేవని, దయని, కళని... అవెక్కడున్నా వెలికి తీసింది 'సాక్షి'! వారందరినీ అభిమానించి, అభినందించి, అవార్డులతో అలరించి సముచిత రీతిన సత్కరించింది. కొందరి అసాధారణ ప్రతిభ, ఇంకొందరి అవిరళ కృషి, మరిన్ని సంస్థల సేవా నిరతిని ఇలా ఎప్పటికప్పుడు గుర్తిస్తోంది. ఈ మంచి వీరితోనే ఆగిపోకూడదని, మరింత విస్తరించి సమకాలికులతో పాటు భావితరాలకు స్ఫూర్తి కావాలని తలపోసినందునే, ఏటేటా 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు'ల ద్వారా వారిని సత్కరించి, ప్రోత్సహిస్తోంది. స్ఫూర్తిని తెలుగునాట పరివ్యాప్తం చేస్తోంది. అత్యంత ప్రతిభావంతులు, నైపుణ్యపు దిట్టలు, నిబద్ధత కలిగిన సేవా సంస్థలకు ఇలా అవార్డులిచ్చే ప్రక్రియను సాక్షి మీడియా సంస్థ చేపట్టి మూడేళ్లవుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న పలువురు 2014, 2015, 2016 సంవత్సరాల్లో ఈ అవార్డులకు ఎంపికై ఎందరికో స్ఫూర్తిని రగిలించారు. లేలేత చిగుళ్లుగా ఎదుగుతున్న యువకిశోరాల నుంచి జీవన సాఫల్య పురస్కారం పొందిన మహనీయుల వరకు ఎందరెందరో ఈ అవార్డు గ్రహీతల్లో ఉన్నారు. 2017కుగాను వేర్వేరు అవార్డులకు ఎంపిక ప్రక్రియ ఇటీవలే మొదలైంది. 2018 ఫిబ్రవరి 26 సాయంత్రం 6 గం.ల వరకు గడువు ఉండటంతో ఎంట్రీలు అందుతున్నాయి. ఈ ప్రక్రియ ప్రత్యేకత ఏమంటే... ఎవరికి వారు ఎంట్రీలు పంపుకునే పద్ధతి లేదు. విశేష ప్రతిభావంతుల్ని, అసాధారణ నైపుణ్యం కలిగిన వ్యక్తుల్ని, విశిష్ఠ సేవలందిస్తున్న సంస్థల్ని గుర్తెరిగిన ఇతరులెవరైనా వారి తరపున ఈ ఎంట్రీలు పంపవచ్చు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన ముఖ్యులు న్యాయ నిర్ణేతలుగా ఉండే జ్యూరీలు తుది ఎంపిక జరుపుతాయి.

ప్రతిభ ఎక్కడున్నా పట్టం

విద్య, వైద్య, వ్యవసాయ, వాణిజ్య, సామాజిక సేవ, క్రీడా, సినిమా తదితర రంగాల్లో సేవ చేస్తున్న వ్యక్తులను, సంస్థలను ఈ 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు'ల కోసం గుర్తిస్తారు. కొన్ని విభాగాల్లో యువతరానికి, ప్రవాస భారతీయులకూ అవార్డులున్నాయి. సందర్భాన్ని బట్టి 'జ్యూరీ ప్రత్యేక ప్రశంస' అవార్డుల్నీ అందిస్తున్నారు. ఇవే కాక, సినిమా రంగానికి చెందిన వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన, ప్రతిభ చూపిన వారిని ప్రజాదరణ ఆధారంగా ఎంపిక చేసి అవార్డులిస్తారు. ఉత్తమ ప్రజాదరణ చిత్రంతో పాటు ఉత్తమ నటీనటులు, దర్శకుడు, సంగీతం, నేపథ్యగానం వంటి విభాగాల్లో ఈ అవార్డులున్నాయి. దివంగత సాహితీవేత్త డా.సి.నారాయణరెడ్డి, ప్రఖ్యాత దర్శకుడు కె.విశ్వనాథ్, ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణలు గత మూడేళ్లుగా జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్నారు. 'తెలుగు శిఖరం' ప్రత్యేక అవార్డును దర్శకరత్న దాసరినారాయణరావుకు అందించారు. వివిధ రంగాల్లో విశేషంగా కృషి చేసి సాక్షి ఎక్సలెన్స్ అవార్డులందుకున్న వారిలో పీవీ సింధు, డా.సతీశ్‌రెడ్డి, డా.చరణ్ జీ రెడ్డి, శ్రీకాంత్ బోళ్ల, డా.ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, జ్యోతిరెడ్డి తదితరులున్నారు. క్రీడాకారులు ద్రోణవల్లి హారిక, సైనా నెహ్వాల్, నైనా జైస్వాల్, సిరాజ్, సాకేత్ తదితరులున్నారు. ఇక వందేమాతరం ఫౌండేషన్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌లతో పాటు భారత్ వికలాంగుల సేవా సమితి వంటి సంస్థలూ అవార్డు గ్రహీతల్లో ఉన్నాయి. అవార్డు పొందిన సినీ ప్రముఖుల్లో మహేశ్‌బాబు, అల్లు అర్జున్, సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్, బోయపాటి శ్రీను, గుణశేఖర్, రామజోగయ్య శాస్త్రి, దేవీశ్రీప్రసాద్, కారుణ్య వంటి వారున్నారు. వరుసగా మూడేళ్లు జరిగిన అవార్డు ప్రదానోత్సవాలకు మీడియా ప్రముఖులైన శేఖర్‌గుప్తా, రాజ్‌దీప్ సర్దేశాయ్, బర్కాదత్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతిభకు పట్టం కట్టడం, నైపుణ్యాల్ని గుర్తించడం, సేవ-ప్రత్యేక కృషిని అభినందించడం, లక్ష్య సాధనను ప్రశంసించడం ఎవరైనా చేయదగ్గ మంచి పనే! ఈ భావన కలిగిన వారంతా తమ ఎరుకలో ఉండే ఇటువంటి వారిని గుర్తించి, సదరు అర్హుల పేర్లను ఈ అవార్డుకు ప్రతిపాదిస్తూ ఎంట్రీలు పంపుతారని సాక్షి అభిలషిస్తోంది. నామినేషన్ల ఎంట్రీ దరఖాస్తుల కోసం... www.sakshiexcellenceawards.comలో లాగిన్ కాగలరు.

వివరాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 040-2332 2330 నంబరుపై సంప్రదించవచ్చు. ఈ-మెయిల్: sakshiexcellenceawards@sakshi.com.

చంద్రబాబు అవినీతితో రాష్ట్రానికి గ్రహణం

- కేంద్ర బడ్జెట్‌లో అన్యాయానికి ఆయనే బాధ్యత వహించాలి
- ఖర్చుల లెక్కలు కేంద్రానికి ఎందుకు చెప్పడంలేదు?
- వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో పిల్లి సుభాష్‌చంద్రబోస్ ,కురసాల కన్నబాబు

నరసాపురం/ధవళేశ్వరం (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర బడ్జెట్‌లో మనకు జరిగిన అన్యాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తి బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ ఎంపీ, పార్టీ గోదావరి జిల్లాల పరిశీలకుడు వైవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు అవినీతి ఈ రాష్ట్రానికి గ్రహణంగా మారిందని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ జిల్లా పరిధిలోని పార్టీ కో-ఆర్డినేటర్లతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లా దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణం సాంకేతికంగా సాధ్యంకాదని, దానిబదులు ప్రకాశం జిల్లా రామాయపట్నంలో పోర్టు నిర్మించాలని సూచించామన్నారు. కానీ, అక్కడ పోర్టు నిర్మిస్తే చంద్రబాబు బంధువు అధీనంలో ఉన్న కృష్ణపట్నం పోర్టుకు లాభాలు తగ్గుతాయనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రామాయపట్నం పోర్టుపై మొగ్గు చూపడంలేదని ఆయన విమర్శించారు. ఇచ్చిన నిధులకు ఖర్చులు చూపమని కేంద్రం అడుగుతుంటే ముఖ్యమంత్రి ఎందుకు భయపడుతున్నారని సుబ్బారెడ్డి ప్రశ్నించారు.

ప్యాకేజీకి అంగీకరించే హక్కు మీకెక్కడిది?


రాష్ట్రానికి ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించే అధికారం ముఖ్యమంత్రికి ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో హామీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతో పార్లమెంట్ వేదికగా టీడీపీ కొత్త డ్రామా మొదలుపెట్టిందని ధ్వజమెత్తారు. రాష్ట్రం విడిపోయేటప్పటికి మనకు రూ.90వేల కోట్ల అప్పు ఉందని, ఇప్పుడు అది రూ.2.20లక్షల కోట్లకు చేరిందని, తీసుకొచ్చిన అప్పులతో ఏమి చేశారని వైవీ ప్రశ్నించారు. కాగా, రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో తమ పార్టీ పాల్గొనేదీ, లేనిదీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. పొత్తులపై మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాతే కేంద్రంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే వారితో పొత్తు ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్టీ పార్లమెంటు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వంక రవీంద్ర, నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు గ్రంధి శ్రీనివాస్, కవురు శ్రీనివాస్, గుణ్ణం నాగబాబు, పీవీఎల్ నర్సింహరాజు పాల్గొన్నారు.

భారీగా ఓట్ల తొలగింపు

కాగా, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ ప్రభుత్వం దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లను భారీగా తొలగిస్తున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో 40వేలు, తూర్పు గోదావరి జిల్లాలోని మరో నియోజకవర్గంలో 22వేల ఓట్లు తొలగించారని చెప్పారు. దీనిపై కేంద్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేస్తామని సుబ్బారెడ్డి చెప్పారు.

15లోపు నిధుల లెక్కలు చెప్పండి

- రాష్ట్ర ప్రభుత్వానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గడువు
- లేకపోతే భవిష్యత్ కార్యచరణ గురించి ఆలోచిస్తానని వెల్లడి
- మాజీ ఎంపీ ఉండవల్లితో పవన్ భేటీ



మాజీ ఎంపీ ఉండవల్లితో భేటీ అయిన పవన్

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులు, వాటిని ఏ మేరకు ఖర్చు పెట్టారనే దానిపై లెక్కలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సినీ నటుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. నిధుల వివరాలతో ఈ నెల 15లోగా శ్వేతపత్రం విడుదల చేయాలని గడువు విధించారు. లేకపోతే భవిష్యత్ కార్యాచరణ గురించి ఆలోచిస్తానని వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ, టీడీపీ వాళ్లు చెబుతున్న వాటిపై తాను గందరగోళంలో ఉన్నానని చెప్పారు. ప్రత్యేక హోదా హామీ నెరవేరలేదనే అసంతృప్తి తనకూ ఉందన్నారు. నిధుల విషయంలో బీజేపీ, టీడీపీ నేతల్లో ఎవరో ఒకరు అబద్ధాలాడుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ, బీజేపీలు కూడా వివరాలు బయటపెట్టాలని కోరారు. ఉండవల్లి, జేపీ వంటి మేధావులతో ఏర్పడే నిజనిర్ధారణ కమిటీ వాటిపై అధ్యయనం చేసి అబద్ధాల లెక్క తేలుస్తుందని చెప్పారు. కేంద్రమిచ్చిన నిధులకు సంబంధించిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాయని, 2 గంటలు కేటాయిస్తే శ్వేతపత్రం విడుదల చేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. రెండు, మూడేళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు అడుగుతున్నా కూడా మిన్నకుండిపోయిన బీజేపీ, టీడీపీలు.. ఇప్పుడు అవే అంశాలపై గొడవ పడుతున్నాయన్నారు.

'పోలవరం'పై శ్వేతపత్రం అడిగితే వెబ్‌సైట్ చూడమన్నారు!

పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేయాలని అడిగితే.. 'వెబ్‌సైట్‌లో డిటైల్స్ ఉన్నాయి తీసుకోమన్నార'ని పవన్‌కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటి వాళ్లు ఇప్పుడు వివరాలు ఎలా ఇస్తారన్న అనుమానం కూడా తనకు ఉందన్నారు. 'మిత్రపక్షంగా ఉన్నందున బాధ్యతగా అడుగుతున్నాను. వివరాలు ఇవ్వకపోతే ఏం చేయాలన్నది అప్పుడు ఆలోచిస్తాను' అని పవన్ చెప్పారు. ఇప్పుడు నెలకొన్న గందరగోళం తొలగిపోయాక ఏ రాజకీయ పార్టీది తప్పో చెబుతానని.. విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు పవన్ బదులిచ్చారు. వాస్తవాలు వెలికితీయాల్సిన అవసరముందని.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. నిజ నిర్ధారణ కమిటీలో జనసేన పార్టీ కూడా ఉండదని చెప్పారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ తన వద్ద రాజకీయ అంశాలు ప్రస్తావించలేదు కాబట్టే.. ఈ అంశంలో ఆయనతో కలిసి పనిచేయడానికి ముందుకు వచ్చినట్టు చెప్పారు.

కాలయాపనా.. కాపాడే వ్యూహమా?

- పవన్ వైఖరిపై పలువురి అనుమానాలు
- ప్రత్యేక హోదా వద్దన్నప్పుడు పల్లెత్తు మాటనలేదే
- పట్టిసీమలో కాగ్ కడిగేస్తే కంటికి కనిపించలేదా?
- నాలుగేళ్లుగా సాగుతున్న నాటకానికి కొనసాగింపునకేనా!

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: కేంద్ర బడ్జెట్ తదనంతర పరిణామాలతో రాష్ట్ర ప్రజలందరూ గందరగోళంలో ఉన్నారని, తాను కూడా గందరగోళంలో ఉన్నానన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కేంద్ర నిధుల అంశంపై శ్వేతపత్రం విడుదల చేయండని రెండు ప్రభుత్వాలను అడగడమంటే మరింత కాలయాపన చేయడానికా, మిత్రపక్షాలను కాపాడటానికా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆదివారం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో భేటీ అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ఇప్పటివరకు ఎన్ని నిధులు ఇచ్చింది? రాష్ట్ర ప్రభుత్వం ఎంత పుచ్చుకున్నది? తనకు లెక్కలు చెప్పాలని కోరారు. వాటిలో వాస్తవాలేమిటో తన నిజ నిర్ధారణ కమిటీతో అధ్యయనం చేయిస్తానని ప్రకటించారు. ఎన్నికల్లో మద్దతిచ్చిన వాడిగా తాను అడుగుతున్నాననడాన్ని రాజకీయ విశ్లేషకులు తప్పుబడుతున్నారు. నాలుగేళ్లుగా బడ్జెట్‌లో అన్యాయం జరుగుతున్నా పవన్ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీస్తున్నారు. తాము ఇంత ఇచ్చామని కేంద్రం, కాదు ఇంతే పుచ్చుకున్నామని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నా.. ఇంకా లెక్కలు ఇవ్వండి నిజనిర్ధారణ కమిటీ చేత పరిశీలింపజేయిస్తానని పవన్ అనడమంటే కాలయాపన చేయడానికి మినహా మరొకటి కానేకాదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అప్పుడే అడిగి ఉంటే..: విభజనానంతరం రాష్ట్రం నిలదొక్కుకోవాలన్నా, శాశ్వత అభివృద్ధికి అడుగులు పడాలన్నా, యువతకు భవిత ఉండాలన్నా ప్రత్యేక హోదా ఒక్కటే మార్గమని ప్రజలందరూ ముక్తకంఠంతో చెబుతున్నా.. ప్రత్యేక ప్యాకేజీ పేరిట కమీషన్ల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన చంద్రబాబును ఇప్పటివరకు ఎందుకు నిలదీయలేకపోయారని పవన్‌ను పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీ ముద్దు అని చంద్రబాబు అన్నప్పుడే పవన్ ప్రశ్నించకపోవడంలోని ఔచిత్యం ఏంటో? వారి మధ్య ఉన్న అవగాహన ఏపాటిదో తెలిసిపోయిందని తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టులో అవినీతి తీవ్రతను మీడియా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్రం, తమ పార్టీకి చెందిన నాయకులు ఎత్తిచూపినప్పుడు పవన్‌కేమీ గుర్తుకు రాకపోవడం చిత్రంగా ఉందని బీజేపీ నాయకుడొకరు ఎద్దేవా చేశారు. ఇప్పుడు లెక్కలు అడగడం కన్నా పట్టిసీమలో అవినీతిని కాగ్ కడిగి పారేసినప్పుడే జనసేన అధ్యక్షుడు కనీసం ఒక్కమాటైనా ప్రశ్నించి ఉంటే బాగుండేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. రాజధాని ఏర్పాటు మొదలు అమరావతి ప్రాంతంలో చంద్రబాబు సర్కారు రైతులకు చేసిన, చేస్తున్న అన్యాయాల గురించి ఇలా వచ్చి అలా మాట్లాడి వెళ్లిపోయి.. ఆ తర్వాత పట్టించుకోకపోవడాన్ని ఏమని అర్థం చేసుకోవాలో అంతుబట్టడం లేదంటున్నారు. జయప్రకాశ్ నారాయణ, ఉండవల్లి అరుణ్‌కుమార్‌లు ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వంపై చాలా సీరియస్ అవినీతి ఆరోపణలు చేశారు. పోలవరం, పట్టిసీమ, పురుషోత్తపట్నంలలో జరిగిన అవినీతిని ఎక్కడైనా నిరూపిస్తానని ఉండవల్లి బహిరంగ సవాల్ విసిరారు. ముందుగా వాటిల్లోని వాస్తవాలేంటో పవన్ ఉండవల్లిని అడిగి తెలుసుకుంటే మంచిదని, అప్పుడు ఆయన మాట్లాడేదాన్ని బట్టి జనసేన నేత వాస్తవికత ఏంటో తేలిపోతుందని మాజీ ఎంపీ ఒకరు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇరకాటంలో పడిన ప్రతిసారి పవన్ ప్రత్యక్షమవుతారని, అప్పటివరకు అజ్ఞాతంలో ఎక్కడ ఉంటారో కూడా తెలియదని మరో సీనియర్ నేత ఎద్దేవా చేశారు. మొన్నటికి మొన్న పవన్ నటించిన అజ్ఞాతవాసి సినిమాకు చంద్రబాబు సర్కారు గతంలో ఎవరూ ఇవ్వని విధంగా ప్రత్యేక అనుమతులు ఇవ్వడాన్ని ఆయన గుర్తు చేశారు.

వ్యతిరేకతను దారి మళ్లించేందుకేనా!

'తాజా ప్రజాగ్రహం చంద్రబాబు సర్కారుకు గట్టిగా తగిలింది. ప్రత్యేక హోదా వద్దని, అదేమీ సంజీవిని కాదని చంద్రబాబు అనడం ఎంత తప్పిదమో రాష్ట్ర ప్రజలు ఇప్పుడు గుర్తించారు. ప్రత్యేక ప్యాకేజీ రాక, కేంద్ర బడ్జెట్‌లో ఆశించిన మేర కేటాయింపులు జరగకపోవడంతో ఏమీ పాలుపోని పరిస్థితి. పోలవరం, రాజధానిలో జరిగిన అవినీతితో పాటు ఇతరత్రా లొసుగులన్నీ బట్టబయలు అవుతాయనే ఆందోళన చంద్రబాబులో తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రంగప్రవేశం చేసిన పవన్ వ్యూహం.. ప్రభుత్వంపై ఏర్పడుతున్న ప్రజావ్యతిరేకతను దారి మళ్లించడమే కావొచ్చని, గడచిన పరిణామాలను కూడా గమనిస్తే ఇదే అభిప్రాయం బలపడుతుంద'ని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు పీహెచ్‌డీ ఉండాల్సిందే!

- తప్పనిసరి చేస్తూ యూజీసీ నిర్ణయం
- 2021 జూలై 1 తరువాత నుంచి వర్తింపు

సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు పీహెచ్‌డీని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తప్పనిసరి చేసింది. 2021 జూలై 1 తరువాత చేపట్టే నియామకాలకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో పదోన్నతికీ పీహెచ్‌డీ ఉండాలని స్పష్టం చేసింది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, తాత్కాలికం.. పేరేదైనా ఉన్నత విద్యా సంస్థలకు మంజూరైన పోస్టుల్లో తాత్కాలిక సిబ్బంది 10 శాతానికి మించకుండా రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు వర్సిటీలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో బోధన సిబ్బంది నియామకాలకు సరికొత్త నిబంధనలు రూపొందించింది. 'యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ ఆన్ మినిమమ్ క్వాలిఫికేషన్స్ ఫర్ అపాయింట్‌మెంట్ ఆఫ్ టీచర్స్ అండ్ అదర్ అకడమిక్ స్టాఫ్ ఇన్ యూనివర్సిటీస్ అండ్ కాలేజెస్ అండ్ మెజర్స్ ఫర్ ది మెయింటెనెన్స్ ఆఫ్ స్టాండర్డ్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ 2018' పేరుతో డ్రాఫ్ట్ మార్గదర్శకాలను అందుబాటులోకి తెచ్చింది. సీనియర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్ తదితర పోస్టుల భర్తీ, పదోన్నతుల్లో పరిగణనలోకి తీసుకోవాల్సిన అర్హతలు, పనిదినాలు, అకడమిక్ అంశాలను అందులో పొందుపరిచింది. డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన యూజీసీ.. ఆ అంశాలపై ఈ నెల 28లోగా అభిప్రాయాలు తెలపాలని వర్సిటీలు, కాలేజీలను కోరింది. అభిప్రాయ సేకరణ తరువాత తుది మార్గదర్శకాలను జారీ చేసి అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో త్వరలో భర్తీ చేయనున్న 1,061 పోస్టులకూ ఈ నిబంధనలు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్‌లోని ఇతర ప్రధానాంశాలు

- ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారికి పీహెచ్‌డీ ఉండాలి.
- అకడమిక్ రికార్డులతో వివిధ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. ఇంటర్వ్యూకు ఒక్కో పోస్టుకు ఎంతమందిని పిలుస్తారో వర్సిటీ ఇష్టం.
- పేరు ఏదైనా తాత్కాలిక పద్ధతిలో పని చేసే అధ్యాపకులకు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలివ్వాలి.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

కేంద్ర మంత్రి రాజ్‌కుమార్‌సింగ్



చిలకలపూడి (మచిలీపట్నం): ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యుత్‌శాఖ సహాయ మంత్రి ఆర్.రాజ్‌కుమార్‌సింగ్ అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాల మేరకు మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్‌బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ఆదివారం ఆయన మచిలీపట్నం విచ్చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌సింగ్ విలేకరులతో మాట్లాడుతూ.. 2019 మార్చి 31వ తేదీ నాటికి సౌభాగ్య పథకం ద్వారా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.హరిబాబు మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు బంద్ నిర్వహించాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు దారా సాంబయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిశోర్, సగ్గుర్తి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పాల్గొన్నారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఇంటర్/10 +2 స్పెషల్

ఇంటర్మీడియెట్ పరీక్షలు... తుది దశ సన్నద్ధత

తెలుగు రాష్ట్రాల్లో.. ఇంటర్మీడియెట్ పరీక్షల సందడి మొదలైంది. విద్యార్థులు ప్రస్తుతం ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. మరో 18 రోజుల్లో ప్రారంభం కానున్న.. వార్షిక పరీక్షల దిశగా పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాల్సిన సమయం ఆసన్నమైంది! మరోవైపు.. పలు ఎంట్రన్స్ టెస్ట్‌ల తేదీలు.. దరఖాస్తుల ప్రకటనలు.. విద్యార్థులకు కొంత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న ప్రస్తుత సమయంలో ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు నిపుణుల సలహాలు...



ఇంటర్మీడియెట్.. సమీప భవిష్యత్తులో నచ్చిన కోర్సుల్లో ప్రవేశించేందుకు ఎంతో కీలకం. ఇప్పుడు ఏ కోర్సులో కాలు మోపాలన్నా.. ఎంట్రన్స్ టెస్ట్‌లతో పాటు ఇంటర్మీడియెట్‌లో మంచి పర్సంటేజీ కూడా తప్పనిసరిగా మారుతోంది. జాతీయస్థాయిలో జరిగే జేఈఈ-మెయిన్‌లో ఇంటర్మీడియెట్ మార్కులకు వెయిటేజీ తొలగించినప్పటికీ... అడ్వాన్స్‌డ్‌లో 75 శాతం మార్కుల నిబంధన, తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ కొనసాగుతోంది. కాబట్టి ప్రస్తుతం విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలకు పూర్తి సమయం కేటాయించి మంచి మార్కులు సాధించేలా కృషిచేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎంట్రన్స్‌ల టెన్షన్‌కు విరామం

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇంజనీరింగ్ లేదా, మెడికల్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకు సాధించడం తమ లక్ష్యంగా నిర్దేశించుకుంటారు. ఆయా ప్రవేశ పరీక్షల్లో టాప్ ర్యాంకుల కోసం ఇంటర్‌లో చేరిన తొలిరోజు నుంచే కృషి చేస్తుంటారు. అయితే.. ప్రస్తుతం ఆ విద్యార్థులు ఎంట్రన్స్ టెస్ట్‌ల టెన్షన్‌కు విరామం ఇచ్చి.. అందుబాటులో ఉన్న ఈ కొద్ది సమయాన్ని పూర్తిగా ఇంటర్మీడియెట్ పరీక్షల ప్రిపరేషన్‌కే కేటాయించాలనేది నిపుణుల సలహా. ఇప్పుడు ప్రవేశ పరీక్షల గురించి ఆలోచిస్తే అనవసర ఆందోళన, ఒత్తిడి పెరిగి.. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిసిన తర్వాత ఆయా ప్రవేశ పరీక్షలకు ప్రిపరేషన్ ప్రారంభించొచ్చు.

ఆరోగ్యం.. ఆత్మవిశ్వాసం

పరీక్షలు బాగా రాయాలంటే.. ఆరోగ్యం చాలా ముఖ్యం. కాబట్టి విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. అందుకోసం తేలికపాటి ఆహారాన్ని తీసుకుంటూ.. ఎలాంటి ఒత్తిడి, ఆందోళన దరిచేరనీయకుండా ప్రిపరేషన్ కొనసాగించాలి. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం, పరీక్షల్లో రాణించగలననే ఆత్మవిశ్వాసం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. కాబట్టి విద్యార్థులు తాము పరీక్షలు బాగా రాయగలమనే నమ్మకాన్ని పెంపొందించుకోవాలి. రెండేళ్లుగా చేస్తున్న కృషి ఫలితంగా మంచి మార్కులు సాధించగలమనే ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి.

రివిజన్

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో విద్యార్థులు కొత్త అంశాల జోలికి వెళ్లకుండా.. ఇప్పటికే తాము చదివిన అంశాల రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. గత ప్రశ్నపత్రాల ఆధారంగా వెయిటేజీ ఎక్కువ ఉన్న అంశాలపై మరింత పట్టు సాధించేందుకు కృషి చేయాలి. అందుకోసం రెడీ రెకనర్స్, షార్ట్ నోట్స్ వంటి వాటిని ఉపయోగించుకోవాలి.

బైపీసీ



బైపీసీ విద్యార్థులు బోటనీ, జువాలజీ సబ్జెక్టులను అనలిటికల్ అప్రోచ్‌తో చదవాలి. దాంతోపాటు అప్లికేషన్ ఓరియెంటేషన్ అలవరచుకోవాలి.

బోటనీ

- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. మొక్కల శరీర ధర్మశాస్త్రం; బయోటెక్నాలజీ; మైక్రోబ్స్, అణుజీవశాస్త్రం యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. బోటనీ విషయంలో ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్స్ వేయడం ప్రాక్టీస్ చేయాలి. ఫిజియాలజీ చాప్టర్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.
- మొదటి సంవత్సరం విద్యార్థులు.. మొక్కల నిర్మాణాత్మక సంవిధానం-స్వరూప శాస్త్రం; జీవ ప్రపంచంలో వైవిధ్యం; కణనిర్మాణం, విధులు; మొక్కల అంతర్నిర్మాణ సంవిధానం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి యూనిట్లపై ఎక్కువగా దృష్టిపెట్టాలి. దీనికి సంబంధించి డయాగ్రమ్స్ వేయడం బాగా ప్రాక్టీస్ చేయాలి.

జువాలజీ



- జువాలజీ విషయంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి సంబంధిత ఆరోగ్యం; అంతఃస్రావక వ్యవస్థ, నాడీ నియంత్రణ-సమన్వయం; శరీర ద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు; జన్యు శాస్త్రాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. జంతుదేహ నిర్మాణం; గమనం, ప్రత్యుత్పత్తి; జీవావరణం; పర్యావరణం; బొద్దింక జీవ వ్యవస్థ తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి. జువాలజీలో కూడా గ్రాఫికల్ ప్రజంటేషన్ మార్కుల సాధనలో కీలకంగా ఉంటుంది. కాబట్టి డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయాలి.

ఫిజిక్స్

- బైపీసీ-ఫిజిక్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. లిక్విడ్, గ్యాస్, కైనటిక్ గ్యాస్ థియరీ, రొటేటరీ మోషన్, యాంగులర్ మూమెంట్, యూనివర్సల్ గ్రావిటేషన్ లా, ఆర్బిటాల్ వెలాసిటీ వంటి అంశాలు ప్రాధాన్యం ఇవ్వాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. వేవ్ మోషన్; సెమీ కండక్టర్ ఎలిమెంట్స్; మూవింగ్ ఛార్జెస్-మ్యాగ్నటిజం; విద్యుదయస్కాంత ప్రేరణ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి.

కెమిస్ట్రీ

- కెమిస్ట్రీ పరంగా.. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. ఆవర్తన పట్టిక; కర్బన రసాయన శాస్త్రం; రసాయన బంధం; పరమాణు నిర్మాణం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వీటిలోని సమస్యలను సాధన చేయాలి. సినాప్సిస్ రూపొందించుకుంటే రివిజన్‌కు ఉపయుక్తంగా ఉంటుంది.
- ద్వితీయ సంవత్సరంలో పి-బ్లాక్ ఎలిమెంట్స్; ఆర్గానిక్ కెమిస్ట్రీ; విద్యుత్ రసాయన శాస్త్రం; కెమికల్ కైనటిక్స్‌లోని దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

– బి.రాజేంద్ర, సబ్జెక్టు నిపుణులు.

ఎంపీసీ



- ఎంపీసీ విద్యార్థులు ప్రస్తుత సమయంలో మ్యాథమెటిక్స్ పరంగా షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్‌పై పట్టు సాధించేందుకు కృషి చేయాలి.
- ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ద్విపద సిద్ధాంతం; ప్రస్తారాలు-సంయోగాలు, సంభావ్యత; వృత్తాలు; సమాకలనులు; నిశ్చిత సమాకలనులు; అవకలన సమీకరణాలు; డిమూవర్స్ సిద్ధాంతం, వర్గ సమీకరణాలు, పరావలయం తదితర అంశాలను బాగా పునశ్చరణ చేయాలి.
- మొదటి సంవత్సరం విద్యార్థులు.. వెక్టార్ అల్జీబ్రా; మాత్రికలు, సరళరేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్స్ అండ్ డెరివేషన్స్‌కు అధిక సమయం కేటాయించాలి.

– ఎం.ఎన్.రావు, సబ్జెక్టు నిపుణులు.


ఫిజిక్స్



- న్యూమరికల్ అప్రోచ్, అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో మెరుగైన మార్కులు సాధించుకునే అవకాశం ఫిజిక్స్‌లో లభిస్తుంది.
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. రొటేటరీ మోషన్; యూనివర్సల్ గ్రావిటేషన్ లా; ఎస్కేప్ వెలాసిటీ; సింపుల్ హార్మోనిక్ మోషన్ (ఎస్‌హెచ్‌ఎం); సర్ఫేస్ టెన్షన్, థర్మో డైనమిక్స్ తదితర అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- ద్వితీయ సంవత్సరంలోని మూవింగ్ ఛార్జెస్ అండ్ మ్యాగ్నటిజం; కరెంట్ ఎలక్ట్రిసిటీ; ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్; పరమాణువు, వేవ్స్; సెమీ కండక్టర్ ఎలిమెంట్స్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. అదే విధంగా స్టాటిక్ ఎలక్ట్రిసిటీ, డ్యూయల్ నేచర్ ఆఫ్ మ్యాటర్ అంశాలపై శ్రద్ధ చూపాలి.

– సి.హెచ్.రామకృష్ణ, సబ్జెక్టు నిపుణులు.

కెమిస్ట్రీ




- కెమిస్ట్రీలో మంచి మార్కులు సాధించాలంటే.. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రెండు మార్కుల ప్రశ్నలను బాగా సాధన చేయాలి.
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. అటామిక్ స్ట్రక్చర్, పీరియాడిక్ టేబుల్, కెమికల్ బాండింగ్ విభాగాలపై బాగా దృష్టి పెట్టాలి. వీటి నుంచి లాంగ్ ఆన్సర్ క్వశ్చన్స్‌తో పాటు షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్ కూడా వచ్చే అవకాశముంది. దీంతోపాటు స్టేట్స్ ఆఫ్ మ్యాటర్ నుంచి ప్రశ్నలు వస్తాయి. కాబట్టి ఈ చాప్టర్‌పైనా పట్టు సాధించేలా రివిజన్ చేయాలి.
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. కెమికల్ కైనెటిక్స్, ఎలక్ట్రానిక్ కెమిస్ట్రీ, ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ చాప్టర్లపై పట్టు సాధించాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో అయిదు, ఆరు, ఏడు గ్రూప్ మూలకాలను ఔపోసన పట్టాలి. రివిజన్ సమయంలో అకడామీ పుస్తకాల్లో ప్రతి యూనిట్ వెనుక ఇచ్చిన ప్రశ్నలను సాధన చేయడం ద్వారా మరిన్ని మార్కులు పొందే అవకాశముంది.

– టి.కృష్ణ, కెమిస్ట్రీ సబ్జెక్టు నిపుణులు.

రెండు ప్రి-ఫైనల్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ విద్యార్థులు ప్రస్తుత సమయంలో తమ ప్రిపరేషన్‌ను సమీక్షించుకునేలా కనీసం రెండు ప్రి-ఫైనల్ పరీక్షలను రాయాలి. తెలుగు అకాడమీ పుస్తకాల్లోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇక పరీక్షహాల్లో సమాధానాలిచ్చేటప్పుడు తొలుత తమకు బాగా తెలిసిన దీర్ఘ సమాధాన ప్రశ్నలను, తర్వాత స్వల్ప సమాధాన ప్రశ్నలను, చివరగా అతి స్వల్ప సమాధాన ప్రశ్నలను రాయాలి.

టెక్నికల్ ఎడ్యుకేషన్



సుస్థిర కెరీర్‌కు పునాది.. పాలిటెక్నిక్ డిప్లొమా

కొలువులో వేగంగా స్థిరపడాలన్నా, ఇంజనీర్‌గా ఎదగాలన్నా.. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు మించిన ప్రత్యామ్నాయం మరొకటి లేదు. ఒకవైపు నైపుణ్యాల లేమితో బీటెక్ విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే.. డిప్లొమా విద్యార్థులకు మాత్రం అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. దీంతో ఇటీవల డిప్లొమా కోర్సులకు డిమాండ్ పెరిగింది. తెలంగాణలో ఏప్రిల్ 21న పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల ప్రవేశ పరీక్ష (2018-19) నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ప్రకటించింది. ఏపీలో ఈ పరీక్ష ఏప్రిల్ 27న జరగనుంది. ఈ నేపథ్యంలో ఔత్సాహికుల కోసం ముఖ్య సమాచారం...

- పదోతరగతి అర్హతతో ఇంజనీరింగ్ దిశగా బాటలు వేసుకునే అవకాశం పాలిటెక్నిక్ కోర్సులతో లభిస్తుంది. పాలిటెక్నిక్ కోర్సుల కరిక్యులంలో ప్రాక్టికల్ లెర్నింగ్‌కు 50 శాతం వెయిటేజీ ఉంటుంది. దీంతో డిప్లొమా విద్యార్థుల్లో ప్రాక్టికల్ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటోంది. ఇదే అంశం కెరీర్ పరంగా వారికి ఉపయోగపడుతోంది.

ప్రవేశం ఇలా

ఆయా రాష్ట్రాల బోర్డులు (టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్) నిర్వహించే పాలీసెట్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణత. మార్చిలో పరీక్షలు రాయనున్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష స్వరూపం

ప్రవేశ పరీక్షలో 120 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను రెండు గంటల వ్యవధిలో నిర్వహిస్తారు.

విభాగం	ప్రశ్నల సంఖ్య	సబ్జెక్టు
సెక్షన్ ఎ	1 -60	గణితం
సెక్షన్ బి	61 - 90	ఫిజిక్స్
సెక్షన్ సి	91 - 120	కెమిస్ట్రీ

- ప్రశ్నపత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. పేపర్‌ను ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో రూపొందిస్తారు.

డిప్లొమా కోర్సులు

- **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ప్రింటింగ్ టెక్నాలజీ, ఫుట్‌వేర్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ తదితర విభాగాల్లో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఆసక్తి మేరకు కోర్సును ఎంపిక చేసుకోవచ్చు. కోర్సులు మూడు నుంచి మూడున్నర ఏళ్ల వ్యవధిలో ఉంటాయి.

ప్రయోజనాలు

- కంపెనీల్లో పాలిటెక్నిక్ అర్హతతో నిర్వర్తించే సూపర్‌వైజరీ, సైట్ ఇంజనీర్ పోస్టుల సంఖ్య పెరుగుతోంది. కంపెనీలు ప్రాంగణ నియామకాలు చేపట్టి పాలిటెక్నిక్ ఉత్తీర్ణులకు ఉద్యోగాలు అందిస్తున్నాయి.
- మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పాలిటెక్నిక్ కోర్సుల్లో లెదర్ టెక్నాలజీ, ఫుట్‌వేర్ టెక్నాలజీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ తదితర ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టారు.
- కోర్సులో భాగంగా నేర్చుకునే ల్యాబ్ పరిజ్ఞానం వల్ల బీటెక్ అభ్యర్థులతో పోల్చితే డిప్లొమా విద్యార్థులు ఉద్యోగ సాధనలో ముందుంటున్నారు.
- డిప్లొమా పూర్తిచేస్తే ప్రారంభంలోనే నెలకు రూ.15 వేలకు అందుకోవచ్చు. ఈ కోర్సుల ద్వారా ఆర్థిక వెసులుబాటు లేని విద్యార్థులు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను పూర్తిచేయొచ్చు.
- ఇంటర్, ఇతర సంప్రదాయ డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన వారితో పోల్చితే పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువ.

ఉన్నత విద్య



పాలిటెక్నిక్ విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ సెకండియర్‌లో ప్రవేశం పొందొచ్చు. దీనికోసం ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్)లో ఉత్తీర్ణత సాధించాలి. బీటెక్ తర్వాత సంబంధిత స్పెషలైజేషన్లలో ఎంటెక్, ఎంఈ కోర్సులు చేయొచ్చు. గేట్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్సీ తదితర జాతీయ స్థాయి సంస్థల్లో; పీజీఈసెట్‌ల ద్వారా రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీల అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంటెక్ పూర్తి చేయొచ్చు.

బులెటిన్ బోర్డ్

పీజీసీఐఎల్‌లో 28 ఖాళీలు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) నార్తర్న్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-2.. 28 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** డిప్లొమా ట్రైనీ-25 (ఎలక్ట్రికల్-20+సివిల్-5), జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (హెచ్ఆర్)-3.
- **అర్హతలు:** డిప్లొమా ట్రైనీకి సంబంధిత విభాగాలను బట్టి కనీసం 70 శాతం (ఎస్టీలకు పాస్ మార్కులు) మార్కులతో ఇంజనీరింగ్ డిప్లొమా; జూనియర్ ఆఫీసర్ ట్రైనీకి కనీసం 55 శాతం (అన్ని కేటగిరీలకూ) మార్కులతో హెచ్ఆర్/పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్‌లో పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/ఎంబీఏ/ఎంఎస్‌డబ్ల్యూ.
- **వయసు:** 2018, ఫిబ్రవరి 27 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. జూనియర్ ఆఫీసర్ ట్రైనీ అభ్యర్థులకు రిజర్వేషన్లు వర్తించవు.
- **స్టైపెండ్:** రూ.16,500.
- **ఎంపిక:** డిప్లొమా ట్రైనీకి టెస్ట్, జూనియర్ ఆఫీసర్ ట్రైనీకి టెస్ట్, కంప్యూటర్ స్కిల్ టెస్ట్.
- **దరఖాస్తు రుసుం:** జనరల్-రూ.300; మిగిలిన రిజర్వుడ్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 27, 2018.
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ జార్ఖండ్‌లో 29 ఖాళీలు

జార్ఖండ్‌లోని రాయ్‌పూర్‌లో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ జార్ఖండ్ (సీయూజే).. 29 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

- **పోస్టులు-ఖాళీలు:** ప్రొఫెసర్-10, అసోసియేట్ ప్రొఫెసర్-17, అసిస్టెంట్ ప్రొఫెసర్-2.
- **బోధన విభాగాలు:** అప్లైడ్ కెమిస్ట్రీ, అప్లైడ్ మ్యాథమెటిక్స్, అప్లైడ్ ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎడ్యుకేషన్, ఎనర్జీ ఇంజనీరింగ్, ఇంగ్లిష్ స్టడీస్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, హిందీ డిపార్ట్‌మెంట్, ట్రైబల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ల్యాండ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, లైఫ్ సైన్సెస్, మాస్ కమ్యూనికేషన్, మ్యూజిక్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, నానోటెక్నాలజీ, కాంటెంపరరీ ట్రైబల్ కస్టమరీ లా.
- **వేతనశ్రేణి:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-39,100.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, బోధన విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ/మాస్టర్ డిగ్రీ/తత్సమాన విద్య. అలాగే నిబంధనల మేర ఎంఈడీ/బీఈడీ/నెట్/స్లెట్/సెట్, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** అకడమిక్ రికార్డ్స్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.cuj.ac.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 12-2-2018

స్టాక్ మార్కెట్లు
(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
407 ▼	122 ▼
34,006	10,455

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	6,874	▲	97
డోజోన్స్	24,191	▲	330
ఎఫ్‌టీఎస్ఈ 100	7,092	▼	78
డాక్స్	12,107	▼	153
షాంఘై	3,131	▼	131
నికాయ్	21,383	▼	508

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	58.58	67.93
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	81.63	94.68
€	యూరో	థామస్‌కుక్	71.80	83.26
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	53.71	62.30
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	45.57	52.73
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	43.97	52.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.57	18.46
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.94	18.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.20	11.67



సురక్షిత.. శాశ్వత.. పోర్ట్‌ఫోలియో!

రిస్క్ తక్కువ, రాబడులు మధ్యస్థం

నాలుగు విభాగాల్లో సమాన పెట్టుబడులు
బంగారం, డెట్, ఈక్విటీలు, నగదు
ఇన్వెస్టింగ్ తెలియకపోయినా ఆచరణీయం

మెరుగైన రాబడుల కోసం వ్యూహాత్మక అలోకేషన్‌తోపాటు, ట్యాక్టికల్ అలోకేషన్‌ను కూడా ఇన్వెస్టర్లు అనుసరిస్తుంటారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేటాయింపులను వివిధ సాధనాల మధ్య మార్పు చేస్తుంటారు. అయితే, ఇది సరిగ్గా చేస్తేనే ఇన్వెస్టర్లకు ప్రయోజనం కలుగుతుంది. ఇందుకు ఉదాహరణ మార్కెట్ విలువలు తక్కువగా ఉన్నప్పుడు ఈక్విటీలకు నిధుల కేటాయింపును పెంచడం, మార్కెట్ విలువలు అధిక స్థాయికి చేరినప్పుడు ఈక్విటీల్లో పెట్టుబడులు తగ్గించుకోవడం వల్ల మంచి రాబడులు అందుకోవచ్చు. అయితే, ట్యాక్టికల్ అలోకేషన్‌లో పెట్టుబడుల కేటాయింపులు అన్నవి ఎక్కువ సార్లు మార్కెట్ సెంటిమెంట్ ఆధారంగా ఉంటాయి. దాంతో అది తప్పుడు ఎంపిక అవుతుంది. బేర్ మార్కెట్లో రిస్క్‌ను భరించలేని ఇన్వెస్టర్లు బుల్ మార్కెట్లో రిస్క్ తీసుకోవడం గమనించొచ్చు. ''అధిక వ్యాల్యూయేషన్లు ఉన్నప్పుడు సహజంగా ఎక్స్‌పోజర్ తగ్గించుకోవాల్సింది పోయి ఇతర సాధనాల నుంచి మరిన్ని నిధులను ఈక్విటీ వైపు మళ్లిస్తుంటారు'' అని అవుట్‌లుక్ ఏషియా క్యాపిటల్ సీఈవో మనోజ్ నాగ్‌పాల్ పేర్కొన్నారు. రిస్క్ తగ్గించుకోవాలని అనుకుంటున్నవారు, శాశ్వత పోర్ట్‌ఫోలియోను అనుసరించడం ద్వారా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిధుల కేటాయింపుల్లో మార్పులు చేసుకునే అవసరం ఉండదు. నాలుగు ప్రధాన సాధనాల్లో... ఈక్విటీ, ప్రభుత్వ డెట్, బంగారం, నగదు వీటిలో సమాన భాగాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా శాశ్వత పోర్ట్‌ఫోలియో ఏర్పడినట్టు అవుతుంది.

ఉపయోగాలు

పర్మినెంట్ పోర్ట్‌ఫోలియో విధానాన్ని ఆవిష్కరించిన వ్యక్తి అనలిస్ట్ హ్యారీ బ్రౌనే. 'ఫెయిల్ సేఫ్ ఇన్వెస్టింగ్' అనే పుస్తకంలో తొలిసారిగా పేర్కొన్నారు. ఈ విధానంలో ఒక విభాగంలో మార్కెట్ పరిస్థితుల వల్ల విలువ క్షీణిస్తే, అదే సమయంలో మరో విభాగంలో పెరుగుదల కారణంగా పెట్టుబడుల విలువ పడిపోకుండా కాపాడుతుంది. ఉదాహరణకు ఆర్థిక రంగం మంచి ఊపు మీద ఉన్నప్పుడు ఈక్విటీలు బాగా రాణిస్తాయి. అదే సంక్షోభంలో ఇవి వెలుగులు కోల్పోతాయి. ప్రభుత్వ బాండ్లు సంక్షోభంలో మంచిగా రాణిస్తాయి. వడ్డీ రేట్లు తగ్గి బాండ్ల ధరలు పెరుగుతాయి కనుక. అదే సమయంలో ఆర్థిక రంగం బూమ్ మీదున్న సమయంలో ప్రభుత్వ బాండ్లు అంతగా రాణించవు. ఇందుకు నిదర్శనం డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్స్ 2008 సంక్షోభ సమయంలో 55.38 శాతం పతనం అయితే, దీర్ఘకాల గిల్ట్ ఫండ్స్ (ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసేవి) 26 శాతం పెరిగాయి. ఇతర సాధనాలతో పోలిస్తే బంగారం భిన్నంగానే ఉంది. ఇది పర్మినెంట్ పోర్ట్‌ఫోలియోకు స్థిరత్వాన్ని ఇచ్చేది. ఆకస్మిక అంతర్జాతీయ పరిణామాల నుంచి రక్షణనిస్తుంది. అంతర్జాతీయంగా ఏవైనా ప్రతికూల పరిణామాల్లో బంగారం మినహా ఇతర సాధనాల్లో ఆటుపోట్లు ఉంటాయి. రూపాయి తరుగుదల ప్రభావాన్ని బంగారం కాచుకోగలదు. 2008లో ఈక్విటీలు 55.38శాతం పతనమైనప్పటికీ దేశీయంగా బంగారం 14.35శాతం రాబడులను ఇచ్చింది. మొత్తం మీద నాటి సంక్షోభ ఏడాదిలో పర్మినెంట్ పోర్ట్‌ఫోలియోను గమనిస్తే కేవలం 1.55 శాతం నష్టాలకే పరిమితమైంది. ప్రభుత్వ బాండ్లు, బంగారమే పెట్టుబడుల విలువ హరించుకుపోకుండా కాపాడాయి. అదే 2009 సంవత్సరాన్ని గమనిస్తే ఈ పెట్టుబడి సాధనాల రాబడులు మారిపోయాయి. ఈక్విటీలు 88 శాతం రాబడులను ఇచ్చాయి. ప్రభుత్వ బాండ్లపై రాబడులు పెరిగిపోవడంతో బాండ్ల ధరలు తగ్గిపోయాయి. దీంతో గిల్ట్ ఫండ్స్‌లో 6.31 శాతం ప్రతికూల రాబడులు (నష్టాలు) నమోదయ్యాయి. ప్రభుత్వ డెట్ అన్నది పూర్తిగా సురక్షితం అన్న నమ్మకాన్ని పోగొట్టింది ఆ సంవత్సరమే. ప్రభుత్వ సెక్యూరిటీలు అన్నవి తిరిగి చెల్లింపుల ఎగవేతల పరంగా రిస్క్ లేనివి. అంతేకానీ, రాబడులు ప్రతికూలంగా ఉండవని ఏమీలేదు. కాకపోతే 2009లో ఈక్విటీ, బంగారం కారణంగా పర్మినెంట్ పోర్ట్‌ఫోలియో రాబడులు 29.7%గా నమోదయ్యాయి. నగదు విభాగం ఒక్కటే ఇన్నేళ్ల కాలంలో స్థిరంగా కొనసాగింది. స్వల్పకాలిక రేట్లు పెరిగినప్పుడు లబ్ధి కూడా పొందింది. 2013లో లిక్విడ్ ఫండ్ అనేది మంచి పనితీరు చూపించిన సాధనం. ఆ ఏడాదిలో 9.08% వృద్ధి చెందింది. అందుకే పర్మినెంట్ పోర్ట్‌ఫోలియోలో ఇది చేర్చతగింది. ఎందుకంటే నగదుకు కటకట ఏర్పడినప్పుడూ ఇది ఆదుకుంటుంది.

రాబడులు

శాశ్వత పోర్ట్‌ఫోలియో రిస్క్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. అయితే, ఇన్వెస్టర్లు మోస్తరు రాబడులతో సంతృప్తి చెందేవారై ఉండాలి. ఇది చాలా సులభ మోడల్ అని, సగటు రాబడులే వస్తాయని నాగ్‌పాల్ తెలిపారు. అందరూ అత్యాధునిక విధానాలను ఆచరణలో పెట్టి, అధిక రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా ఉండరు. పెట్టుబడులకు నిధుల కేటాయింపు ఏ విధంగా చేయాలన్న విషయంలో అవగాహన లేని వారికి పర్మినెంట్ పోర్ట్‌ఫోలియో ఉపయోగకరంగా ఉంటుందని సెబీ నమోదిత పెట్టుబడుల సలహాదారు విక్రమ్ కృష్ణమూర్తి తెలిపారు. కనుక పెట్టుబడుల గురించి పెద్దగా తెలియని వారు, తక్కువ రిస్క్‌తో మోస్తరు రాబడులు వచ్చినా, ఫర్వాలేదనుకునే వారు పర్మినెంట్ పోర్ట్‌ఫోలియోను నిశ్చింతగా ఆచరణలో పెట్టుకోవచ్చు. ఈ విధానాన్ని ఆచరణలో పెట్టేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి ప్రతీ నెలా పెట్టుబడులకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి 25 శాతాన్ని ఒక్కో పెట్టుబడుల విభాగంలో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లడం. ఏటా నిధుల కేటాయింపుల్లో మార్పులు చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ పెట్టుబడుల గురించి తగిన అవగాహన ఉంటే వార్షికంగా పర్మినెంట్ పోర్ట్‌ఫోలియోను రీబ్యాలన్స్ చేసుకోవచ్చు. ఇక, సొంతంగా పోర్ట్‌ఫోలియో ఏర్పాటు చేసుకోలేని వారు రెడీమేడ్‌గా ఇన్వెస్ట్ చేసుకోవడమే. యాక్సిస్ ట్రిపుల్ అడ్వాంటేజ్ ఫండ్ ఎంచుకుంటే ఇది ఈక్విటీ, డెట్, బంగారంలో సమ భాగాలుగా ఇన్వెస్ట్ చేస్తుంది. రిస్క్ తక్కువగా ఉండడం ప్రధాన ఆకర్షణ. యాక్సిస్ ట్రిపుల్ అడ్వాంటేజ్ ఫండ్ ఏడేళ్ల వార్షిక వృద్ధి 7.41 శాతంగా ఉంది.

క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ ఉండాలి

క్లిష్టమైన అనారోగ్యం ఎదురైతే ఆదుకుంటుంది

ఈ సారి బడ్జెట్లో వయో వృద్ధులు కొన్ని రకాల చికిత్సల కోసం చేసే వ్యయంపై పన్ను మినహాయింపును రూ.లక్ష వరకూ పెంచారు జైట్లీ. అంటే క్రిటికల్ ఇల్‌నెస్ చికిత్సకన్న మాట. ప్రస్తుతం ఇది సీనియర్ సిటిజన్ల విషయంలో రూ.60వేలుగా, అత్యంత సీనియర్ సిటిజన్లకు రూ.80వేలుగా ఉంది. ఇకపై అందరికీ ఇది రూ.లక్షగా ఉంటుందన్న మాట. అసలింతకీ ఈ క్రిటికల్ ఇల్‌నెస్ అంటే ఏంటి? దీనికి ఖర్చులెంతవుతాయి? దీనికి బీమా కవరేజీ ఉంటుందా? కవరేజీ కావాలంటే ఏం చేయాలి? అసలు క్రిటికల్ ఇల్‌నెస్‌కు బీమా కవరేజీ ఎందుకు అవసరం? ఇవన్నీ వివరించేదే ఈ ప్రాఫిట్ ప్లస్ ప్రధాన కథనం...

(సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం)

ఆయా వ్యాధులకు ఏక మొత్తంలో పరిహారం

వైద్య బీమాలో చెల్లించేది ఆసుపత్రి వ్యయాలకే!

పెరుగుతున్న కేన్సర్, హార్ట్‌ఎటాక్, స్ట్రోక్ కేసులు

వీటి బారిన పడితే భారీ వ్యయాలు తప్పవు

'క్రిటికల్' పాలసీతో తగినంత రక్షణకు అవకాశం



తీవ్రమైన అనారోగ్యం రూపంలో... ఊహించని సందర్భాలు ఎదురవటం కొత్తేమీ కాదు. అలాంటి సందర్భాల్లో వైద్య బీమా పూర్తిగా ఆదుకుంటుందని చెప్పలేం. ఎందుకంటే కవరేజీ పరంగా పరిమితులు ఉంటాయి. అదే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ తీసుకుని ఉంటే ఆ పాలసీ పరిధిలో ఉన్న వ్యాధుల బారిన పడినపుడు నిర్దేశిత పరిహారం అందుతుంది. ఈ తరహా బీమా 15 ఏళ్ల నుంచీ ఉన్నదే. మొదట్లో జీవిత బీమా పాలసీలకు రైడర్‌గా వచ్చేది. అయితే, ఈ కవరేజీ తీసుకునేందుకు ఎన్నో వైద్య పరీక్షలు అవసరం కనక అప్పట్లో దీని పట్ల పెద్ద ఆసక్తి ఉండేది కాదు. దీంతో వీటి అమ్మకాలు చాలా తక్కువగా నడిచాయి. వీటికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా బీమా సంస్థలే చొరవతో ఆ తర్వాత పూర్తి స్థాయి, స్టాండలోన్ పాలసీలుగా తీసుకురావడం మొదలెట్టాయి. దీంతో వాటి క్లెయిమ్ చెల్లింపుల చరిత్రను ట్రాక్ చేసే అవకాశం లభించింది. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలు సమగ్రమైన కవరేజీతో ఉండడం అదనపు ఆకర్షణ.

'క్రిటికల్' పాలసీ వేరు...

కుటుంబీకులో, బంధుమిత్రులో కేన్సర్, గుండెజబ్బు వంటి వాటి బారిన పడ్డట్లు వినటమనేది పెరిగిపోయింది. చిన్న వయసులో ఉన్న వారు కూడా వీటికి అతీతం కాకపోవడం ఆందోళన కలిగించేదే. ఈ నేపథ్యంలో క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ తీసుకోవాల్సిన అవసరం పెరిగిపోయిందనే చెప్పాలి. చాలా మంది సాధారణ వైద్య బీమా పాలసీకి, క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ పాలసీకి మధ్య తేడా లేదనుకుంటుంటారు. కానీ ఇది తప్పు. ఈ రెండూ వేర్వేరు అవసరాలను తీర్చేవని, ఒకదానికొకటి తోడుగా మరింత రక్షణనిస్తాయని అర్థం చేసుకోవాలి. వైద్య బీమా అంటే ఆసుపత్రి ఖర్చులను మాత్రమే భరిస్తుంది. కానీ, క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ ఖర్చుతో సంబంధం లేకుండా వ్యాధుల బారిన పడినప్పుడు నిర్దేశిత మొత్తం చెల్లిస్తుంది. ఏ కారణంతో ఆస్పత్రి పాలైనా వైద్య బీమా ఆదుకుంటుంది. కానీ, క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ అన్నది ముందుగా పేర్కొన్న వ్యాధుల బారిన పడితే పరిహారం చెల్లిస్తుంది. వైద్య బీమా పాలసీని జీవితాంతం రెన్యువల్ చేసుకోవచ్చు. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ మాత్రం ఒకసారి క్లెయిమ్ చేస్తే ఆగిపోతుంది.

ఎలా ఎంచుకోవాలి?

పాలసీ ప్రీమియం, క్లెయిమ్‌ల పరిష్కార శాతం అన్నవి కీలకం. అలాగే, విడిగా ఆయా పాలసీలు ఎన్ని వ్యాధులకు రక్షణ కల్పిస్తున్నాయి? ముందు నుంచీ ఉన్న వ్యాధులకూ కవరేజీ పొందాలంటే ఎన్నాళ్లు వేచి ఉండాలి? పాలసీ కాల వ్యవధి ఎంత? గరిష్ఠంగా ఎంత బీమాకు అవకాశముంది? వంటివన్నీ చూడాలి. సాధారణంగా కంపెనీని బట్టి 10 నుంచి 37 వ్యాధుల వరకు కవరేజీనిచ్చే పాలసీలున్నాయి. అయితే ఇక్కడ సంఖ్య కాదు ముఖ్యం. కవరేజీనిస్తున్న వ్యాధులు ఎలాంటివన్నది చూడాలి. అంధత్వం, చెవిటితనం, మాట్లాడే శక్తిని కోల్పోవడం, అల్జీమర్స్ (జ్ఞాపకశక్తి క్షీణించిపోవడం), మల్టిపుల్ స్కెలరోసిస్, స్ట్రోక్ తదితర వ్యాధులకు పరిహారం చెల్లించే వాటికి ప్రాధాన్యం ఇచ్చే వారూ ఉన్నారు. ఎందుకంటే వీటికి ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం ఉండదు. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ ద్వారా నిర్ణీత పరిహారం పొందొచ్చు. వీటికి సాధారణ వైద్య బీమా పాలసీలో కవరేజీ పరిమితంగానే ఉంటుంది. ఉదాహరణకు అపోలో మ్యూనిక్ క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ అయితే వ్యాధుల సంఖ్య పరంగా, వ్యాధుల పరంగా మెరుగైన పాలసీయేనని చెప్పొచ్చు. ముందు నుంచీ ఉన్న వ్యాధులకు కవరేజీ ఇవ్వని పాలసీలకు దూరంగా ఉండటమే మంచిది. ఎందుకంటే భవిష్యత్తులో ఒకవేళ ఆయా వ్యాధులకు సంబంధించి క్లెయిమ్ ఎదురైతే తిరస్కరణకు గురికావొచ్చు. టాటా ఏఐజీ, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో అయితే ముందు నుంచీ ఉన్న వ్యాధుల కవరేజీకి నాలుగేళ్ల పాటు వేచి ఉండాలన్న నిబంధన విధిస్తున్నాయి.

చికిత్సా వ్యయాలు

క్లిష్టమైన అనారోగ్యం బారిన పడితే చికిత్సా వ్యయాలను తట్టుకోవటం సామాన్యులకు భారమే. కేన్సర్, అవయవ మార్పిడి, ఓపెన్‌హార్ట్ సర్జరీలకు వ్యయం రూ.10 లక్షలకు తక్కువ కాదు. ఈ వ్యాధులకు చికిత్సా వ్యయాలు ఏటా 15–20 శాతం స్థాయిలో పెరుగుతున్నాయి. అంటే ఓ పదేళ్ల తర్వాత ఈ వ్యాధులకయ్యే వ్యయం రూ.50 లక్షలకు చేరొచ్చు. అందుకే సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ) ఎక్కువ ఉండాలి. చాలా వరకు క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలు జీవితాంతం రెన్యువల్‌కు అవకాశం ఉన్నవే. అయితే ముందే వీటిని తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. రెలిగేర్, మ్యాక్స్ బూపా సంస్థలు అయితే రూ.కోటికి పైగా కవరేజీతో క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను అందిస్తున్నాయి.

సర్వైవల్ పీరియడ్

క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీల్లో సాధారణంగా 30 నుంచి 90 రోజుల వరకు సర్వైవల్ పీరియడ్ ఉంటుంది. అంటే వ్యాధి బారిన పడిన తర్వాత ఇన్ని రోజుల పాటు జీవించి ఉంటేనే పరిహారం క్లెయిమ్ చేసుకోగలరు. నిజానికి ఇది ఆమోదనీయం కాదు. ఎందుకంటే తీవ్ర వ్యాధుల బారిన పడిన తర్వాత కొన్ని రోజుల్లోనే ప్రాణాలు కోల్పోయిన కేసులు ఎన్నో ఉంటున్నాయి. ఉదాహరణకు హార్ట్ ఎటాక్ వచ్చి గంటల వ్యవధి లోనే ప్రాణాలు కోల్పోతున్న కేసులు చూస్తూనే ఉన్నాం. ఐసీఐసీఐ లాంబార్డ్ సంస్థ మాత్రం ఈ విధమైన సర్వైవల్ పీరియడ్ షరతు విధించడం లేదు. కొన్ని నెలల క్రితం 600 క్లెయిమ్‌లను (ఇవన్నీ వివిధ బీమా కంపెనీలకు సంబంధించిన గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్‌వి) ఓ సంస్థ విశ్లేషించగా తేలిన విషయం ఏమిటంటే... ఇందులో 50 క్రిటికల్ ఇల్‌నెస్‌వి. వీటిలోనూ 15 క్లెయిమ్‌లు సమ్ అష్యూర్డ్ పరిమితి దాటినవే. కనుక ప్రతీ ఒక్కరికీ క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ ఆరోగ్యపరంగా, ఆర్థిక పరంగా ఎంతో అవసరమని అర్థం చేసుకోవాలి.

ఫండ్స్‌లో.. ఇన్వెస్ట్ చేస్తున్నారా..?

మీకంటూ బాధ్యతలు, హక్కులు

స్టాక్ మార్కెట్ల ర్యాలీ కారణంగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది. డెట్ ఫండ్స్‌కూ ఆదరణ పెరుగుతూ వస్తోంది. అయితే, పెట్టుబడులు పెట్టేయడంతోనే బాధ్యత అయిపోయిందనుకోవడం సరికాదు. ఓ ఇన్వెస్టర్‌గా చట్టపరంగా మీకుండే హక్కులు, బాధ్యతల గురించి తప్పకుండా తెలుసుకోవాలి. ఈ నేపథ్యంలో ప్రతీ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలపై అందిస్తున్న ప్రాఫిట్ కథనం ఇది.

కేవైసీ కాంప్లియంట్

ప్రతీ ఇన్వెస్టర్ కేవైసీ (నో యువర్ కస్టమర్) నిబంధనలను పూర్తి చేయడం తప్పనిసరి. నల్లధనానికి చెక్ పెట్టడం, చట్టవిరుద్ధమైన నిధులు ఫండ్స్‌లోకి రాకుండా అడ్డుకోవడమే ఈ నిబంధనల ఉద్దేశ్యం. కేవైసీ కింద ఇన్వెస్టర్ గుర్తింపునకు సంబంధించి చెల్లుబాటయ్యే ఓ ధ్రువ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, చిరునామా ధ్రువీకరణ, ఓ పాస్‌పోర్ట్ సైజు ఫొటో కూడా ఇవ్వాలి. గుర్తింపు, చిరునామా ధ్రువీకరణకు పాస్‌పోర్ట్, పాన్, వోటర్ ఐడీ చెల్లుబాటవుతాయి. పైగా ఆధార్‌ను ఇతర అన్ని కేవైసీ పత్రాలతో అనుసంధానం చేయాలి. ఏ ఇన్వెస్టర్ అయినా గానీ కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీల వద్ద తమ కేవైసీ వివరాలను అప్‌డేట్ చేయించుకుంటే, ఆతర్వాత ఆ వ్యక్తికి సంబంధించిన అన్ని పెట్టుబడుల్లోనూ ఆ మేరకు ఆటోమేటిక్‌గా మార్పులు జరిగిపోతాయి.

వ్యక్తిగత సమాచారం

ప్రతీ ఇన్వెస్టర్ కూడా తనకు సంబంధించి సంప్రదింపులకు వీలుగా చిరునామా, కాంటాక్టు నంబర్లు, ఈమెయిల్ ఐడీ, పాన్, ఒక బ్యాంకు ఖాతా వివరాలను తెలియజేయాలి. అంతేకాదు, వీటిలో మార్పులు చోటు చేసుకున్నప్పుడు ఆ సమాచారాన్ని వెంటనే ఆయా ఫండ్ సంస్థలకు తెలియజేయడం ప్రతీ ఇన్వెస్టర్ బాధ్యతే. బ్యాంకు ఖాతాకు సంబంధించి ఐఎఫ్ఎస్‌సీ నంబర్, 9 అంకెల ఎంఐసీఆర్ ఇవ్వడం కూడా మర్చిపోవద్దు. మోసాల నివారణకు వీలుగా ఈ కీలక సమాచారం ఫండ్స్ సంస్థలకు తెలియజేయడం అవసరం.

నామినేషన్

ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం ప్రతీ ఇన్వెస్టర్ కనీసం నామినీగా ఒక్కరి పేరును అయినా సూచించాలి. లేదంటే ఎవరినీ నామినీగా నియమించడం ఇష్టం లేదని ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇన్వెస్టర్‌గా ఏదైనా జరిగితే నామినేషన్ అక్కరకు వస్తుంది.

పరిశీలిస్తూ ఉండాలి...

తాము పెట్టుబడి పెట్టిన పథకాల పనితీరు ఎలా ఉన్నదీ అప్పుడప్పుడూ పరిశీలిస్తూ ఉండడం అవసరం. ఇందుకు సంబంధించి ఆయా ఫండ్ పథకాల ఎన్‌ఏవీ చూస్తే తెలిసిపోతుంది. దీర్ఘకాలిక లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేస్తున్నట్టయితే రోజువారీ, ప్రతీ వారం రాబడులు ఎలా ఉన్నదీ చూసుకోవాల్సిన అవసరం లేదు. క్రమం తప్పకుండా నెలకోసారి రాబడులను సమీక్షిస్తూ వెళితే సరిపోతుంది. మరీ తరచుగా కాకపోయినా మధ్య మధ్యలో ఆయా పథకాల పనితీరు ఎలా ఉన్నదీ గమనించడం అవసరమే. దీనివల్ల మార్కెట్ల పని తీరుకు అనుగుణంగా ఆయా పథకాల పనితీరు ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది. అవసరమైతే పెట్టుబడుల్లో మార్పులు కూడా చేసుకోవచ్చు.


ఆర్థిక ప్రణాళిక

ఆర్థిక ప్రణాళిక వ్యక్తిగత అవసరాల కోసం కాకుండా కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ప్రతీ ఇన్వెస్టర్ గుర్తుంచుకోవాలి. కుటుంబ భవిష్యత్తు అవసరాలు, కీలకమైన ఆర్థిక లక్ష్యాలు, ఇందులో స్వల్పకాలిక, మధ్య కాలిక, దీర్ఘ కాలిక అవసరాలు ఏవి, ఇందుకోసం ఎంచుకోవాల్సిన సాధనాలు, అస్సెట్ అలోకేషన్ తదితర వివరాలతో ప్రణాళిక ఉండాలి. అలాగే, ఆదాయం, ఖర్చులు, ఎంత మేర పెట్టుబడులకు కేటాయించాలి, ఇందుకోసం అందుబాటులో ఉన్న వనరులు ఇలా అన్ని వివరాలు సమగ్రంగా ఉండాలి. అలాగే, అత్యవసరాల్లో ఆదుకునే నిధి కూడా ఏర్పాటు చేసుకోవాలి. అలాగే, సరిపడా జీవిత బీమా కవరేజీ కూడా తీసుకోవాలి. వీటిని క్రమానుగతంగా సమీక్షిస్తూ అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవడం కూడా అవసరమే.

ఆధార్, ఫ్యాక్టా

ప్రతీ వ్యక్తి తమ పేరిట ఉన్న అన్ని రకాల పెట్టుబడులకు ఆధార్ నంబర్‌తో ఇవ్వడాన్ని తప్పనిసరి చేసింది కేంద్ర సర్కారు. అలాగే, విదేశీ పన్ను చట్టం (ఫ్యాక్టా) నిబంధనలనూ అనుసరించాల్సి ఉంటుంది.





“ఇన్నోవేషన్ అనేది లీడర్‌కి, ఫాలోవర్‌కి మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని తెలియజేస్తుంది”
– స్టీవ్ జాబ్స్, యాపిల్ సహ వ్యవస్థాపకులు

పొదుపు-మదుపు



మార్కెట్లు పెరిగినా ఇబ్బంది లేదు!

రాబడుల విషయంలో ఈక్విటీలను మించి అధిక రాబడులనిచ్చే సాధనాలు దాదాపుగా లేవనే చెప్పాలి. దీర్ఘకాలిక మూలధన లాభాలు రూ.లక్ష దాటితే 10 శాతం పన్ను ప్రవేశపెట్టడం వల్ల రాబడులు పెద్దగా ప్రభావితం కావని, ఈక్విటీలు భవిష్యత్తులోనూ మెరుగైన రాబడులనే ఇస్తాయన్నది విశ్లేషకుల అంచనా. ఈ నేపథ్యంలో... స్టాక్ మార్కెట్లు గరిష్ట స్థాయిలో ఉన్నా కూడా రిస్క్ పెద్దగా లేకుండానే తగిన రాబడులు కావాలనుకునే వారు ఎల్ అండ్ టీ ప్రుడెన్స్ ఫండ్‌ను పరిశీలించొచ్చు.

L&T India Prudence Fund
An open-ended equity growth fund
L&T Mutual Fund

ఫండ్ పెట్టుబడులు ఎలా..?

విభాగం	నిధులు (శాతం)
డెట్	26.6
బ్యాంకులు	13.7
ఫైనాన్స్	9.3
కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టులు	5.3
ఫార్మా	5.1
ఆటో	4.9
ఇతర విభాగాలు	35.1



ఎల్‌అండ్‌టీ ప్రుడెన్స్ ఫండ్ ఈక్విటీ ఆధారిత బ్యాలన్స్‌డ్ ఫండ్. పథకం పరిధిలోని మొత్తం నిధుల్లో 65 శాతం వరకు ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేస్తారు. మిగిలిన 35 శాతం మేరకు డెట్ మార్కెట్లో పెట్టుబడి పెడతారు. మార్కెట్లు పెరిగి ఉన్నప్పటికీ మరింత ర్యాలీ చేస్తే ఆ అవకాశం కోల్పోకుండా ఈక్విటీ పెట్టుబడులు ఉపయోగపడతాయి. అదే సమయంలో కరెక్షన్‌కు లోనైతే రిస్క్ తక్కువగా ఉండేందుకు డెట్ ఎక్స్‌పోజర్ సాయపడుతుంది. కనుక ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఈ ఫండ్ ఒక మంచి ఆప్షన్.

పెట్టుబడుల విధానం, పనితీరు

మార్కెట్ల ర్యాలీ ఎంత పద్ధతి ప్రకారం ఉన్నాగానీ ఈ ఫండ్ ఈక్విటీ పెట్టుబడులను పరిమితికి మించి పెంచదు. ఏ సమయంలో చూసినా ఈక్విటీ ఎక్స్‌పోజర్ 65–75 శాతం మధ్యలోనే ఉంటుంది. మార్కెట్లు బుల్ ర్యాలీ సమయంలో ఎక్స్‌పోజర్‌ను గరిష్ఠంగా 75 శాతం వరకు పెంచుతుంది. ఆటుపోట్లు ఎక్కువైతే పెట్టుబడుల్ని 65 శాతానికి పరిమితం చేస్తుంది. ఈక్విటీల్లోనూ రిస్క్ తక్కువ ఉండే విభాగంపైనే ఎక్కువ దృష్టి పెడుతుంది. ఆటుపోట్లు ఎక్కువగా ఉండే మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో (మార్కెట్ క్యాప్ రూ.10,000 కోట్లకు తక్కువగా ఉన్నవి) పెట్టుబడుల్ని 30 శాతం మించకుండా చూస్తుంది. అలాగే డెట్ వైపు కూడా ఏఏఏ, ఏఏ రేటింగ్ ఉన్న బాండ్లలోనే ఇన్వెస్ట్ చేస్తుంది. బాండ్లలోనూ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎక్స్‌పోజర్ పెంచుకోవడం, తగ్గించుకోవడం చేస్తుంటుంది. ఈక్విటీ విభాగంలో 2013లో సాఫ్ట్‌వేర్, కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్ రంగాలు, 2014 ర్యాలీలో బ్యాంకింగ్, 2016లో కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్ స్టాక్స్‌లో పెట్టుబడుల ద్వారా గణనీయమైన రాబడులనే అందించింది. ఏడాది, మూడేళ్లు, ఐదేళ్ల కాలాన్ని పరిశీలించి చూస్తే ఎల్ అండ్ టీ ప్రుడెన్స్ ఫండ్ ఇదే విభాగంలోని ఇతర ఫండ్ పథకాల కంటే సగటున 3–4 శాతం మెరుగైన రాబడులనే అందించింది. ఏడాది కాలంలో 24.3 శాతం, మూడేళ్లలో 12.4 శాతం, ఐదేళ్లలో సగటున 18.6 శాతం వార్షిక రాబడులను ఇచ్చింది. టాటా బ్యాలన్స్‌డ్ ఫండ్, ఫ్రాంక్లిన్ బ్యాలన్స్‌డ్, డీఎస్‌పీబీఆర్ బ్యాలన్స్‌డ్ ఫండ్ పథకాల కంటే ఎల్ అండ్ టీ ప్రుడెన్స్ రాబడుల్లో ముందుంది.

పోర్ట్‌ఫోలియో

ఈక్విటీలో 70 నుంచి 80 స్టాక్స్ వరకు పెట్టుబడుల కోసం ఎంచుకుంటుంది. ప్రస్తుతం డెట్ విభాగంలో 26.6 శాతం పెట్టుబడులున్నాయి. లార్జ్‌క్యాప్ స్టాక్స్‌తో పోలిస్తే బుల్ ర్యాలీ కారణంగా మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ధరలు అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులను 10 శాతం లోపునకు తగ్గించుకుంది. గడిచిన ఏడాది కాలంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్స్ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది. డెట్ వైపు గత ఏడాది కాలంలో సార్వభౌమ బాండ్ల స్థానాన్ని కార్పొరేట్ బాండ్లతో భర్తీ చేసింది.



● యాప్‌కీ కహానీ...

పారలల్ స్పేస్-మల్టీ అకౌంట్స్



ఒకే స్మార్ట్‌ఫోన్‌లో రెండు వాట్సప్ అకౌంట్లు ఉపయోగించొచ్చు. అదెలా అనుకుంటున్నారా? ఇదిగో ఈ 'పారలల్ స్పేస్-మల్టీ అకౌంట్స్' యాప్‌తో. కేవలం వాట్సప్ మాత్రమే కాదు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, మెసెంజర్ వంటి పలు యాప్‌లను క్లోన్ చేసుకొని రెండు అకౌంట్లు ఉపయోగించొచ్చు.

ప్రత్యేకతలు

- యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్.
- ఒక స్మార్ట్‌ఫోన్ ద్వారా సోషల్ నెట్‌వర్కింగ్/గేమ్స్/ఇతర యాప్స్ మల్టీపుల్ అకౌంట్స్‌లోకి లాగిన్ అవ్వొచ్చు.
- ఫోన్‌లోని వాట్సప్ యాప్‌లో ఒక నెంబర్‌పై అకౌంట్ ఉంటుంది. ఇక పారలల్ యాప్‌లో వేరొక నెంబర్‌పై రెండో వాట్సప్ అకౌంట్‌ను ఉపయోగించొచ్చు. దీనిలాగే ఫేస్‌బుక్ కొత్త అకౌంట్‌ను క్రియేట్ చేసుకొని లాగిన్ అవ్వొచ్చు.
- యాప్‌కు పాస్‌వర్డ్ పెట్టుకోవచ్చు.



గమనిక: పలు సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్‌లో ఒకే నెంబర్‌పై రెండు అకౌంట్లను ఉపయోగించడం కుదరదు. ఇకపోతే పలు స్మార్ట్‌ఫోన్ కంపెనీలు వాటి లేటెస్ట్ స్మార్ట్‌ఫోన్లలో రెండు అకౌంట్లను ఉపయోగించేలా కొత్త ఫీచర్‌ను అందుబాటులో ఉంచుతున్నాయి. ఉదాహరణకు హువావే కంపెనీ తన హానర్ 9ఐ స్మార్ట్‌ఫోన్‌లో రెండు వాట్సప్, ఫేస్‌బుక్, మెసెంజర్ అకౌంట్లను ఉపయోగించేందుకు యాప్ ట్విన్ అనే ఫీచర్‌ను పొందుపరిచింది. దీని వల్ల రెండేసి వాట్సప్, ఫేస్‌బుక్, మెసెంజర్ యాప్‌లు స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిల్లోకి వేర్వేరు అకౌంట్లతో లాగిన్ అవ్వొచ్చు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, ఫిబ్రవరి 7 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.75- 6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.45- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.6	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7-7.15	7.2-7.55
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.75	6.8-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.25-6.5	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.15	6.50	6.50

బ్యాంక్ బజార్. కామ్ అందించిన వివరాల ఆధారంగా...

డాలర్ నడతను బట్టి... పసిడి భవిత!

- వారంలో 18 డాలర్లు డౌన్
- ఆర్థిక, భౌతిక ఉద్రిక్తతలు కొనసాగితే 1,400 డాలర్ల దిశగా పయనం!

బంగారం భవిష్యత్ డాలర్ ఇండెక్స్ భవితపై ఆధారపడి ఉంటుందని ఏంజల్ బ్రోకింగ్ నాన్-అగ్రి కమోడిటీస్ అండ్ కరెన్సీస్ విభాగం చీఫ్ అనలిస్ట్ ప్రథమేశ్ మాల్యా అభిప్రాయపడ్డారు. మూడు వారాల క్రితం మూడేళ్ల కనిష్ఠ స్థాయి 88.30కి పతనమైన డాలర్ ఇండెక్స్ ఫిబ్రవరి 10వ తేదీతో ముగిసిన వారంలో తిరిగి 90.22స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అంతర్జాతీయ న్యూయార్క్ మర్కెంటైల్ ఎక్స్ఛేంజ్- నైమెక్స్‌లో ఔన్స్ (31.1గ్రా)కు 1,364 డాలర్ల స్థాయిని చేరిన పసిడి ధర ఫిబ్రవరి 9వ తేదీతో ముగిసిన వారంలో 1,318 డాలర్లకు పడింది. వారంలో 18 డాలర్లు పతనమైంది. డాలర్ ఇండెక్స్ ఇదే రీతిలో ముందుకు కొనసాగితే పసిడి కొంత కాంతిని కోల్పోయి వచ్చే మూడు నెలల్లో 1,250 డాలర్లకు చేరవచ్చని మాల్యా అంచనావేస్తున్నారు. అయితే డాలర్ ఇండెక్స్ బేరిష్ ట్రెండ్ తిరిగి ప్రారంభమయితే, మళ్లీ పసిడి 1,400 డాలర్ల దిశగా పయనించే అవకాశం ఉందని మరికొందరు నిపుణుల అభిప్రాయం. ఈక్విటీ, కరెన్సీ, కమోడిటీస్‌సహా మార్కెట్‌లో అన్ని విభాగాలూ ప్రస్తుతం తీవ్ర ఒడిదుడుకులకు గురవుతున్న సంగతి తెలిసిందే. కొంత బేరిష్ ట్రెండ్‌వైపునకు మొగ్గు కనిపిస్తున్నా, దీనికి కారణాలు ఇంకా విశ్లేషణ దశలోనే ఉన్నాయి. ఊహించని రీతిలో అంతర్జాతీయంగా మళ్లీ ఏదైనా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు తలెత్తి, దీనికి భౌగోళిక ఉద్రిక్తతలు కూడా తోడయితే, పసిడి 1,400 డాలర్ల వైపు వేగంగా పురోగమిస్తుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.



దేశీయ స్పాట్ మార్కెట్‌లో రూ.500కు పైగా డౌన్

ఇక దేశీయంగా చూస్తే డాలర్ మారకంలో రూపాయి విలువ వారంవారీగా 64.23 వద్ద స్థిరంగా ఉంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి వారంలో 10 గ్రాములకు రూ. 358 తగ్గి, రూ.30,009కి చేరింది. అనలిస్ట్ ప్రథమేశ్ మాల్యా అంచనా ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ ఇండెక్స్ పురోగతి కొనసాగితే, దేశీయ ఎంసీఎక్స్‌లో పసిడి వచ్చే మూడు నెలల్లో 28,800కు పడిపోయే అవకాశం ఉంది. ప్రధాన ముంబై స్పాట్ మార్కెట్‌లో ధర 99.9 స్వచ్ఛత ధర రూ.505 నష్టంతో రూ.30,130కు దిగింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో పతనమై రూ. 29,980కి దిగింది. వెండి కేజీ ధర భారీగా 1,350 తగ్గి, రూ. 37,920కి పడింది.


గోల్డ్ ఫండ్స్ నుంచి రూ.679 కోట్లు బయటకు



న్యూఢిల్లీ: బంగారంలో పెట్టుబడికి వీలు కల్పించే ఎలక్ట్రానిక్ సాధనం గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతూనే ఉంది. గడిచిన పది నెలల కాలంలో సుమారు రూ.679 కోట్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి వెనక్కి తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి నెలలో ఇలా తరలి వెళ్లిన పెట్టుబడులు రూ.110 కోట్లుగా ఉన్నాయి. రాబడులు తక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. పెట్టుబడులు తరలిపోవడంతో అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏయూఎం) నిర్వహణలోని గోల్డ్ ఈటీఎఫ్‌ల విలువ ఈ ఆర్థిక సంవత్సరం తొలి 10 నెలల్లో (ఏప్రిల్ నుంచి జనవరి వరకు)లో రూ.4,906 కోట్లకు దిగొచ్చింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వీటి విలువ రూ.5,670 కోట్లుగా ఉండడం గమనార్హం. గడిచిన నాలుగు ఆర్థిక సంవత్సరాల్లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల పరిస్థితి ఇలాగా ఉంది. 2016–17లో రూ.775 కోట్లు, 2015–16లో రూ.903 కోట్లు, 2014–15లో రూ.1,475 కోట్లు, 2013–14లో రూ.2,293 కోట్ల మేర గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడుల విలువ తగ్గిపోయింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల కాలంలో ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో (ఈఎల్‌ఎస్‌ఎస్)కి రూ.1.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులు రావడం గమనార్హం. ''ఏవో కొన్ని నెలల్ని మినహాయిస్తే 2013 ఫిబ్రవరి నుంచి గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడుల రాక ప్రతికూలంగానే ఉంది. 2012 వరకు కోట్ల రూపేణా మూడంకెల స్థాయిలో పెట్టుబడులు రాగా, ప్రస్తుతం ఒక అంకె స్థాయికి తగ్గి, కొన్ని నెలలుగా అసలు తాజా పెట్టుబడులే రాని పరిస్థితి నెలకొంది. దేశీయంగా బంగారంపై రాబడులు గత మూడేళ్లలో వార్షికంగా 3% లోపే. బ్యాంకు సేవింగ్స్ ఖాతా వడ్డీ రేటు కంటే ఇది తక్కువ'' అని ఫండ్స్ ఇండియా రీసెర్చ్ హెచ్ విద్యాబాల తెలిపారు.

స్టాక్స్ వ్యూ

కొచ్చిన్ షిప్‌యార్డ్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.532 **టార్గెట్ ధర:** రూ. 725

ఎందుకంటే: కొచ్చిన్ షిప్‌యార్డ్...ఓడలు తయారు చేసే, రిపేర్లు చేసే ప్రభుత్వ రంగ కంపెనీ ఇది. ఓడల నిర్మాణం, రిపేర్ల విభాగాల్లో గుత్తాధిపత్యం ఈ కంపెనీదే. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. సాధారణంగా 8–15% రేంజ్‌లో ఉండే షిప్ బిల్డింగ్ విభాగం ఇబిటా మార్జిన్‌లు ఈ క్యూ3లో 32.4 శాతానికి పెరిగాయి. మరోవైపు 25–35 శాతం రేంజ్‌లో ఉండే షిప్ రిపేర్ విభాగం ఇబిటా మార్జిన్ మాత్రం 14%గా నమోదైంది. ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.615 కోట్లకు పెరిగింది. గత క్యూ3లో 19.4 శాతంగా ఉన్న ఇబిటా మార్జిన్ ఈ క్యూ3లో 22.3%కి పెరిగింది. నికర లాభం 26 శాతం వృద్ధితో రూ.114 కోట్లకు ఎగసింది. ఓడల మరమ్మత్తు(షిప్ రిపేర్) విభాగం మంచి జోరు చూపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం ఆదాయం రూ.543 కోట్లుగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలానికే ఈ విభాగం ఆదాయం రూ.526 కోట్లకు చేరింది. ముంబై పోర్ట్ ట్రస్ట్, కోల్‌కత పోర్ట్ ట్రస్ట్, తదితర సంస్థలతో ఒప్పందాల కారణంగా ఇది సాధ్యమైంది. వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఇదే జోరు కొనసాగగలదని, 2020–21 కల్లా షిప్ రిపేర్ విభాగం ఆదాయం రూ.1,000 కోట్లకు మించగలదని అంచనా. నికర రుణభారం రూ.123 కోట్లుగా ఉండగా, నగదు నిల్వలు రూ.2,500 కోట్లుగా ఉన్నాయి. వివిధ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి గాను మూడేళ్లలో రూ.3,000 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. కంపెనీ ఆర్డర్ బుక్ ఆరోగ్యకరంగా ఉంది. ఇప్పటికే రూ.2,337 కోట్ల ఆర్డర్లు చేతిలో ఉండగా, మరో రూ.10,270 కోట్ల ఆర్డర్లు వచ్చే అవకాశాలున్నాయి. రెండేళ్లలో కంపెనీ ఆదాయం 15%, నికర లాభం 10% చొప్పున చక్రగతిన వృద్ధి చెందుతాయని అంచనా. జల రవాణాకు ప్రాధాన్యత పెరుగుతుండడం, కంపెనీ ఆర్థిక స్థితిగతులు పటిష్టంగా ఉండడం సానుకూలాంశాలు.

ఎస్‌బీఐ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.296 **టార్గెట్ ధర:** రూ.375

ఎందుకంటే: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉన్నాయి. కేటాయింపులు రూ.18,880 కోట్లకు పెరగడంతో నష్టాలు రూ.2,416 కోట్లకు ఎగిశాయి. సీక్వెన్షియల్ ప్రాతిపదికన నికర వడ్డీ ఆదాయ వృద్ధి ఫ్లాట్‌గా ఉంది. వేతనాల పెంపు కారణంగా సిబ్బంది వ్యయాలు పెరగడంతో నిర్వహణ వ్యయాలు 3 శాతం పెరిగాయి. అయితే ఉద్యోగుల సంఖ్య నికరంగా తగ్గుతోంది. రిటైల్ రుణాలు 14%(క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన 3%) పెరిగినప్పటికీ, మొత్తం రుణాలు 1.3 %(సీక్వెన్షియల్‌గా) మాత్రమే వృద్ధి చెందాయి. నికర వడ్డీ మార్జిన్ 2 బేసిస్ పాయింట్లు పెరిగి 2.45 శాతానికి పెరిగింది. రూ.23,230 కోట్ల రుణాల 'మళ్లింపు' కారణంగా మొండి బకాయిలు పెరిగాయి. ఫలితంగా స్థూల మొండి బకాయిలు 10.35%కి, నికర మొండి బకాయిలు 5.61%కి ఎగిశాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రుణ వృద్ధి 10 శాతంగా, తాజా మొండి బకాయిలు 2%గా, వడ్డీ వ్యయాలు 2 శాతంగా ఉండగలవని బ్యాంక్ అంచనా వేస్తోంది. గత క్యూ3లో రూ.21,290 కోట్లుగా ఉన్న వాచ్ లిస్ట్ రుణాలు ఈ క్యూ3లో రూ.10,340 కోట్లకు తగ్గాయి. వాచ్ లిస్ట్ రుణాలు తగ్గడంతో రుణ నాణ్యత మెరుగుపడగలదని బ్యాంక్ భావిస్తోంది. కోర్ పోర్ట్‌ఫోలియో పనితీరు ఆరోగ్యకరంగా ఉంది. ఒత్తిడి రుణాలు అధికంగా ఉన్నప్పటికీ, రుణ నాణ్యత ఉత్తమంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఇది ఒకటి. 2019–20 ఆర్థిక సంవత్సరం కల్లా నికర మొండి బకాయిలు 2.7 శాతానికి దిగివస్తాయని అంచనా వేస్తున్నాం. పెట్టుబడుల వాతావరణం మెరుగుపడితే, రుణ నాణ్యతపై భయాలు తగ్గుతాయి. నికర వడ్డీ మార్జిన్, వడ్డీ వ్యయాలు 10 బేసిస్ పాయింట్లు మెరుగుపడినా, ఎర్నింగ్స్ 15 శాతం పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడితే అత్యధికంగా లాభపడే ప్రభుత్వ రంగ బ్యాంక్ ఇదే కానున్నది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

ఏప్రిల్1 తర్వాత అమ్మే షేర్లపైనే..!



స్టాక్ మార్కెట్లో షేర్ల కొనుగోలు లావాదేవీలపై విధించిన మూలధన లాభాల పన్నుపై (ఎల్‌టీసీజీ) ఇన్వెస్టర్లలో ఉన్న గందరగోళాన్ని తొలగించేందుకు కేంద్రం వివరణ ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1న లేదా ఆ తర్వాత తమ వద్దనున్న షేర్లను విక్రయించడం ద్వారా వచ్చిన లాభాలపై మాత్రమే ఎల్‌టీసీజీ అమలవుతుందని స్పష్టం చేసింది. లాభాన్ని లెక్కించే విషయంలో షేర్ల కొనుగోలు రేటుకు ప్రామాణికత విషయానికొస్తే.. జనవరి 31 నాటి ట్రేడింగ్ గరిష్ట ధర లేదా వాస్తవ కొనుగోలు ధర, ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే దాన్ని లెక్కలోకి తీసుకుంటామని పేర్కొంది.

భారతి టెలికంలో సింగ్‌టెల్ పెట్టుబడి

సింగపూర్‌కి చెందిన టెలికం సంస్థ సింగ్‌టెల్.. భారతి టెలికంలో రూ. 2,649 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో భారతి టెలికంలో సింగ్‌టెల్ వాటా 1.7 శాతం పెరిగి 48.9 శాతానికి చేరుతుంది.

ఐఫోన్ ధరలకు మళ్లీ రెక్కలు



దిగ్గజ టెక్ కంపెనీ 'యాపిల్'.. ఐఫోన్ ధరలను రూ.3,210 (3.6 శాతం) వరకు పెంచింది. కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీని పెంచిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. అలాగే సంస్థ యాపిల్ వాచ్ ధరలను కూడా రూ.2,510 వరకు పెంచేసింది.

బంగారం మన దగ్గర మెరిసింది



భారతీయులకు బంగారంపై మక్కువ అంతకంతకూ పెరిగిపోతోంది. 2017లో దేశీయంగా వినియోగం 9 శాతం పెరిగి 727 టన్నులుగా నమోదైంది. కానీ, అంతర్జాతీయంగా మాత్రం డిమాండ్ 7 శాతం పడిపోయింది. ఈ గణాంకాలను వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) విడుదల చేసింది. 2016లో దేశీయ బంగారం డిమాండ్ 666.1 టన్నులుగానే ఉంది.

ఆటోమొబైల్స్

- ప్రముఖ ద్వి, త్రి చక్ర వాహన తయారీ కంపెనీ 'టీవీఎస్ మోటార్'.. 125 సీసీ స్కూటర్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చింది. 'ఎన్‌టార్క్' పేరుతో సరికొత్త స్కూటర్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.58,750 (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ). ఇందులో 'స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్' అనే బ్లూటూత్ ఆధారిత కనెక్టెడ్ టెక్నాలజీ వ్యవస్థను ప్రధాన ఫీచర్‌గా చెప్పుకోవచ్చు.
- యమహా మోటార్ ఇండియా తన స్పోర్ట్స్ బైక్ 'వైజెడ్ఎఫ్–ఆర్3'లో అప్‌డేటెడ్ వెర్షన్‌ని మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.3.48 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ).
- వాహన తయారీ కంపెనీ 'రెనో'.. మార్వెల్ భాగస్వామ్యంతో తన ఎంట్రీ లెవెల్ కారు 'క్విడ్'లో సూపర్ హీరో ఎడిషన్‌ను మార్కెట్లో ఆవిష్కరించింది.



- దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ 'మారుతీ సుజుకీ ఇండియా' తన పాపులర్ హ్యాచ్‌బ్యాక్ 'స్విఫ్ట్'లో సరికొత్త వెర్షన్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర శ్రేణి రూ.4.99 లక్షలు- రూ.8.29 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ).
- మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ సంస్థ 'హెచ్‌టీసీ'.. 'యు11 ప్లస్' స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.56,990.

కీలక రేట్లు యథాతథం

అందరి అంచనాలకు అనుగుణంగానే కీలక రేట్ల విషయంలో యథాతథ స్థితిని కొనసాగిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకుంది. రెపో రేటు (బ్యాంకులకు స్వల్ప కాలం కోసం ఇచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే రేటు)ను 6 శాతంగా, రివర్స్ రెపో రేటు (బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే రుణాలపై చెల్లించే రేటు)ను 5.75 శాతంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ అధిక వ్యయాలతో ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు పెరిగిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఆటోఎక్స్‌పో మొదలైంది!



కార్ల పండుగ మొదలైంది. ఆటోఎక్స్‌పో 14వ ఎడిషన్ గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో ప్రారంభమయ్యింది. ఇది ప్రజలకు 14 వరకు అందుబాటులో ఉంటుంది. వాహన తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వెహికల్స్, హైబ్రిడ్, పర్యావరణ అనుకూల టెక్నాలజీలకు అధిక ప్రాధాన్యతనిచ్చాయి. దేశీ, విదేశీ కంపెనీలు వాటి ప్రొడక్టులను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించాయి.

గూగుల్‌కు రూ.136 కోట్ల జరిమానా



ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌కు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా షాకిచ్చింది. భారత్‌లో ఆన్‌లైన్ సెర్చ్ విషయంలో అనైతిక వ్యాపార విధానాలకు పాల్పడినందుకు గాను రూ.136 కోట్ల పెనాల్టీ చెల్లించాలని ఆదేశించింది. 2012లో గూగుల్‌కు వ్యతిరేకంగా నమోదైన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిన అనంతరం కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలు జారీ చేసింది. గూగుల్ విశ్వాస ఉల్లంఘనకు పాల్పడిందని కమిషన్ పేర్కొంది.

ఫోర్బ్స్ క్రిప్టో సంపన్నుల జాబితా..

ఫోర్బ్స్ తన తొలి క్రిప్టో కరెన్సీ సంపన్నుల జాబితాను విడుదల చేసింది. ఇందులో రిపిల్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లార్సెన్ అగ్రస్థానంలో నిలిచారు. ఈయన క్రిప్టో నికర విలువ 7.5– 8 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా. కాగా భారత్‌లో క్రిప్టో కరెన్సీలకు చట్టబద్ధత లేదు.

రెండు నెలల్లో కొత్త వాహన పాలసీ!!

కేంద్ర ప్రభుత్వం రాబోయే 2 నెలల్లో కొత్త వాహన పాలసీ ముసాయిదాను ప్రకటించనుంది. ఎలక్ట్రిక్ వాహనాల వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా పాలసీని రూపొందిస్తామని భారీ పరిశ్రమల మంత్రి అనంత్ గీతే తెలిపారు.

2017-18 క్యూ3 ఆర్థిక ఫలితాలు


కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017–18	2016–17	వృ/క్షీ(%)	2017–18	2016–17	వృ/క్షీ(%)
టాటా మోటార్స్	1,215	112	--	74,156	63,933	16
హీరో మోటోకార్ప్	805	772	4	7,416	7,031	5
లుపిన్	222	633	-65	3,900	4,405	-11
పీఎన్‌బీ	230	207	11	15,257	14,124	8
రిలయన్స్ క్యాపిటల్	315	209	50	4,771	3,964	20
సెయిల్	43	-795	--	15,443	12,688	22
గ్లెన్‌మార్క్ ఫార్మా	105	477	-78	2,204	2,535	-13
ఏసీసీ	206	91	--	3,540	3,102	14
అరబిందో ఫార్మా	595	--	3	4,336	--	11
ఐషర్ మోటార్స్	520	418	24	2,269	2,071	10
స్పైస్‌జెట్	240	181	32	2,082	1,642	27
బ్యాంక్ ఆఫ్ బరోడా	112	253	-56	12,976	12,181	7
ఓఎన్‌జీసీ	5,015	4,352	15	24,122	--	15
బీపీసీఎల్	2,144	2,272	-6	70,923	64,647	10
ఎంఅండ్ఎం	1,216	1,081	12	11,844	11,578	2
ఎస్‌బీఐ	-1,887	2,152	--	74,191	75,537	-2
టాటా స్టీల్	1,136	232	--	33,672	29,255	15
హెచ్‌పీసీఎల్	1,950	1,590	22	62,832	55,471	13
హడ్కో	164	182	-10	1,092	930	17

సాక్షి



బొమ్మ-బొరుసు

> ఉన్నత స్థాయికి ఎదిగేందుకు మంచి చేయడానికి వెనుకాడకు
> – జాన్ డి రాక్ఫెల్లర్, స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ వ్యవస్థాపకులు



ఎస్‌బీఐ రుణ మాఫీ.. 20 వేల కోట్లపైనే!

గతేడాది రైటాఫ్ చేసిన మొత్తం



న్యూఢిల్లీ: మొండిబకాయిల ఊబిలో కూరుకుపోయిన దేశీ బ్యాంకింగ్ దిగ్గజం.. ఎస్‌బీఐ బ్యాలెన్స్ షీట్ ప్రక్షాళనపేరుతో భారీమొత్తంలోనే రుణాలను మాఫీ(రైటాఫ్) చేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం(2016–17)లో రూ.20 వేల కోట్లకు పైగానే మొండిబాకీలను రైటాఫ్ చేసినట్లు తాజా ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడైంది. ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల్లోకెల్లా ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. గతేడాది పీఎస్‌బీలు అన్నీ కలిపి రూ.81,683 కోట్లను రైటాఫ్ చేశాయి. కాగా, ఈ రైటాఫ్ కాలంలో ఇంకా ఎస్‌బీఐలో అనుబంధ బ్యాంకుల విలీనం జరగలేదు. 2012–13 ఏడాదిలో పీఎస్‌బీలు రైటాఫ్ చేసిన రుణాలు రూ.27,231 కోట్లు. అంటే ఐదేళ్లలో ఈ మొత్తం దాదాపు మూడు రెట్లు పెరగడం విశేషం. ఇక మిగతా పీఎస్‌బీల విషయానికొస్తే.. పంజాబ్ నేషనల్‌బ్యాంక్ (పీఎన్‌బీ) 2016–17లో రూ.9,205 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఐ) రూ.7,346 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.5,545 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) రూ.4,348 కోట్ల చొప్పున మొండి బకాయిలను రైటాఫ్ చేసుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18) తొలి ఆరు నెలల కాలంలో(డిసెంబర్ వరకూ) పీఎస్‌బీలు ఏకంగా రూ.53,625 కోట్లను రైటాఫ్ చేయడం ఎన్‌పీఏల తీవ్రతకు అద్దం పడుతోంది. కాగా, రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం(2017 సెప్టెంబర్ నాటికి) మొత్తం 21 పీఎస్‌బీల్లో 9 బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు వాటి మొత్తం రుణాల్లో 17 శాతానికి ఎగబాకాయి. ఇక 14 పీఎస్‌బీల స్థూల ఎన్‌పీఏలు 12 శాతంపైనే ఉన్నాయి.

పీఎస్‌బీలు ఎప్పుడు ఎంతెంత మాఫీ...

ఏడాది	రైటాఫ్ మొత్తం
2012-13	రూ.27,231 కోట్లు
2013-14	రూ.34,409 కోట్లు
2014-15	రూ.49,018 కోట్లు
2015-16	రూ.57,585 కోట్లు
2016-17	రూ.81,683 కోట్లు
2017-18 (డిసెంబర్ నాటికి)	రూ.53,625 కోట్లు

నియామకాలకు ఈ ఏడాది ఆశాజనకమే

10-15 శాతం వృద్ధి ఉంటుందన్న 'పీపుల్ స్ట్రాంగ్'



న్యూఢిల్లీ: దేశీయ కార్పొరేట్ రంగంలో ఈ ఏడాది ఉద్యోగాల నియామకాలు ఆశాజనకంగానే ఉంటాయని, 10–15 శాతం మేర వృద్ధి ఉంటుందని పీపుల్ స్ట్రాంగ్ అనే హెచ్‌ఆర్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 2017లో ఉద్యోగ నియామకాలు మందగించిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ మేరకు ఇండియా స్కిల్స్ నివేదిక 2018ని విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 120 సంస్థలు, 5,10,000 మంది విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సమీకరించింది. గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని స్థాయిలో ఉపాధి 45.6 శాతానికి పెరిగిందని పేర్కొంది. ''మనం మార్పు దశలో ఉన్నాం. డిజిటల్ ప్రభావాన్ని అలవాటు చేసుకుంటున్నాం. ఈ దశను ఫలవంతంగా పూర్తి చేసేందుకు డిమాండ్, సరఫరా వైపు చర్యలు అవసరం. అయితే, మనం సరైన దిశలో వెళుతున్నామని డేటా తెలియజేస్తోంది'' అని పీపుల్ స్ట్రాంగ్ సీఈవో పంకజ్ బన్సాల్ అన్నారు.

ఈ రాష్ట్రాల్లో అధిక ఉపాధి

ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్ అధిక ఉపాధి అవకాశాలు కలిగిన రాష్ట్రాల్లో ఉన్నాయని ఈ నివేదిక తెలియజేసింది. ఐటీ రాజధానిగా పేరు తెచ్చుకున్న బెంగళూరు ఉపాధిలో ముందుంది. సర్వేలో ఈ నగరమే టాప్‌లో ఉంది. ఆ తర్వాత చెన్నై, ఇండోర్, లక్నో, ముంబై, నాగ్‌పూర్ వరుసగా అధిక ఉపాధి అవకాశాలు కలిగిన నగరాలు కావడం గమనార్హం. ఢిల్లీ 7వ స్థానంలో ఉండగా, పుణె, తిరుచిరాపల్లి ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన మానవ వనరులు ఎక్కువగా ఉన్నది ఢిల్లీలోనే. ఇక్కడ ప్రతీ ముగ్గురిలో ఇద్దరికి ఆ అర్హతలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. 18–25 సంవత్సరాల వయసులో ఉన్న ఉద్యోగ అభ్యర్థుల శాతం 46 శాతంగా ఉంటే, 26–29 వయసులోని వారు 26 శాతంగా ఉన్నారు. మొత్తం మీద ఉపాధి అవకాశాలు అంతకు ముందు సంవత్సరంలో ఉన్న 40.44 శాతం నుంచి 45.60 శాతానికి పెరిగినట్టు ఈ నివేదిక పేర్కొంది.

గణాంకాలు, ప్రపంచ మార్కెట్లపై ఫోకస్

మంగళవారం మహాశివరాత్రి సెలవు
- ట్రేడింగ్ నాలుగు రోజులే



అంతర్జాతీయ సంకేతాలు, పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం మార్కెట్‌కు కీలకం కానున్నాయని నిపుణులంటున్నారు. వీటితో పాటు ముడి చమురు ధరల గమనం, డాలర్‌తో రూపాయి మారకం కదలికలు, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, ఈ వారం వెలువడే కంపెనీల క్యూ3 ఫలితాలు కూడా ఈ వారం స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని వారంటున్నారు. మహా శివరాత్రి సందర్భంగా రేపు(మంగళవారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానున్నది.

గణాంకాలు...

నేడు(సోమవారం) జనవరి నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడవుతాయి. ఇదే రోజు డిసెంబర్ నెలకు సంబంధించిన పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కూడా వస్తాయి. గత ఏడాది డిసెంబర్లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.21 శాతానికి పెరిగింది. గత ఏడాది నవంబర్‌లో పారిశ్రామికోత్పత్తి 8.4 శాతానికి ఎగసింది. ఈ నెల 14న(బుధవారం) జనవరి టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలను ప్రభుత్వం వెల్లడిస్తుంది. గత ఏడాది డిసెంబర్‌లో టోకు ధరల ద్రవ్యోల్బణం 3.58 శాతంగా నమోదైంది.

నేడు గెయిల్ ఫలితాలు...

నేడు(సోమవారం) గెయిల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, బ్రిటానియా ఇండస్ట్రీస్‌లు క్యూ3 ఫలితాలను వెల్లడిస్తాయి. ఇంకా ఈ వారంలో ఎన్‌బీసీసీ(ఇండియా), ఎన్ఎండీసీ, గోద్రేజ్ ఇండస్ట్రీస్, గ్రాసిమ్, జెట్ ఎయిర్‌వేస్, నెస్లే ఇండియా, సన్ ఫార్మా, టాటా పవర్ తదితర కంపెనీల ఫలితాలు వస్తాయి.

సెంటిమెంట్‌పై 'ప్రపంచ' ప్రభావం..

కంపెనీల ఆర్థిక ఫలితాలు అంచనాలను మించుతున్నాయని, కంపెనీలు కోలుకుంటున్నాయనడానికి ఇది నిదర్శనమని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్‌హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అయితే ప్రపంచ మార్కెట్లలో చోటు చేసుకుంటున్న ఒడిదుడుకులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయని వివరించారు. ఈ వారంలో వచ్చే పారిశ్రామికోత్పత్తి, రిటైల్, టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకమని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంకేతాలకనుగుణంగానే గత వారం మన మార్కెట్ కదలికలున్నాయని, ఈ వారం కూడా ఇదే కొనసాగుతుందని శామ్‌కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోదీ చెప్పారు. ఇక అంతర్జాతీయ పరంగా చూస్తే, ఈ నెల 13న(మంగళవారం) జపాన్ క్యూ4 జీడీపీ గణాంకాలు వస్తాయి. బుధవారం(ఈ నెల14న) అమెరికా జనవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అదే రోజు అమెరికా ముడి చమురు నిల్వల గణాంకాలు వస్తాయి.

ఆస్టర్ హెల్త్‌కేర్ ఐపీఓ నేటి నుంచి


హెల్త్‌కేర్ సర్వీసులందించే ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) నేటి (సోమవారం) నుంచి ప్రారంభమవుతుంది. ఈ నెల 15న ముగిసే ఈ ఐపీఓ ప్రైస్‌బాండ్‌ను రూ.180–190గా కంపెనీ నిర్ణయించింది. ఈ ఐపీఓ ద్వారా రూ.980 కోట్ల వరకూ సమీకరించాలని కంపెనీ యోచిస్తోంది. కనీసం 78 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 26న ఈ కంపెనీ షేర్ స్టాక్ మార్కెట్లో లిస్టవుతుంది.

ఏడు రోజుల్లో రూ.3,800 కోట్లు వెనక్కి

గత ఏడు ట్రేడింగ్ సెషన్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన స్టాక్ మార్కెట్ నుంచి రూ.3,838 కోట్ల మేర పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. అయితే డెట్‌మార్కెట్లో మాత్రం రూ.4,600 కోట్లు పెట్టుబడులు పెట్టారు. అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లో భారీ పతనం చోటు చేసుకోవడంతో విదేశీ ఇన్వెస్టర్లు ఈ స్థాయిలో ఈక్విటీల నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారని నిపుణులు పేర్కొన్నారు.

అబుదాబి ఆయిల్‌ఫీల్డ్‌లో ఓఎన్‌జీసీ విదేశ్‌కి వాటా

ప్రధాని పర్యటనలో కుదిరిన ఒప్పందం ● రూ.3,840 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్, దాని భాగస్వామ్య కంపెనీలు కలసి అబుదాబిలోని అతిపెద్ద ఆఫ్‌షోర్ చమురు క్షేత్రం(లోయర్ జుకమ్)లో 10% వాటాను చేజిక్కించుకున్నాయి. ఈ కొనుగోలు విలువ 600 మిలియన్ డాలర్లు (రూ.3,840 కోట్లు). చమురు నిల్వలు సమృద్ధిగా ఉన్న యూఏఈలోకి ఓ భారత కంపెనీ అడుగుపెట్టడం ఇదే ప్రథమం. ప్రధాని మోదీ, అబుదాబి రాజు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ సమక్షంలో ఈ శనివారం ఈ ఒప్పందం కుదిరింది. ఓఎన్‌జీసీ విదేశ్‌తోపాటు ఐవోసీ, బీపీసీఎల్ ఈ ఒప్పందంలో భాగస్వాములుగా ఉన్నాయి. రాయితీలతో కూడిన ఈ ఒప్పందం 40 ఏళ్లు అమల్లో ఉంటుంది. ప్రస్తుతం లోయర్‌జుకమ్ ఆయిల్ ఫీల్డ్‌లో నిత్యం 4 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి జరుగుతోంది. 2025 నాటికి రోజుకు ఉత్పత్తిని 4.5 లక్షల బ్యారెళ్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యం. ఓఎన్‌జీసీ గ్రూపు చైర్మన్ శశి శంకర్, అడ్నాక్ గ్రూప్ చీఫ్ సుల్తాన్ అహ్మద్ అల్ జబీర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. మరో 30% వాటా కొనుగోలుకు సామర్థ్యం కలిగిన భాగస్వాముల ఎంపిక జరుగుతోందని అల్ జబీర్ పేర్కొన్నారు.

గత వారం హీరోలు

స్టాక్స్	9 ముగింపు	2 ముగింపు	మార్పు(%)
భారత్ ఫోర్జ్	762	691	10
అశోక్ లేలాండ్	134	122	10
సిప్లా	622	579	7
సన్ ఫార్మా	583	551	6
హెచ్‌పీసీఎల్	395	374	6
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	309	299	3
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,195	2,122	3
ఆర్ఈసీ	150	146	3
టీవీఎస్ మోటార్	664	645	3
కోల్ ఇండియా	300	292	3

ఎందుకు పెరిగాయంటే...

నికర లాభం 77% పెరగడం, బ్రోకరేజ్ సంస్థల సానుకూల రేటింగ్‌లతో భారత్ ఫోర్జ్ షేర్ 10% ఎగసింది. ఎలక్ట్రికల్ వాహనాల కోసం వంద కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని ప్రకటించడంతో పాటు తొలి ఎలక్ట్రిక్ బస్సును ఆటో షోలో ప్రదర్శించడంతో అశోక్ లేలాండ్ షేర్ 10% ఎగసింది. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటం, కంపెనీ ఆశాహహ భవిష్యత్తు అంచనాల కారణంగా సిప్లా షేర్ 7% లాభపడింది. భూషణ్ స్టీల్ కోసం బిడ్‌ను సమర్పించిన నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ షేర్ 3% పెరిగింది.

బోర్డ్ మీటింగ్స్

గెయిల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, కార్పొరేషన్ బ్యాంక్, మంగళం సిమెంట్, మదర్సన్ సుమి, ఇండియన్ బ్యాంక్, పీఎఫ్‌సీ, ఎన్‌హెచ్‌పీసీ

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 12-2-2018

విజయవాడ	353-00
గోదావరి	353-00
విశాఖ	360-00
వరంగల్	363-00
చిత్తూరు	378-00
చెన్నై	385-00
ముంబై	397-00
నమక్కల్	370-00
11-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	361-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.20
బెంగళూరు	372-00
కోల్‌కతా	380-00
ఢిల్లీ	375-00

ప్రపంచ సంపన్న నగరాల్లో ముంబై

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రపంచ సంపన్న నగరాల్లో ఒకటిగా నిలిచింది. 950 బిలియన్ డాలర్ల (రూ.60.8 లక్షల కోట్లు) సంపదతో అంతర్జాతీయంగా 12వ స్థానంలో ఉంది. న్యూయార్క్ ఈ విషయంలో ప్రపంచంలోనే అగ్ర స్థానాన్ని దక్కించుకుంది. ఈ మేరకు ప్రపంచంలో 15 సంపన్న నగరాలతో ఓ నివేదిక విడుదలైంది. ముంబై తర్వాత 944 బిలియన్ డాలర్ల (రూ.50.04 లక్షల కోట్లు)తో టొరంటో, 912 బిలియన్ డాలర్ల(రూ.58.3 లక్షల కోట్లు)తో ఫ్రాంక్‌ఫర్ట్, 860 బిలియన్ డాలర్ల(రూ.54.4 లక్షల కోట్లు)తో పారిస్ అధిక సంపన్న నగరాలుగా జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఆయా నగర ప్రజల వ్యక్తిగత సంపద (ఆస్తులు, నగదు, ఈక్విటీలు, వ్యాపారాలు, వీటిలో అప్పులు మినహాయించి) మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని వేసిన అంచనాలు ఇవి. ప్రభుత్వ నిధుల్ని మినహాయించారు. బిలియనీర్ల జనాభా (కనీసం 100 కోట్ల డాలర్ల ఆస్తి ఉన్న వారు) పరంగానూ ముంబై ప్రపంచంలో పదో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నగరంలో 28 మంది బిలియనీర్లు ఉన్నారు. ''ముంబై నగరంలో వ్యక్తుల సంపద 950 బిలియన్ డాలర్లు. ఈ నగరం దేశానికి ఆర్థిక కేంద్రంగా ఉంది. ప్రపంచంలో 12వ అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ కూడా ఇక్కడే ఉంది. ఈ నగరంలో ప్రధాన పరిశ్రమలుగా ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్ ఎస్టేట్, మీడియా ఉన్నాయి'' అని నివేదిక తెలిపింది. రానున్న పదేళ్ల కాలంలో ముంబై సంపద వృద్ధి పరంగా అత్యంత వేగాన్ని ప్రదర్శిస్తుందని అంచనా వేస్తున్నట్టు పేర్కొంది. నివేదికలో వివరాలు...



- న్యూయార్క్ నగరం ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉంది. ఈ నగర సంపద విలువ 3 లక్షల కోట్ల డాలర్లు (రూ.192 లక్షల కోట్లు). రెండు అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఈ నగరంలోనే ఉన్నాయి.
- 2.7 లక్షల కోట్ల డాలర్ల (రూ.172.8 లక్షల కోట్లు) సంపదతో లండన్ రెండో స్థానంలో ఉంది.
- 2.5 లక్షల కోట్ల డాలర్ల సంపదతో టోక్యో, 2.3 లక్షల కోట్ల డాలర్లతో శాన్‌ఫ్రాన్సిస్కో, 2.2 లక్షల కోట్ల డాలర్ల సంపదతో బీజింగ్, 2 లక్షల కోట్ల డాలర్లతో షాంఘై, 1.4 లక్షల కోట్ల డాలర్లతో లాస్ ఏంజెలిస్, 1.3 లక్షల డాలర్లతో హాంకాంగ్, లక్ష కోట్ల డాలర్లతో సిడ్నీ, 988 బిలియన్ డాలర్లతో చికాగో టాప్–15లోకి చేరాయి.

బీమా రంగం రెండేళ్లలో 280 బిలియన్ డాలర్లకు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్, సాక్షి బిజినెస్ బ్యూరో: బీమా పరిశ్రమ 2020 నాటికి ప్రస్తుతమున్న 84.72 బిలియన్ డాలర్ల నుంచి 280 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారంనాడిక్కడ జరిగిన నాల్గవ దక్షిణాసియా బీమా నియంత్రణ సంస్థల సమావేశం వీడ్కోలు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల్లో బీమా కంపెనీల పెట్టుబడులు 2016–17లో రూ.30.47 లక్షల కోట్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితి పెంచడం, ప్రజలకు, రైతులకు బీమా కవరేజీ కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలతో మార్కెట్ విస్తరిస్తుందన్నారు. మధ్య తరగతి ప్రజలు పెరుగుతండటం, అధిక వినియోగం, బీమా కవరేజీపై అవగాహనతో బీమా విస్తరణకు భారీ అవకాశాలున్నాయని చెప్పారు.



గత వారం జీరోలు

స్టాక్స్	9 ముగింపు	2 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	202	263	-23
గ్లెన్‌మార్క్ ఫార్మా	535	591	-9
ఐఓసీ	379	409	-7
యస్ బ్యాంక్	326	350	-7
హెచ్‌డీఎఫ్‌సీ	1,773	1,903	-7
లార్సెన్ అండ్ టుబ్రో	1,329	1,414	-6
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,651	1,756	-6
టీసీఎస్	2,972	3,149	-6
వేదాంత	316	334	-5
విప్రో	285	300	-5

ఎందుకు తగ్గాయంటే...

వక్రంగీ షేర్ నష్టాలు ఈ వారం కూడా కొనసాగాయి. ఈ షేర్ 23 శాతం పతనమైంది. నికర లాభం 78 శాతం తగ్గిన కారణంగా గ్లెన్‌మార్క్ ఫార్మా 9 శాతం క్షీణించింది. మార్కెట్ల పతన ప్రభావంతో యస్‌బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంక్ షేర్లు 6–7 శాతం రేంజ్‌లో, టీసీఎస్, విప్రో వంటి ఐటీ షేర్లు 5–6% రేంజ్‌లో నష్టపోయాయి. లాభాల స్వీకరణ కారణంగా ఎల్ అండ్ టీ, వేదాంత షేర్లు 5–6 శాతం రేంజ్‌లో తగ్గాయి.

రెండో ఎన్‌పీఎస్ ఖాతాకు వీలుంటుందా?

పన్ను ఆదా మ్యూచువల్ ఫండ్స్‌లో లాక్-ఇన్ పీరియడ్ వరకే ఇన్వెస్ట్ చేయడం మంచిదా ? – వైష్ణవి, హైదరాబాద్

పన్ను ఆదా మ్యూచువల్ ఫండ్స్‌ను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. పనితీరు దూకుడుగా ఉండేవి. పనితీరు సామాన్యంగా ఉండేవి. ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్ అన్నీ పూర్తిగా ఈక్విటీలోనే ఇన్వెస్ట్ చేస్తాయి. వీటిల్లో లార్జ్‌క్యాప్ కంపెనీల్లో అధికంగా ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ ఉన్నాయి. కొన్ని ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ విషయంలో ప్రయోగాలు చేస్తాయి. ఈ తరహా ఫండ్స్ చిన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసి గరిష్ట లాభాలను సాధించాలని ప్రయత్నాలు చేస్తాయి. ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకున్నప్పుడు, మీ ఇన్వెస్ట్‌మెంట్స్ మూడేళ్ల వరకూ లాక్-ఇన్ అవుతాయి కాబట్టి, దూకుడుగా ఉండే ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. మూడేళ్ల లాక్-ఇన్ పీరియడ్ గురించి ఆలోచించకండి. కనీసం ఐదు, అంతకు మించిన కాలానికి ఇన్వెస్ట్ చేయడమే సబబు. ఇక సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)ల ద్వారా ఇన్వెస్ట్ చేస్తే దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందవచ్చు.

నేను కొన్ని ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్(ఈఎల్ఎస్ఎస్)లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఈ ఫండ్స్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వేరే ఫండ్స్‌లోకి (వీటి లాక్-ఇన్ పీరియడ్ ముగిసిన తర్వాత)బదిలీ చేయాలనుకుంటున్నాను. నాది సరైన నిర్ణయమేనా? – రాజా, విశాఖపట్టణం

ఈఎల్ఎస్ఎస్‌ల నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వేరే ఫండ్స్‌లోకి మార్చడం సరైన నిర్ణయం కాదు. మీరు ఇన్వెస్ట్ చేసిన ఈఎల్ఎస్ఎస్ మంచి పనితీరు చూపించకపోతేనే లాక్-ఇన్ పీరియడ్ ముగిసిన తర్వాత ఈ ఫండ్స్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వేరే ఫండ్స్‌లోకి బదిలీ చేసుకోవచ్చు. లేదా మీకు డబ్బులు అవసరమైనప్పుడు మాత్రమే అదీనూ బయట ఎక్కడైనా అప్పు పుట్టని పరిస్థితుల్లో మాత్రమే ఈ ఫండ్స్ నుంచి వైదొలగవచ్చు. అలా కాని పక్షంలో ఈఎల్ఎస్ఎస్‌ల నుంచి వేరే ఫండ్స్‌లోకి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను బదిలీ చేయడం పెట్టుబడుల వ్యూహం పరంగా సరైన నిర్ణయం కాదు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను ఒక ప్రభుత్వ ఉద్యోగిని. నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) ఖాతా మాకు తప్పనిసరి. నా వేతనంతో అనుసంధానమై ఉన్న ఎన్‌పీఎస్ ఖాతాను ప్రారంభించాను. అయితే ఈ ఖాతాలో ఈక్విటీ కేటాయింపులు పెంచుకోవడానికి లేదు. అందుకని నేను మరో ఎన్‌పీఎస్ ఖాతాను ప్రారంభించవచ్చా? – దత్తాత్రేయ, విజయవాడ

మీరు ఒకటికి మించి నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) ఖాతాలు తెరవడానికి వీలు లేదు. ఈక్విటీలో 50 శాతానికి మించి ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఎన్‌పీఎస్‌లో లేదు. ఈక్విటీలో ఇన్వెస్ట్‌మెంట్స్ పెంచుకోవాలనుకుంటే, మీరు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. ఆదాయపు పన్ను చట్టం, సెక్షన్ 80 సీ కింద పన్ను మినహాయింపులు పొందాలంటే, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్(ఈఎల్ఎస్ఎస్)లో ఇన్వెస్ట్ చేయవచ్చు. సెక్షన్ 80 సీ కింద మీరు రూ.1.5 లక్ష వరకూ ఆదాయపు పన్ను మినహాయింపులు పొందవచ్చు. ఇప్పటికే సెక్షన్ 80సీ పరిమితి పూర్తయితే, ఈక్విటీ ఆధారిత బ్యాలెన్స్‌డ్ స్కీమ్స్‌లో గానీ, డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో గానీ ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందవచ్చు. రిటైర్మెంట్ నిధి ఏర్పాటు, పిల్లల ఉన్నత చదువులు, సొంత ఇల్లు సమకూర్చుకోవడం తదితర దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధన కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయడమే ఉత్తమమైన విధానం.

నేను నెలకు రూ. లక్ష వరకూ ఇన్వెస్ట్ చేయగలను. కనీసం 15–20 ఏళ్ల వరకూ ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. మిడ్ క్యాప్, స్మాల్–క్యాప్ ఫండ్స్‌నే ఇన్వెస్ట్‌మెంట్ కోసం ఎంచుకోవాలనుకుంటున్నాను. తగిన సలహా ఇవ్వండి. – రంజిత్, నిజామాబాద్


నెలకు రూ. లక్ష చొప్పున కనీసం 15–20 ఏళ్ల పాటు మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్స్‌లో నిరభ్యంతరంగా ఇన్వెస్ట్ చేయవచ్చు. మార్కెట్ అధ్వాన పరిస్థితుల్లో ఉన్నా కూడా చాలా మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్స్ మంచి పనితీరు చూపించాయి. మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్స్ పనితీరు భవిష్యత్తులో కూడా అదే విధంగా ఉండవచ్చు. మీరు 15–20 ఏళ్లు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారు. కాబట్టి, మంచి రాబడులు పొందే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయితే ఇలా మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ఆయా ఫండ్స్ పనితీరును కనీసం రెండేళ్లకొకసారైనా సమీక్షించాలి. ఈ రెండేళ్ల కాలంలో ఎన్నో మార్పు చేర్పులు జరుగుతుంటాయి. మీ పోర్ట్‌ఫోలియోలోని ఏ ఫండ్ పనితీరు, అదే కేటగిరీలోని మరే ఇతర ఫండ్ పనితీరు కన్నా అధ్వానంగా ఉంటే.. ఆ ఫండ్ నుంచి మరో ఫండ్‌లోకి మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మార్చండి. ఏదైనా ఒక ఫండ్‌ను నిర్వహించే ఫండ్ మేనేజర్ మారిపోయినా, లేదా మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్ నిర్వహణ ఆస్తులు భారీగా పెరిగినా..ఫండ్ పనితీరు ప్రభావితం అవుతుంది. ఇలాంటి విషయాల పట్ల అప్రమత్తంగా ఉంటే, మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఎంపిక చేసిన ఫండ్స్‌లో సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించండి. మార్కెట్ పెరుగుదల, క్షీణతలతో సంబంధం లేకుండా మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించండి. కనీసం రెండేళ్లకొకసారైనా మీ పోర్ట్‌ఫోలియోను మాత్రం సమీక్షించడం మరచిపోకండి.

34,100 స్థాయి కీలకం

మార్కెట్ పంచాంగం


ఈ ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లో ప్రపంచ మార్కెట్లో కరెక్షన్ వచ్చే అవకాశాలున్నాయంటూ గత కాలమ్స్‌లో సూచించిన రీతిలో గతవారం కూడా ప్రపంచ ప్రధాన మార్కెట్ల పతనం కొనసాగింది. అమెరికాలో వడ్డీ రేట్లు మరింతగా పెరిగే అవకాశాలు కన్పించడంతో ప్రపంచ వ్యాప్తంగా బాండ్ ఈల్డ్స్ ఎగువముఖంగా పరుగులు తీస్తున్నాయి. ఈ ట్రెండ్ సహజంగానే ఈక్విటీ మార్కెట్లను దెబ్బతీస్తున్నది. 2015 ఆగస్టు– సెప్టెంబర్ నెలల్లో చైనా భయాల కారణంగా మొదలైన కరెక్షన్‌ను ప్రస్తుత ట్రెండ్ తలపింపచేస్తున్నది. రెండు సంవత్సరాల నుంచి ఎటువంటి ప్రతికూల సంఘటనకైనా...చలించకుండా పరుగులు తీసిన మార్కెట్లకు ఇప్పుడు బ్రేక్‌పడిన సందర్భంగా సూచీల గమనాన్ని సాంకేతిక అంశాలు ఇలా సూచిస్తున్నాయి ...

సెన్సెక్స్ సాంకేతికాలు..



ఫిబ్రవరి 9తో ముగిసిన వారంలో గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన అంచనాలకు అనుగుణంగా 34,640 మద్దతు దిగువన సెన్సెక్స్ నిలువునా 33,483 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమయ్యింది. ఈ కనిష్టస్థాయి నుంచి కొంతమేర కోలుకునప్పటికీ, చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 1,061 పాయింట్ల భారీ నష్టంతో 34,006 పాయింట్ల వద్ద ముగిసింది. మొత్తంమీద రికార్డు గరిష్టస్థాయి నుంచి ఇప్పటివరకూ 2,400 పాయింట్లకుపైగా నష్టపోయింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ కనిష్టస్థాయి నుంచి 4 శాతం వరకూ బౌన్స్ అయిన నేపథ్యంలో ఈ సోమవారం మార్కెట్ సానుకూలంగా మొదలైతే సెన్సెక్స్‌కు 34,100 సమీపంలో తొలి అవరోధం ఏర్పడుతున్నది. ఈ స్థాయి వచ్చే కొద్దిరోజుల్లో సూచీకి కీలకం. ఈ స్థాయిపైన స్థిరపడితే చిన్నపాటి రిలీఫ్‌ర్యాలీ మొదలై సెన్సెక్స్‌ను క్రమేపీ 34,660 వరకూ చేర్చవచ్చు. ఆపైన ముగిస్తే 34,874–35,006 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం 34,100పైన స్థిరపడలేకపోతే 33,850 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే 33,480 పాయింట్లస్థాయిని వేగంగా పరీక్షించవచ్చు. ఈ స్థాయిని కూడా వదులుకుంటే వచ్చే కొద్ది రోజుల్లో 32,600 పాయింట్ల స్థాయికి పతనం కావొచ్చు.

10,480 నిరోధం కీలకం...



గతవాదం తొలిరోజున ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,702 పాయింట్ల గరిష్టస్థాయి నుంచి రెండోరోజుకల్లా 10,276 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 306 పాయింట్ల నష్టంతో 10,455 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం పాజిటివ్‌గా మార్కెట్ మొదలైతే నిఫ్టీకి 10,480 పాయింట్ల వద్ద తొలి అవరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైన గ్యాప్‌అప్‌తో మొదలై, స్థిరపడితే క్రమేపీ 10,615 పాయింట్ల స్థాయికి పెరగవచ్చు. ఈ స్థాయిని కూడా ఛేదించగలిగితే 10,702–10,736 పాయింట్ల శ్రేణి వరకూ నిఫ్టీ రిలీఫ్ ర్యాలీ సాగించవచ్చు. 10,480 పాయింట్ల తొలి అవరోధస్థాయిపైన స్థిరపడలేకపోతే 10,398 పాయింట్ల వరకూ నిఫ్టీ తగ్గవచ్చు. ఈ లోపున ముగిస్తే తిరిగి 10,276 పాయింట్ల స్థాయికి పతనం కావొచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే కొద్దిరోజుల్లో 10,075 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్

సాక్షి స్పోర్ట్స్

సోమవారం 12-2-2018



శ్యామ్ కుమార్‌కు పతకం ఖాయం

ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ బాక్సర్ కాకర శ్యామ్ కుమార్ సెమీఫైనల్‌కు చేరుకొని కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ఇండోనేసియా రాజధాని జకార్తాలో ఆదివారం జరిగిన పురుషుల 49 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో వైజాగ్ బాక్సర్ శ్యామ్ 3–2తో సహెన్ సమిక్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించాడు. మహిళల విభాగంలో భారత్‌కే చెందిన శశి చోప్రా (57 కేజీలు) కూడా సెమీఫైనల్‌కు చేరింది.

హిట్‌మ్యాన్ ఫ్లాప్ షో

పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం రోహిత్ శర్మ వెళితే అక్కడి అధికారి నువ్వేం చేసినా ఇండియాలోనే కదా, విదేశాలకు వెళ్లి చేసేదేముంది, నీకు రెన్యువల్ అవసరమా అని బదులిచ్చాడు.

గల్లీ క్రికెట్‌లో ట్రయల్ బాల్ వేసి ఆ తర్వాత ఆట మొదలు పెడతారు కదా! ఈ సిరీస్‌లో రోహిత్ బ్యాటింగ్ చేయడం కూడా అలాంటిదే.

రోహిత్ పెళ్లి రోజు, భార్య పుట్టిన రోజు సిరీస్‌కు ఒకసారి వస్తే ఎంత బాగుంటుంది కదా!

రోహిత్ తన కిట్‌లో భారత పిచ్‌ను కూడా తీసుకువెళ్లి ఆడుకునేందుకు ఐసీసీ అనుమతి ఇచ్చింది.

దక్షిణాఫ్రికా పర్యటనలో వరుస వైఫల్యాల తర్వాత భారత ఓపెనర్ రోహిత్ శర్మపై వస్తున్న అసంఖ్యాక వ్యంగ్య వ్యాఖ్యానాల్లో ఇవి కొన్ని! వన్డే క్రికెట్ అనగానే చెలరేగిపోయే అతనికి సఫారీ గడ్డ ఏమాత్రం అచ్చి రావడం లేదు. నాలుగు మ్యాచ్‌లలో వరుసగా చేసిన 20, 15, 0, 5 స్కోర్లు రోహిత్ స్థాయికి ఏమాత్రం తగనివి. మొత్తానికి రెగ్యులర్ ఓపెనర్ ఫామ్ భారత టీమ్ మేనేజ్‌మెంట్‌కు కొత్త సమస్యగా మారింది.



సాక్షి క్రీడా విభాగం

- వన్డేల్లో రోహిత్ శర్మ ఘోర వైఫల్యం
- దక్షిణాఫ్రికా గడ్డపై పేలవ ప్రదర్శన
- టెక్నిక్ లోపంతో సమస్యలు

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి రెండు టెస్టుల్లో రోహిత్ శర్మ 11, 10, 10, 47 పరుగులు మాత్రమే చేశాడు. అయితే టెస్టుల్లో రోహిత్ ఆటపై ఎవరికీ ఎలాంటి అంచనాలు లేవు. అతడిని తుది జట్టులోకి తీసుకోవడంపైనే అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. చివరకు మూడో టెస్టులో జట్టు నుంచి తప్పించాల్సి వచ్చింది. పైగా దక్షిణాఫ్రికా భీకర పేస్ బౌలింగ్‌లో కోహ్లి మినహా మిగతా బ్యాట్స్‌మెన్ అందరూ విఫలమైన చోట రోహిత్ వైఫల్యాలు కూడా పెద్దగా కనిపించలేదు. కానీ వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు చేసిన మొనగాడు అదే ఫార్మాట్‌లో తడబడుతున్న తీరు అమితాశ్చర్యం కలిగిస్తోంది. దక్షిణాఫ్రికాలో రోహిత్‌కిది మూడో పర్యటన. 2011, 2013లలో ఇక్కడ ఆడిన వన్డేల్లో కూడా అతను ఏమాత్రం ప్రభావం చూపలేదు. ఏడు వన్డేల్లో అతను వరుసగా 11, 9, 23, 1, 5, 18, 19 చొప్పున పరుగులు చేశాడు. గత సిరీస్‌లో జొహన్నెస్‌బర్గ్ వన్డేలోనైతే 16వ బంతికి గానీ అతను కనీసం బ్యాట్‌ను బాల్‌కు తాకించ లేకపోయాడు! అయితే నాటి రోహిత్‌తో పోలిస్తే ఈ నాలుగేళ్ళలో అతను ఎంతో ఎత్తుకు ఎదిగాడు. ప్రపంచ వ్యాప్తంగా పరుగులు చేశాడు. దీన్ని బట్టి చూస్తే అతని తాజా వైఫల్యం ఆశ్చర్యం కలిగిస్తోంది. 2013 డిసెంబర్‌లో జరిగిన దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత 2014, 15, 16, 17 సంవత్సరాలలో కలిపి అతను 59.49 సగటుతో 3250 పరుగులు సాధించాడు. ఇలాంటి ఫామ్‌తో సఫారీ గడ్డపైకి వచ్చిన అతను అనూహ్యంగా విఫలమయ్యాడు.

ఓవరాల్‌గా దక్షిణాఫ్రికాలో రోహిత్ శర్మ 11 వన్డే ఇన్నింగ్స్‌లలో కలిపి 126 పరుగులే చేయగలిగాడు. సగటు 11.45 కాగా అత్యధిక స్కోరు 23 మాత్రమే.

ఇక్కడ మాత్రమే...

రోహిత్ భారత్‌లో మాత్రమే బాగా ఆడతాడనే విమర్శలో కూడా వాస్తవం లేదు. ఆస్ట్రేలియా గడ్డపై అతను నాలుగు సెంచరీలు సహా 51.95 సగటుతో పరుగులు చేయగా, ఇంగ్లండ్ మైదానాల్లో కూడా 53.30 సగటుతో పరుగులు రాబట్టాడు. న్యూజిలాండ్ పిచ్‌లపై కూడా ఎనిమిది ఇన్నింగ్స్‌లలో రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. అయితే దక్షిణాఫ్రికాకు వచ్చేసరికి మాత్రం అతని ఆట గతి తప్పుతోంది. దీనిపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ కెప్లెన్ వెసెల్స్ ... 'రోహిత్ ఫుట్‌వర్క్‌లోనే సమస్య ఉంది. దక్షిణాఫ్రికాలో సహజంగానే వేగం, బౌన్స్ కలగలిసి బంతులు వస్తాయి. ఆఫ్‌సైడ్ వైపు జరిగి ఆడేటప్పుడు అతని స్టాన్స్ సరిగా ఉండటం లేదు. దాని వల్లే అతను విఫలమవుతున్నాడు. ఆస్ట్రేలియాలో బౌన్స్ మాత్రమే ఉంటుంది. దానికి తగినట్లుగా బ్యాట్స్‌మెన్ తనను తాను మార్చుకునే అవకాశం ఉంటుంది. కానీ బౌన్స్‌కు పేస్ తోడైతే కష్టం' అని విశ్లేషించారు. మరోవైపు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో ఇటీవల చాలా వరకు పిచ్‌లు పూర్తి స్థాయిలో బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిపోగా, సౌతాఫ్రికాలో ఇంకా అలాంటి పరిస్థితి లేకపోవడం కూడా రోహిత్‌కు ప్రతికూలంగా మారిందనేది మరో రకమైన విశ్లేషణ.

నేర్చుకుంటాడా!

తాజా సిరీస్‌లో అతను నాలుగు సార్లు ఔటైన తీరు చూస్తే రోహిత్ ఒకే తరహాలో ఔటవుతున్నాడని కూడా చెప్పలేం. మొదటి రెండు వన్డేల్లో షార్ట్ పిచ్ బంతులను హుక్ చేయబోయి అతను వెనుదిరిగాడు. బౌన్స్ తక్కువగా ఉండే పిచ్‌లపై అతని షాట్ భారీ సిక్సర్‌గా మారేదేమో గానీ ఇక్కడ కాదు. మూడో వన్డేలో వేగంగా దూసుకొచ్చిన ఇన్‌స్వింగర్ రోహిత్ పాత సమస్యను బయట పెట్టింది. ఆ బంతిని ఆడాలా వద్దా తేల్చుకునే లోపే బ్యాట్‌కు తగిలి కీపర్ చేతుల్లో పడింది. నిజానికి ఇదే బలహీనత అతడిని టెస్టులకు పనికి రాకుండా చేసింది. శనివారం వన్డేలో సమర్థంగా డిఫెన్స్ ఆడలేక రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. వన్డేల్లో అత్యద్భుత రికార్డులు తన పేరిట ఉన్నా టెక్నిక్ పరంగా రోహిత్‌లో చాలా సమస్యలు ఉన్నాయనేది వాస్తవం. చీఫ్ కోచ్‌గా రవిశాస్త్రి పాత్ర గురించి చెప్పలేం కానీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ ఇలాంటి లోపాలను సరిదిద్దడంలో సిద్ధహస్తుడు. కాబట్టి దానిపై దృష్టి పెడితే తనేంటో చూపించుకునేందుకు రోహిత్‌కు మరో రెండు వన్డేలు ఉన్నాయి.

దక్షిణాఫ్రికా జట్టుకు జరిమానా

జొహన్నెస్‌బర్గ్: భారత్, దక్షిణాఫ్రికాల మధ్య జరిగిన నాలుగో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆతిథ్య జట్టుకు జరిమానా పడింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల ప్రకారం శనివారం జరిగిన మ్యాచ్‌లో సఫారీలు స్లో ఓవర్ రేట్‌తో బౌలింగ్ చేసినట్లు గుర్తించిన మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఆ జట్టుకు జరిమానా విధించారు. కెప్టెన్ మార్క్‌రమ్‌కు మ్యాచ్ ఫీజులో 20 శాతం, మిగతా ఆటగాళ్లకు 10 శాతం చొప్పున కోత విధించారు. వచ్చే ఏడాది కాలంలో మార్క్‌రమ్ జట్టుకు సారథిగా వ్యవహరిస్తూ... మరోసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమైతే అతనిపై మ్యాచ్ నిషేధం పడనుంది.

నాడు మృత్యు ఒడిలో... నేడు మెడలో పతకంతో



ప్యాంగ్‌చాంగ్: మృత్యువును జయిస్తేనే వార్తయితే... మృత్యువును, కాంస్యాన్ని జయించిన వ్యక్తిది కచ్చితంగా ఓ విజయగాథే అవుతుంది. ఇప్పుడు వింటర్ ఒలింపిక్స్‌లో అదే జరిగింది. కెనడాకు చెందిన స్నోబోర్డ్ ఆటగాడు మార్క్ మెక్‌మోరిస్ గతేడాది ఆరంభంలో చావు నుంచి తప్పించుకున్నాడు. ఇప్పుడు దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో అతను స్లోప్‌స్టైల్‌లో కాంస్య పతకం గెలిచి పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించాడు. గతంలో ప్రపంచ స్నోబోర్డ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన 24 ఏళ్ల మెక్‌మోరిస్ నాలుగేళ్ల క్రితం సోచి (రష్యా)లో జరిగిన గత వింటర్ ఒలింపిక్స్‌లోనూ కాంస్యం నెగ్గాడు. అయితే 11 నెలల క్రితం చావుకు అత్యంత చేరువయ్యాడు. ఇక బతికే పరిస్థితేలేనంత దూరం వెళ్లాడు. స్నోబోర్డే తన ప్రపంచమైన అతను 11 నెలల క్రితం లాస్ ఏంజెల్స్‌లో జరిగిన స్నోబోర్డ్ స్లోప్‌స్టైల్ ఈవెంట్‌లో పోటీ పడుతుండగా పెద్ద ప్రమాదమే జరిగింది. బుల్లెట్ వేగంతో స్నోబోర్డ్‌పై దూసుకెళ్తున్న అతను పెద్ద చెట్టును బలంగా ఢీకొట్టాడు. దీంతో ఒంట్లోని ఎముకలు విరిగాయి. ఇక బతకడం కష్టమని డాక్టర్లు చేతులెత్తేశారు. కానీ దురదృష్టం ఢీకొట్టించినా... అదృష్టం ఊపిరిపోయడంతో బతికిపోయాడు. కోలుకునేందుకు నెలల సమయం పట్టింది. ఒక్కసారి పూర్తిగా కోలుకోగానే మళ్లీ స్నోబోర్డ్ బాటపట్టాడు. ఈ ఏడాది ఆరంభంలో కాంస్యం నెగ్గి పునరాగమనం ఘనంగా చేశాడు.

ఆంధ్ర అదిరే ఆట

- తమిళనాడుపై 29 పరుగులతో విజయం
- విజయ్ హజారే ట్రోఫీ



భరత్



సుమంత్

చెన్నై: రంజీ ట్రోఫీలో నాకౌట్ దశకు చేరే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయిన ఆంధ్ర క్రికెట్ జట్టు దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో మాత్రం జోరు మీదుంది. పటిష్టమైన తమిళనాడుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర 29 పరుగుల తేడాతో గెలిచింది. ఈ టోర్నీలో ఆంధ్రకిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. తాజా గెలుపుతో ఆంధ్ర 16 పాయింట్లతో గ్రూప్ 'సి'లో అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్ చేరే అవకాశాలను మరింత మెరుగుపర్చుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 276 పరుగులు చేసింది. ఓపెనర్ శ్రీకర్ భరత్ (85 బంతుల్లో 82; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), రికీ భుయ్ (51 బంతుల్లో 52; ఒక ఫోర్, 3 సిక్స్‌లు), బోడపాటి సుమంత్ (67 బంతుల్లో 62 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. అశ్విన్ హెబర్ (38; 4 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి తొలి వికెట్‌కు భరత్ 87 పరుగులు జోడించాడు. అనంతరం 277 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన తమిళనాడు 48.5 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటై ఓటమి పాలైంది. ఆంధ్ర బౌలర్లలో శివ కుమార్ (2/53), అయ్యప్ప (2/37), భార్గవ్ భట్ (2/46), విహారి (2/41) రెండేసి వికెట్లు తీశారు. సోమవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో గుజరాత్‌తో ఆంధ్ర తలపడుతుంది.

ఇండియా ఓపెన్ విజేత సౌరవ్



ముంబై: భారత నంబర్‌వన్ స్క్వాష్ ప్లేయర్ సౌరవ్ ఘోషల్ ఇండియా ఓపెన్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సౌరవ్ 11–9, 5–11, 6–11, 11–7, 12–10తో నికోలస్ ముల్లర్ (స్విట్జర్లాండ్)పై విజయం సాధించాడు. నిర్ణాయక ఐదో గేమ్‌లో సౌరవ్ 3–7తో, 5–8తో, 8–10తో వెనుకబడి... ఆ తర్వాత పుంజుకొని వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 12–10తో ఐదో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

పచారీ షాపుకు వెళ్లి..
రూపాయి మందు అడిగితే ఏమిస్తాడు?
ఈ ఊళ్లో అయితే ఎలకమందు ఇస్తాడు.
కడుపులో ఉన్నా.. కడుపులోంచి పడినా..
ఆడపిల్లలను ఈ మందుతోనే పొట్టన పెట్టుకుంటారు.
మనింట్లో పుట్టిన ఆడపిల్ల 'కేర్'మంటే..
ఇల్లంతా పరుగెత్తుకుని వస్తుంది.
ఆ ఇంట్లో.. ఆ రాత్రి... ఆ బిడ్డ.. 'కేర్'మంటే..
తల్లే చెవులు మూసుకుంది!
ఆడపిల్లను కనిన తల్లి చెవుల్లో సీసం పోసుకోవాల్సిందే.
బిడ్డకు రూపాయి సీసామందు పోయాల్సిందే.
మరి అది ఆడపిల్లా? ఎలకపిల్లా??


ప్రతీకాత్మక చిత్రం

ఎలకపిల్లా?

''అవును.. అది రూపాయి మందే! నా బిడ్డ సచ్చిపోనీకె రూపాయి మందు పాలల్ల గలిపిన'' తన బిడ్డను తానే చంపుకున్నానని ఆ తల్లితో ఒప్పించడానికి పోలీసులు పెద్దగా కష్టపడాల్సిన పనిరాలేదు. నల్గొండ జిల్లా పియ్యేపల్లి మండలం వద్దిపట్లకు చెందిన సబిత (పేరు మార్చాం) తన మూడో సంతానంగా పుట్టిన ఆడపిల్లకు రూపాయి మందు పాలల్లో కలిపి బాటిల్‌తో పట్టింది. ఎలుకల మందుకి ఈ ప్రాంతంలో రూపాయి మందు అని పేరు. తండాలో ఆడపిల్లల ప్రాణాలను తీసేందుకు అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న ఈ రూపాయి మందునే ఆశ్రయిస్తుంటారంతా. ''ఈ ఆడపిల్లతోని ఇంట్లకు బోతె నా మొగుడు నన్నేలుకోనన్నడు గద! గందుకే చంపిన.''ఎందుకు చంపావన్న పోలీసుల ప్రశ్నకు సబిత జవాబిది. మళ్ళీ ఆమే పోలీసులను ఎదురు ప్రశ్నించింది''నా మొగుడు మారుబెళ్ళి చేసుకుంటనన్నడు మగపోరడి కోసం. ఏం జెయ్యమంటరు?'' నీ భర్తకు తెలుసా పోలీసుల అర్థం లేని ప్రశ్నకు అతను జాతరకెళ్ళాడని సమాధానమిచ్చింది సబిత. జాతరకెళ్ళాడని చెప్పింది కానీ ఆ రోజు జరిగిందంతా గుర్తొచ్చి తెరలు తెరలుగా దుఃఖం పొంగుకొస్తోంది సబితకి.

ఏడ్చి ఏడ్చి పసిపాపాయి పాలబుగ్గలమీద పడిన కన్నీటి చారికల ముద్రలను చేతితో నిమిరి చివరిసారిగా చెక్కిళ్ళను ముద్దాడింది సబిత. వెనుతిరిగి దేవుడి దగ్గర పెట్టిన రూపాయిబిళ్ళను చేతిలోకి తీసుకుంది. నాలాంటి పాపాత్మురాలిని ఎందుకు పుట్టించావు తండ్రీ అని దేవుడి పటం ముందు బోరుమంది. చిరిగిన పైటచెంగుతో కన్నీళ్ళు తుడిచేసి గబ గబా బయటకు పరిగెత్తింది. ఇంకొక్క నిముషం ఆలస్యమైనా తన భర్త వచ్చేస్తాడు. రాత్రి కొట్టిన దెబ్బలకు పదిరోజుల బాలింత ఒళ్ళంతా పుండులా మారింది. నాలుగు నెలల క్రితమే ఆడపిల్ల అని తెలిశాక స్కానింగ్ సెంటర్‌లోనే భర్త డాక్టర్‌తో గొడవపడిన విషయం గుర్తొచ్చింది సబితకి. అబార్షన్ చేయించుకోవాల్సిందేనని ఇంటికొచ్చాక చితకబాదాడు బాలాజీ. అయినా ఆమెకెందుకో ఆ పనిచేయబుద్ధి కాలేదు. బిడ్డ కడుపులో ఉండగా ఏ నెలలో ఏ అవయవాలు ఏర్పడతాయో సబిత తల్లి పాడిన పాట గుర్తొచ్చి ఆరోజు అబార్షన్‌కి ససేమిరా అంది. ఐదోనెలలో అబార్షన్ అంటే బిడ్డకీ, తల్లికీ కూడా ప్రమాదమని చెప్పారు డాక్టర్. ఆ డాక్టర్ కాకపోతే ఎంతో మంది డాక్టర్లున్నారన్నాడు అబార్షన్ చేయడానికి. గర్భంపోయేందుకు నాటు మందుకూడా తెచ్చి మింగిచ్చాడు. చావుతప్పి కన్నులొట్టబోయి బతికింది సబిత. ఆ రోజు నుంచి రోజూ భర్త తాగొచ్చి కొడుతున్న దెబ్బలకు కూడా తట్టుకుంది కానీ ఈ రోజు రూపాయి మందు పాలల్లో కలిపి రక్తపుగుడ్డుని చంపేయమన్నప్పుడు మాత్రం తట్టుకోలేకపోయింది. ముందు పుట్టిన ఇద్దరు బిడ్డలనూ తనకు తెలియకుండానే దూరం చేశాడు భర్త. ఈ బిడ్డనైనా దక్కనిస్తాడనుకుంటే తన చేతితోనే తన బిడ్డను చంపేయాలని హుకుం జారీచేశాడు. లేదంటే ఇంట్లోనుంచి తరిమేస్తానన్నాడు. తన పెళ్ళికి చేసిన అప్పుని తీర్చలేక దొర దగ్గర అమ్మానాన్నా జీతానికున్నారు. జీవితమంతా చాకిరి చేసినా వారు ఆ ఇంట్లోనుంచి బయటకు రాలేరు. చెల్లెళ్ళిద్దరికీ తన లాగే పన్నెండేళ్ళకే పెళ్ళిళ్ళు చేసేశారు. వాళ్ళ కాపురాలు కూడా దినదిన గండంగా ఉన్నాయి. ఈ పేరుతో తనని వదలించుకొని రెండో పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు భర్త. ఈ యింట్లోంచి బయటకెళితే భర్త లేని ఆడపిల్ల బతుకెంత హీనమో సబితకు తెలుసు. ఆ మరుసటి రోజు నుంచి మగాళ్లందరికీ ఆమె చులకనే. అప్పుడు తానేతప్పూ చేయకపోయినా అన్ని నిందలూ భరించాల్సిందే. బిడ్డను ఎలాగోలా బతికించుకుందామన్నా ఊరు ఊరుకోదు. ఒంటరి స్త్రీకి ఎంత విలువో, ఆమె బిడ్డనీ అంతే హీనంగా చూస్తుంది సమాజం. తనకాళ్ళపై తాను బతికేందుకు చదువూ సంధ్యాలేదు. ఈ పిల్ల పెద్దదై అన్ని కష్టాలూ పడి మళ్ళీ తనలా ఏదోరోజు ఎవరో ఒకరికి పెళ్ళాం అయ్యి వాడిచేతిలో చావుదెబ్బలు తినేబదులు ఈ రూపాయిమందిచ్చి గుండెను చిక్కబట్టుకుంటే చాలనుకుని తండా చివరి చిల్లరకొట్టుకెళ్ళి రూపాయి మందిమ్మంది సబిత. బిడ్డకొట్టతను ఒకసారి జాలిగా చూసి గాల్లో వేళ్ళాడుతున్న రూపాయి మందు ప్యాకెట్టుని ఆమె చేతిలో పెట్టాడు. బిడ్డపాలల్లో కొద్దిగా కలిపి మిగిలింది నీళ్ళల్లో కలుపుకుని తను తాగేసింది. ఆమె అంచనాలు తారుమారయ్యి తను బతికింది కానీ, పొత్తిళ్ళలోని పసిగుడ్డుకెంత కావాలి విషపుచుక్క చాలదూ ఈ వికృత సమాజంలోంచి శాశ్వతంగా దూరంగా సాగిపోవడానికి.

ఆడపిల్లను కన్న తర్వాత ఆమెను ఇంటికి రానివ్వడొక తండ్రి. గుక్కపెట్టి ఏడ్చినా, పాలబుగ్గల పసికందుకు పాలివ్వనివ్వడు మరో తండ్రి. ఏడ్చి ఏడ్చి గొంతెండి చచ్చిపోయిందా సరేసరి, లేదంటే ఏ వెయ్యిరూపాయలకో అమ్మేసుకుంటాడు మరో తండ్రి. కొద్దోగొప్పో కన్నబిడ్డ మీద మమకారం ఉన్నవాళ్ళకు ఉండనే ఉన్నది ఊయల. వద్దనుకున్న బిడ్డను చంపకండంటూ తమిళనాడు తరహాలో ఊయలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం దేవరకొండలో. అయితే సబిత భర్త బాలాజీ ఇవేవీ కాకుండా రూపాయిమందుని కలపమన్నాడు బిడ్డకి పట్టే పాలల్లో. సరిగ్గా ఆ తల్లి అదే చేసింది. బిడ్డని చంపేసి గప్‌చుప్‌గా పూడ్చిపెట్టేసారు మెట్టినింటివారు. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల పోరాటంతో ఇప్పుడు తెలంగాణలో అతి తక్కువ బాలికల నిష్పత్తి ఉన్న ప్రాంతాల్లో ప్రతి బిడ్డ మరణాన్నీ తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో సబిత బిడ్డ ఎలా చనిపోయిందన్న ప్రశ్న వచ్చింది. పదిహేను రోజుల తర్వాత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బృందం వెళ్ళి బిడ్డ భౌతిక కాయాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం చేస్తే రూపాయి మందు దారుణం బయటకు వచ్చింది.

ఈ ప్రశ్నలన్నింటికీ మనచుట్టూ జరుగుతున్న పరిణామాలే సమాధానం చెబుతాయి. యిప్పుడొస్తోన్న సినిమాలను గురించి ఒక్కసారి ఆలోచించండి. ఏం భాష వాడుతున్నారు? ఏం నేర్పిస్తున్నారు? ఒసేయ్, ఒరేయ్ అనా, పోస్టర్స్ ఎంత అశ్లీలంగా ఉంటున్నాయి? అన్నింటిలో కాంప్రమైజ్ కావడమేనా మనం చేస్తున్నది? అలా కాంప్రమైజ్ కాలేక, మనకి నచ్చినా నచ్చకపోయినా చూసీ చూడనట్టు, తెలియనట్టు నటించడం నాకు చేతకాక నేను సెన్సార్ బోర్డునుంచి పదేళ్ళక్రితమే రిజైన్ చేసి బయటకు వచ్చాను. దైనందిన జీవితంలో స్త్రీలను గౌరవించకపోగా, హింసను ప్రేరేపించే సినిమాలను వ్యతిరేకించే చైతన్యం కావాలి. ఎంతో పెద్ద చదువుచదివిన ఒక ఐఏఎస్ ఆఫీసర్ కూడా అత్తమామలనుంచి, భర్తల నుంచి అనేకరకాల హింసను ఎదుర్కొంటోంది. నాకు తెలిసిన కేసులే బోల్డున్నాయి. నిర్భయ అత్యాచారాలను ఆపగలిగిందా? అలాగే పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కూడా. చట్టం మంచిదే కానీ ఎవరు కంప్లైంట్ చేస్తారు. ఈరోజు ఏ ఆడపిల్ల పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కి తనకు అన్యాయం జరిగిందని చెప్పుకోగలుగుతోంది? అందుకే ముందు సమాజంలో ఆడపిల్లల పట్ల పాతుకుపోయిన అభిప్రాయాలు మారాలి. ఆడపిల్లలను హాయిగా ఈ లోకంలోనికి ఆహ్వానించే పరిస్థితులు సమాజంలో ఉండాలి. అప్పుడే ఆడపిల్లలను కడుపులోనే చంపుకోరు. వైద్యపరంగా డాక్టర్లపైనే తప్పులు నెట్టకుండా అబార్షన్ చేయించుకోవడానికి వచ్చేవారి ఆలోచనల్లో సైతం మార్పులు తేవాలి.

- అత్తలూరి అరుణ

ప్రిమిటివ్ క్యాపిటల్



ఇక్కడ ఆడపిల్లలు ప్రిమెటివ్ క్యాపిటల్. దేవరకొండ మండలం, మెగావత్ తండాలో ఇంట్లో తొలిచూలు ఆడబిడ్డను అమ్మి మూడు మేకలను కొనుక్కున్నాడొక తండ్రి. అదేమండలం కట్టకొమ్మ తండాలో ఆడపిల్లను అమ్మేసి ఆటో కొనుక్కున్నాడో తండ్రి. మన దేశంలో వెయ్యి రూపాయలకీ, వంద రూపాయలకీ కూడా ఆడపిల్లలను అమ్ముకుంటున్నారు. వీటికి సాక్ష్యాధారాలూ ఏవీ ఉండవు. కానీ ఒకే ఊర్లో పదుల సంఖ్యలో అమ్మాయిలు మరణిస్తుంటారు. అయితే డబ్బొక్కటే ప్రధానం కాదు. సబిత కేసే అందుకు సాక్ష్యం. వాళ్ళు పేదవాళ్ళు కాదు. వాళ్ళకి నాలుగెకరాల పొలం వుంది. ట్రాక్టర్ వుంది. అయినా ఆడబిడ్డని చంపారంటే అందుకు సన్‌ప్రిఫరెన్స్ కారణం. వారసుడు, కొడుకు పున్నామ నరకాన్నుండి తప్పిస్తాడనీ, కొరివిపెట్టేవాడుండడనీ ఏవో సాకులు చెపుతారు. కానీ దానివెనుక దాగున్నది మాత్రం ఆడపిల్లల పట్ల వివక్షే. ఆడపిల్లల భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా తెచ్చిన పీసీపీఎన్‌డీటీ యాక్ట్ వుంది. అది అమలు పర్చేందుకు అంచెలంచెల అధికార వ్యవస్థ వుంది. అయితే చిత్తశుద్ధి మాత్రం లేదు.

- రుక్మిణీరావు, గ్రామ్య స్వచ్ఛంద సంస్థ

దీపఖడ్గం


ప్రతి అక్షరం నాయకత్వ లక్షణం


రచయిత్రి చిత్రా ముద్గల్ : ఢిల్లీలో నేడు సాహిత్య అకాడమీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్నారు.

అక్షరం.. చీకటిని చీల్చే దీపఖడ్గం. వట్టి పాదాలతో నిష్టగా ఆ ఖడ్గం అంచుపై నడిచి ఆ రుధిరధారతో పదునెక్కిన రచయిత్రి చిత్రాముద్గల్. దత్తా సామంత్ పేరు మీరు వినే ఉంటారు. శంకర్ గుహ నియోగి పేరు కూడా. ఇద్దరూ కార్మిక సంఘాల నాయకులు. ముంబై సిటీలోని లక్షల మంది జౌళి మిల్లు కార్మికుల యూనియన్ లీడర్ దత్తాసామంత్. 1997లో అండర్‌వరల్డ్ మాఫియా అతడిని చంపేసింది. అంతకుముందే 1991 శంకర్ గుహ నియోగి హత్య జరిగింది. ఛత్తీస్‌గఢ్ గని కార్మికుల ప్రియతమ నాయకుడు నియోగి. అక్కడి ఇండస్ట్రియల్ మాఫియా అతడిని చంపేసింది. ఈ రెండు హత్యలు భారతదేశంలోని కార్మిక సంఘాలను దిగ్భ్రాంతికి గురిచేశాయి. అక్షరయోధురాలైన ముద్గల్ చేత 'ఆవాన్' అనే పుస్తకాన్ని రాయించాయి. దత్తా సామంత్ ఆమె తాత్విక గురువు కూడా. కార్మిక సంఘాల ఉద్యమాలు బలంగా వేళ్లూనుకుంటున్న సమయంలోని కార్మిక జీవితాలపై, ఆనాటి పరిస్థితులపై ముద్గల్ రాసిన 'ఆవాన్'.. హిందీ సాహిత్యంలో ఒక 'క్లాసిక్'గా నిలిచిపోయింది. కార్మిక సంఘ నాయకత్వ లక్ష్యంలోని ఔన్నత్యాన్ని అర్థం చేసుకోడానికి అదొక ప్రామాణిక గ్రంథం అయింది. ఈ డెబ్బయ్ మూడేళ్ల వయసులోనూ ముద్గల్ ఆధునిక హిందీ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నవారిలో ఒకరిగా నిలబడే ఉన్నారు. ఇవాళ ఢిల్లీలో మొదలౌతున్న ఆరు రోజుల సాహిత్య అకాడమీ వేడుకల్లో అకాడమీ ఎగ్జిబిషన్‌కు చిత్రా ముద్గలే ప్రారంభోత్సవం చేయబోతున్నారు. ముద్గల్ చెన్నైలో పుట్టారు. ముంబైలో చదువుకున్నారు. హిందీ లిటరేచర్‌లో ఎమ్మే చేశారు. తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగా అవధ్ నారాయణ్ ముద్గల్ అనే జర్నలిస్ట్‌ని వివాహం చేసుకున్నారు. దత్తా సామంత్, శంకర్ గుహ నియోగి కార్మిక సంఘాల నాయకులైతే, చిత్రా ముద్గల్ అక్షర కార్మికురాలిగా కార్మిక ఉద్యమానికి జెండా పట్టిన యోధురాలు. ఆమె ప్రతి అక్షరం నాయకత్వ లక్షణం.

గుడ్ ఫుడ్

బరువు తగ్గాలనుకునేవారికి అనువైన 'సొరకాయ'



సొరకాయ తింటే క్యాలరీలు చాలా తక్కువ. తొంభై శాతానికి మించి నీరే ఉంటుంది. కొవ్వుపాళ్లు కేవలం 1 శాతం మాత్రమే. పీచు పాళ్లు ఎక్కువ. ఈ అన్ని అంశాలు కలగలిసి ఉండటం వల్ల సొరకాయ తినగానే కడుపు నిండిపోతుంది. కానీ బరువు పెరగనివ్వదు. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఇంతకంటే మంచి కూర... మంచి వంటకం మరేముంటుంది. కేవలం బరువు తగ్గడానికే కాదు... మరెన్నో విధాల మేలు చేస్తుంది సొరకాయ. దానితో ఒనగూరే ప్రయోజనాల్లో కొన్ని ఇవి...

- సొరకాయలో డయటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దాంతో సొరకాయ ఐటమ్స్ తినగానే వెంటనే కడుపు నిండిపోయిన భావన కలుగుతుంది. దాంతో తినేది చాలా తక్కువ. సంతృప్త భావన ఎక్కువ. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి సొరకాయ మంచి ఆహారం.
- బరువు తగ్గడానికి తోడు... డయాబెటిస్ వ్యాధితో బాధపడేవారికి... ఇలా ఇద్దరికీ ఉపకరించే మరో గుణం సొరకాయలో ఉంది. అదేమిటంటే... 100 గ్రాముల సొరకాయ తింటే దాని వల్ల సమకూరేది కేవలం 15 క్యాలరీలు మాత్రమే. అందుకే డయాబెటిస్ ఉన్నవారు సొరకాయను ఏ రకంగా తీసుకున్నా మంచిదే. ఇక సొరకాయలో 96 శాతం నీరే. ఇలా చూసినప్పుడు డయటరీ ఫైబర్, తక్కువ క్యాలరీలను ఇచ్చే గుణం, నీరు ఎక్కువగా ఉండటం... ఈ మూడు అంశాలూ ఒబేసిటీ తగ్గించుకోడానికీ, డయాబెటిస్‌ను అదుపులో పెట్టుకోడానికి పనికి వస్తాయి.
- ఇందులో నీటి పాళ్లు 96 శాతం ఉండటం వల్ల ఒంట్లో ద్రవాలు తగ్గుతున్నవారికి (డీహైడ్రేషన్‌కు గురవుతున్నవారికి) ఇది చాలా మేలు చేసే ఆహారం.
- 100 గ్రాముల సొరకాయలో కొవ్వుల పాళ్లు కేవలం 1 గ్రాము మాత్రమే. కొలెస్ట్రాల్ పాళ్లు చాలా చాలా తక్కువ. అందుకే ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

సంస్కృతి

పద్మావతి ఓకే ప్యాడ్‌మ్యాన్ నాట్ ఓకే



'ప్యాడ్‌మ్యాన్' చిత్రంలోని ఒక సన్నివేశం


పద్మావతి

'ప్యాడ్‌మ్యాన్' మూవీ మొన్న ఫ్రైడే ప్రపంచమంతా విడుదలైంది. ఒక్క పాకిస్థాన్‌లో తప్ప! రుతుస్రావ పారిశుద్ధ్యాన్ని ప్రధాన అంశంగా తీసుకుని దర్శకుడు ఆర్.బల్కీ తీసిన ఈ చిత్రం తమ సంస్కృతికి, సంప్రదాయాలకు పూర్తి భిన్నంగా ఉందని భావించిన పాక్ సెన్సార్ బోర్డు.. విడుదలకు అనుమతిని తిరస్కరించడంతో, అక్కడి ప్రభుత్వం కూడా ఈ సినిమాపై నిషేధం విధించింది. ''గోప్యమైన విషయాలను బాహాటంగా చర్చించడం, చర్చకు అవకాశం కల్పించడం అన్నవి ఈ దేశపు మనోభావాలను భంగపరిచేవి కనుక 'ప్యాడ్‌మ్యాన్'కు క్లీన్ సర్టిఫికెట్ ఇవ్వలేకపోతున్నాం'' అని అక్కడి పంజాబ్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు కూడా ప్రకటించింది. పాకిస్థాన్ ఎంతగానో అభిమానించే మన అక్షయ్‌కుమార్, రాధికా ఆప్టే, సోనమ్ కపూర్.. ప్యాడ్‌మ్యాన్ చిత్రంలో ఉన్నప్పటికీ, ప్యాడ్‌మ్యాన్ థీమ్‌ను మాత్రం ఆ దేశం మనస్ఫూర్తిగా స్వీకరించలేకపోతోంది. భారత్‌లోని సగటు మహిళా ప్రేక్షకులు కూడా ప్యాడ్‌మ్యాన్ చిత్రాన్ని చూసేందుకు బిడియపడకుండా రాలేకపోతున్నారని సమీక్షలు వస్తున్నాయి. విశేషం ఏంటంటే.. భారత్‌లో ఆటంకాలను ఎదుర్కొన్న 'పద్మావతి' చిత్రానికి పాక్ ఒక్క కట్ కూడా లేకుండా ఓకే చెప్పింది. ఒక్క కట్ కూడా లేకుండా భారత్‌లో విడుదలైన 'ప్యాడ్‌మ్యాన్' చిత్రం పాక్‌లో రిలీజ్ కాలేకపోయింది. ఎవరి మనోభావాలు వారివి. వాటిని గౌరవించడం మానవ సంప్రదాయం.

చెట్టు నీడ

భూమ్మీదే స్వర్గనరకాలు

ఒక సైనికుడికి స్వర్గనరకాలు అంటే ఏమిటో తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగింది. చాలామందిని అడిగాడు. దానికి వారు ఇచ్చిన సమాధానాలు అతడికి తృప్తి కలిగించలేదు. చివరగా సుదూర నగరంలోని ఒక గురువును ఆశ్రయించాడు. గురువుకు వినయంగా నమస్కరించి–

'గురువర్యా! ఈ స్వర్గనరకాలు అంటారే, అవేమిటి?' అని వినయంగా ప్రశ్నించాడు.

'నీ ముఖానికి నీక్కూడా స్వర్గనరకాలు అంటే ఏమిటో తెలుసుకోవాలని ఉందా?' కఠినంగా ప్రశ్నించాడు గురువు.

సైనికుడు ఆ ప్రశ్నను ఊహించలేదు. అతడి ముఖంలో రంగులు మారినై. కోపం కట్టలు తెంచుకుంది. వెంటనే తన ఒరలోని కత్తిని బయటికి తీశాడు.

'అదిగో, నరక ద్వారం ఇప్పుడే తెరుచుకుంది,' అన్నాడు గురువు.

సైనికుడు మౌనం వహించాడు.

> 'అదిగో, నరక ద్వారం ఇప్పుడే తెరుచుకుంది,' అన్నాడు గురువు. సైనికుడు మౌనం వహించాడు.

'అయితే ఆ కత్తితో నా తలను ఖండిద్దామనే అనుకుంటున్నావా? నా మెడను నరికేంత పదును దానికి ఉందా?' అన్నాడు ఆత్మవిశ్వాసంగా గురువు.

గురువు మాటల్లోని ఆంతర్యం గ్రహించిన సైనికుడు సిగ్గుపడి కత్తిని తీసి మళ్లీ ఒరలో పెట్టుకున్నాడు.

'ఇప్పుడు చూడు, స్వర్గ ద్వారం నిన్ను ఆహ్వానిస్తోంది' అన్నాడు చిర్నవ్వుతో గురువు.

సైనికుడి ప్రయాణం సఫలమైంది. తను ఇన్నాళ్లుగా వెతుకుతున్న ప్రశ్నకు సరైన జవాబు దొరికింది.

కోపమే నరకం. శాంతియే స్వర్గం.

బ్యూటిప్



- బాగా పండిన తాజా టమోటా గుజ్జుకు రెండు చెంచాల పాలు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత చల్లని నీటితో కడుక్కుంటే ముఖంపై ఉన్న మృతకణాలు, జిడ్డు తొలగి ముఖం కాంతివంతంగా కనపడుతుంది.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! నేను ఐదేళ్లుగా ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నా. తనూ నన్ను లవ్ చేసింది. తను ఆపరేషన్ థియేటర్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. తనంటే నాకు చాలా ఇష్టం. ఒక రోజు నా దగ్గరకు వచ్చి తనతో పాటు పనిచేస్తున్న ఒకడు తనను బలవంతం చేశాడని బాగా ఏడ్చింది. నీ తప్పులేకుండా జరిగింది కదా అని నచ్చజెప్పి ఆసుపత్రికి తీసుకెళ్లి చాలా కేరింగ్‌గా చూసుకున్నాను. కొన్ని రోజుల తరువాత తన ఫోన్‌లో వాడితో చేసిన చాట్ చూసి చాలా షాక్ అయ్యాను. మెసేజ్‌లన్నీ చాలా బ్యాడ్‌గా ఉన్నాయి. తనని చాలా పిచ్చిగా నమ్మాను సార్, తనకోసం చాలా చేశాను. అయినా నా బాధంతా నన్ను మోసం చేసినందుకు కాదు, వాడు మంచివాడు కాదు సార్. ఎక్కడ తన జీవితం నాశనం చేసుకుంటుందోనని భయంగా ఉంది. నిజానికి తను చేసిన ఈ మోసానికి చనిపోవాలనుకున్నా. కానీ మా ఫ్యామిలీ చాలా పూర్ సార్. చాలా కష్టపడి నన్ను చదివించారు. నేను లేకపోతే వాళ్లంతా ఏమైపోతారోనని ఆలోచించి ఆగిపోయాను. ఇప్పటికీ తను చేసిన మోసం గుర్తుకొస్తుంటే ప్రాణం పోయినట్లనిపిస్తోంది. చచ్చిపోవాలనిపిస్తోంది. ఏదైనా మంచి సలహా ఇవ్వండి సార్ ప్లీజ్.

– చంద్ర

మనసును గుప్పెట్లో పెట్టుకున్నవాడు...
'అమ్మాయిని గుప్పెట్లో పెట్టుకున్నాననుకున్నాడు సార్...!'
నువ్వు ఆగుతావా నీలాంబరీ...??
'ఎందుకు ఆగాలి సార్ చంద్ర లైఫ్‌లో ద్రోహం జరిగింది.
మీరు ఇప్పుడు కూడా అమ్మాయిది తప్పుకాదని అంటే... కృంగిపోతాడు సార్...
అయినా ఇదేం చోద్యం సార్..?
అక్కడ చంద్ర ప్రాణం గుప్పెట్లో పెట్టుకుని ప్రేమలో తన్నుకులాడుతుంటే...
మీరు మనసు గుప్పెట్లో పెట్టుకోమని...
పెంట అడ్వైజ్‌లు ఎలా ఇస్తారు సార్???'
హాలో.. కొంచెం స్లో..! ఎక్కువైంది ఫ్లో....!!
'ఏంటి సార్ ఎక్కువైంది..?? చంద్రకి సరైన ఆన్సర్ ఇవ్వకుండా వెటకారాలు, ఛీత్కారాలు లాంటివి నేను ఒప్పుకోను...'
చంద్రా సారీ..! నీకు ఇలా జరగాల్సింది కాదు.
ఎంతగా ప్రేమించావు...
ఎంతగా అభిమానించావు...
తప్పు జరిగినా ఎంతగా ప్రేమిస్తున్నావు..?
యు ఆర్ గ్రేట్ చంద్ర.
ఒక అమ్మాయిని ప్రేమించిన దాంట్లో 10%...
నీ ఫ్యామిలీని ప్రేమిస్తే...
నీ బాధ మాయమైపోతుంది.
నీకు ఒక కొత్తదనం అనిపిస్తుంది...
మనసు చాలా లైట్‌గా... హ్యాపీగా అనిపిస్తుంది.
ప్రేమించడానికి కాదు చంద్ర...
ప్రేమించబడడానికి కూడా అర్హత ఉండాలి.
ఆ అమ్మాయికి నీ ప్రేమ పొందే అర్హత లేదు.
నీ ఫ్యామిలీకి నీ ప్రేమను మించిన ఆనందం లేదు.
లవ్ లైఫ్. లవ్ ఫ్యామిలీ... లవ్ యువర్ సెల్ఫ్...
తప్పకుండా నీ ప్రేమకు అర్హురాలైన అమ్మాయి
నిన్ను వెతుక్కుంటూ వస్తుంది.'
'కరెక్ట్ ఆన్సర్ ఇచ్చారు కాబట్టి మీకు అరటిపండు తినే అర్హత ఉంది సార్!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాస్కో సుడోకు

				2		3	9	
7		5	4					
6	9		8	3				1
		8		7		4	3	9
			3		8			
3	7			5		6		
2				6	1		7	3
					7	5		8
	1	7		8				

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.


నిన్నటి జవాబు

1	5	2	8	9	4	7	6	3
8	4	9	6	3	7	2	1	5
7	3	6	2	5	1	8	4	9
9	2	1	3	4	8	5	7	6
6	8	5	1	7	9	3	2	4
4	7	3	5	6	2	9	8	1
2	1	4	9	8	3	6	5	7
5	9	7	4	2	6	1	3	8
3	6	8	7	1	5	4	9	2


మహేశ్‌బాబు

27న గుమ్మడికాయ పాలాభిషేకం

అవును.. 27న 'భరత్ అనే నేను'కి గుమ్మడికాయ కొట్టేస్తారట. ఏ 27న అంటే వచ్చే నెల అన్నమాట. ఆ రోజుకల్లా షూటింగ్ మొత్తం కంప్లీట్ చేసేసి, గమ్మడికాయ కొట్టేయనున్నారు. ఇక సినిమా రిలీజ్ రోజున అభిమాన హీరో కటౌట్స్‌కి ఫ్యాన్స్ ఎలానూ పాలాభిషేకం చేస్తారు కదా. ఏప్రిల్ 27కి మహేశ్‌బాబు అభిమానులు పండగ చేసుకోవడానికి రెడీ అయిపోవచ్చు. సీయం భరత్‌గా మహేశ్‌బాబు నటిస్తోన్న చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను మార్చి 27కల్లా కంప్లీట్ చేసి, ఏప్రిల్ 27న విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేసినట్లు సమాచారం. శ్రీమంతుడు' వంటి హిట్ సినిమా తర్వాత మహేశ్–కొరటాల కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే రిలీజ్ చేసిన 'ఫస్ట్ ఓత్'కు విశేష స్పందన లభించింది. మహేశ్ సరసన కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తిరు, సంగీతం: దేవీశ్రీ ప్రసాద్.


అల్లు అర్జున్

చచ్చేంత దేశభక్తి!

సైనికుడిగా దేశసేవ చేయాలనుకునేవాళ్లు బోర్డర్‌లో ఉంటారు. దేశం కోసం చచ్చేంత దేశభక్తి ఉన్న సైనికుడు సూర్య మాత్రం బోర్డర్ నుంచి రావాల్సి వచ్చిందట. ఎందుకు? అంటే సిల్వర్ స్క్రీన్‌పైనే చూడాలి అంటున్నారు 'నా పేరు సూర్య– నా ఇల్లు ఇండియా' చిత్ర బృందం. అల్లు అర్జున్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నా పేరు సూర్య– నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీషాశ్రీధర్ నిర్మిస్తున్నారు. బన్నీ వాసు సహ నిర్మాత. ఈ సినిమా క్లైమాక్స్ షూట్‌ను ఈ రోజు హైదరాబాద్‌లో స్టార్ట్ చేశారు. సోల్జర్ సూర్య పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. ''క్లైమాక్స్ పార్ట్‌ను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు ప్లాన్ చేశాం. అలాగే వాలెంటైన్స్ డే సందర్భంగా సినిమాలోని 'లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో' సాంగ్‌ను రిలీజ్ చేయనున్నాం. రచయిత రామజోగయ్య శాస్త్రి ఇచ్చిన అద్భుతమైన లిరిక్స్‌కు విశాల్–శేఖర్ అద్భుతమైన ట్యూన్ అందించారు. శేఖర్ గొంతుతో ఈ పాట మరింత శ్రావ్యంగా తయారయ్యింది. ఏప్రిల్ 27న సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం.'' అన్నారు నిర్మాతలు.

టైటిల్ పెట్టావ్ సరే... జాగ్రత్తగా తియ్ అన్నారు

"జ్ఞాపకం, స్నేహగీతం చిత్రాల్లో నటించాను. రైటర్‌గా 'ఇట్స్ మై లవ్‌స్టోరీ, స్నేహగీతం, కేరింత' చేశాను. రాయటం స్టార్ట్ చేసిన దగ్గర్నుంచి యాక్టింగ్‌వైపు ఇంట్రెస్ట్ తగ్గింది. యాక్టింగా? రైటింగా? అని నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు రైటింగ్ టు డైరెక్షన్ అని డిసైడ్ అయ్యాను" అన్నారు వెంకీ అట్లూరి. వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీయస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' శనివారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెంకీ చెప్పిన విశేషాలు...

- దర్శకులు రాఘవేంద్రరావుగారు ఆదివారం మార్నింగ్ బెస్ట్ కాంప్లిమెంట్ ఇచ్చారు. ఆయన తెలుగు ఇండస్ట్రీకి ఫస్ట్ షో మ్యాన్. అలాంటి ఆయన దగ్గర్నుంచి కాంప్లిమెంట్ రావడం ఫుల్ హ్యాపీ. ఆర్.నారాయణమూర్తి గారు కాంప్లిమెంట్ ఇచ్చారు. తెలంగాణ మంత్రి కేటీఆర్‌గారు సినిమా చూసి, ట్విట్టర్‌లో రియాక్ట్ అవ్వడం చాలా సంతోషాన్నిచ్చింది.
- ప్రీ–రిలీజ్ ఫంక్షన్‌లో ఫ్యాన్స్‌కు ప్రామిస్ చేశా. పవన్ కల్యాణ్‌గారి 'తొలిప్రేమ' సినిమా అంత కాకపోయినా ఆ సినిమా గౌరవాన్ని కాపాడేలా మా 'తొలిప్రేమ' చిత్రం ఉంటుందని. కాపాడాననే అనుకుంటున్నాను. 'తొలిప్రేమ' టైటిల్ పెట్టినప్పుడు ఫ్యాన్స్ నుంచి ఏమైనా కాల్స్ వస్తాయేమో అనుకున్నాను. కానీ లేదు. 'టైటిల్ పెట్టావ్ సరే .. జాగ్రత్తగా తియ్' అని కొందరు ఫ్యాన్స్ అన్నారు. టైటిల్ పోస్టర్‌ను లాంచ్ చేసినప్పుడు వాళ్లు బాగా వెల్‌కమ్ చేశారు. ఎందుకు పెట్టావ్? అని ఏ సైడ్ నుంచి రాలేదు.
- నిజానికి ఈ సినిమా స్క్రిప్ట్ రాసినప్పుడు వరుణ్ తేజ్ తొలి సినిమా 'ముకుంద' కూడా రిలీజ్ కాలేదు. టీజర్ రిలీజైంది. అప్పుడు ఇలాంటి హీరో మన సినిమాలో ఉంటే బాగుంటుందనిపించింది. వరుణ్ 'కంచె' చూసినప్పుడు ఏ రోల్ అయినా చేయగలడనిపించింది. 'లోఫర్' సినిమా టైమ్‌లో తనకు కథ చెప్పా. ఓకే అన్నారు. ఈ కథను ముందు 'దిల్' రాజుగారికి చెప్పాను. ఆయన చాలా ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటంతో ప్రసాద్‌గారిని కలిశాను. ప్రసాద్ తనయుడు బాపీనీడు నాకు బెస్ట్ ఫ్రెండ్. అలా ఈ ప్రాజెక్ట్ సెట్ అయ్యింది.
- త్రీ వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్స్ కోసం వరుణ్, రాశీఖన్నా లుక్స్ పరంగా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇద్దరూ సూపర్‌గా నటించారు. తమన్ సొంత కథలా ఫీలయ్యి మంచి సంగీతం ఇచ్చాడు.
- సినిమా కాస్త లేట్ అయ్యింది. అది మంచికే జరిగిందనుకుంటున్నాను. స్క్రిప్ట్‌ను మరింత బాగా రెడీ చేసుకున్నా. డిస్కషన్స్ బాగా జరిగాయి. కానీ 'ఫిదా' రిలీజ్ తర్వాత 'తొలిప్రేమలో' ఏ మార్పూ చేయలేదు. 'ఫిదా' సినిమా రిలీజైన 10 డేస్ తర్వాత 'తొలిప్రేమ' సినిమా షూటింగ్‌ను స్టార్ట్ చేశాం.
- లవ్‌స్టోరీ, డ్రామా, కాస్త పొలిటికల్ ఇంపాక్ట్ ఉన్న సినిమాలు, బయోపిక్ జోనర్‌లు అంటే ఇష్టం. పొలిటికల్ ఇంపాక్ట్ అంటే.. సోషల్ మేసేజ్ రిలవెంట్ ఉన్నవి. నెక్ట్స్ ప్రాజెక్ట్ ఇంకా ఫిక్స్ కాలేదు. ప్రసాద్‌గారి బ్యానర్‌లో ఓ సినిమా చేయాలి. 'దిల్' రాజుగారి నిర్మాణంలో సినిమా ఉంటుంది.


వెంకీ అట్లూరి

ఛల్ మోహన్‌రంగ

'బొమ్మోలే ఉన్నదిరా పోరి.. బొం బొంబాటుగుందిరా నారి.. లడ్డోలె ఉన్నదిరా కోరి.. లై లైలప్ప బుగ్గల్ది ప్యారి' అంటూ 'లై' సినిమాలో సందడి చేశారు నితిన్–మేఘా ఆకాశ్. మరోసారి ఈ ఇద్దరూ జంటగా నటిస్తోన్న చిత్రానికి 'ఛల్ మోహన్‌రంగ' టైటిల్ పెట్టారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని ఆదివారం విడుదల చేశారు. నితిన్ కెరీర్‌లో 'ఛల్ మోహన్‌రంగ' 25వ సినిమా కావడం ఒక విశేషమైతే.. దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథ అందించడం మరో విశేషం. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు కృష్ణ చైతన్య, సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ– ''ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. చాలా సరదాగా సాగుతుంది. ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తయింది. ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో ఆ పాట చిత్రీకరించనున్నాం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రేమికులరోజు సందర్భంగా ఈ నెల 14న టీజర్‌ని, ఏప్రిల్ 5న సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు. ''నా అభిమాన హీరో పవన్ కల్యాణ్‌గారు ఫస్ట్ లుక్‌ని విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉంది'' అన్నారు నితిన్. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, సమర్పణ: నిఖిత రెడ్డి.


నితిన్

హాలీవుడ్‌కి హలో


మనోజ్

హీరోలంటే కేవలం నటనకే పరిమితం కాదని మంచు మనోజ్ ప్రతీసారి నిరూపిస్తున్నారు. మోహన్‌బాబు వారసుడిగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ని ఏర్పాటు చేసుకున్నారు మనోజ్. నటుడిగా, గాయకుడిగా, పాటల రచయితగా, స్టంట్ మాస్టర్‌గా.. ఇలా ప్రతీ సినిమాకు తనలో ఏదో ఒక కొత్త కోణాన్ని అభిమానులకు చూపిస్తున్నారు మనోజ్. 'నేను మీకు తెలుసా' సినిమాలో స్వయంగా స్టంట్స్ కంపోజ్ చేసుకోవడంతో పాటు 'కన్ను తెరిస్తే జననమేలే' పాటను కూడా రాసిన విషయం గుర్తుండే ఉంటుంది. 'బిందాస్, కరెంట్ తీగ, వేదం, మిస్టర్ నూకయ్య' వంటి చిత్రాల్లో తన పాత్రకు తానే స్వయంగా స్టంట్స్ కంపోజ్ చేసుకున్నారు. 'పోటుగాడు' సినిమాలో 'ప్యార్ మే పడిపోయాను...' అని సరదాగా గొంతు కూడా సవరించారు. ఇప్పుడు ఒక అడుగు ముందుకు వేసి మ్యూజిక్ డైరెక్టర్‌గా మరో కొత్త అవతారం ఎత్తారు మనోజ్. ఈ చిత్రం ద్వారా హాలీవుడ్‌కి హలో చెబుతున్నారు. ఆస్కార్ విన్నింగ్ యాక్టర్స్ బ్రీ లార్సన్ లీడ్ యాక్టర్‌గా నటించిన హాలీవుడ్ మూవీ 'బాస్మతీ బ్లూస్'కి సంగీత దర్శకుడిగా మారారు మనోజ్. తన స్నేహితుడు, సంగీత దర్శకుడైన అచ్చుతో కలిసి ఈ సినిమాకు మ్యూజిక్ కంపోజ్ చేశారు. ఇందులో లక్ష్మి మంచు ఓ కీలక పాత్ర పోషించారు.

అడ్డుకుంటారు... ఆగొద్దు


''**లై**ఫ్‌లో ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడే సక్సెస్ విలువ తెలుస్తుంది. ఫెయిల్యూర్స్ నుంచే కాదు సక్సెస్ నుంచి కూడా ఒక మంచి పాఠం నేర్చుకున్నప్పుడే లైఫ్ మరింత మెరుగవుతుంది'' అంటున్నారు కృతీ సనన్. లైఫ్ గురించి ఆమె ఇంకా మాట్లాడుతూ – ''జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. కష్టానికి కంగారు పడకూడదు. సక్సెస్‌కు సంబరపడిపోకూడదు. పరిస్థితులకు తగ్గట్లు ముందుకు సాగాలి. నాకు టీమ్ నచ్చితేనో లేక సినిమాలో నా క్యారెక్టర్ నచ్చినప్పుడు మాత్రమే యాక్ట్ చేయడానికి ఒప్పుకుంటాను. లేకపోతే లేదు. ఎవరికైనా లైఫ్‌లో సక్సెస్ అండ్ ఫెయిల్యూర్స్ కామనే. కాకపోతే ఈ జర్నీలో కొత్తగా ఏం నేర్చుకున్నామన్నదే ఇంపార్టెంట్. నీ చుట్టూ ఉన్నవాళ్లలో కొందరు నిన్ను నిరుత్సాహపరచడానికి రెడీగా ఉంటారు. నీ కలను అడ్డుకోవడమే వారి పని. అలాంటి వారి గురించి ఎక్కువగా ఆలోచించకండి. ఆగకండి. మీ పనిని మీరు ఎంత బాధ్యతగా, ప్రేమగా చేస్తున్నారన్నదే ముఖ్యం'' అని చెప్పారు. ఇక ఇండస్ట్రీ వాతావరణం గురించి మాట్లాడుతూ– ''ఇండస్ట్రీలో మెంటల్ స్టెబిలిటీ చాలా ఇంపార్టెంట్ అని నేను నమ్ముతాను. ముఖ్యంగా మనపై మనకు నమ్మకం ఉండాలి. మంచి జాబ్ ఆఫర్స్ వదులుకొని ఇండస్ట్రీలోకి వచ్చాను నేను. మొదట్లో మోడలింగ్, టీవీ కమర్షియల్స్ చేశాను. ఆ తర్వాత నాపై నమ్మకంతో యాక్టింగ్ వైపు అడుగులు వేశా. కష్టపడ్డాను. ఇప్పుడు హీరోయిన్‌గా నటిస్తున్నాను. నీ పనికి ఎంత కష్టాన్ని ఇవ్వగలవో అంత ఎక్కువ ప్రతిఫలాన్ని నువ్వు పొందగలవు'' అని చెప్పుకొచ్చారామె. ప్రస్తుతం రోహిత్ జుగరాజ్ దర్శకత్వంలో దిల్జీత్ హీరోగా రూపొందుతున్న 'అర్జున్ పాటియాలా' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగులో మహేశ్‌బాబు '1: నేనొక్కడినే', నాగచైతన్య 'దోచేయ్' సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు కృతీ సనన్.


కృతీసనన్

పరి పరిశోధన


కృత్రిమ మూత్రపిండాలు సిద్ధమయ్యాయి!

మానవ మూత్రపిండాన్ని కృత్రిమంగా తయారు చేసే దిశగా మాంఛెస్టర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గణనీయమైన ప్రగతి సాధించారు. ప్రపంచంలోనే తొలిసారి వీరు ఓ జీవి శరీరంలో అచ్చం మన మూత్రపిండాలను పోలిన కణజాలాన్ని అభివద్ధి చేయగలిగారు. ఇది రక్తశుద్ధి ద్వారా మూత్రం కూడా తయారు చేయగలగడం విశేషం. కిడ్నీ సమస్యలతో బాధపడే వారికి ఈ పరిశోధన ఎంతో ఉపయోగపడుతుందని అంచనా. మూత్రపిండాల్లో ఉండే అతిసూక్ష్మమైన కిడ్నీ గ్లోమెరూలీ కణాలను పరిశోధనశాలలో తగిన పరిస్థితుల మధ్య పెంచడంతో ఈ ప్రక్రియ మొదలైంది. జిగురులాంటి పదార్థాన్ని చేర్చి కిడ్నీ గ్లోమెరూలీ కణాలను ఎలుకల చర్మం అడుగు భాగంలోకి చొప్పించారు. మూడు నెలల తరువాత జరిపిన పరిశీలనలో అక్కడ కిడ్నీ కణజాలం అభివద్ధి చెంది ఉండటాన్ని తాము గుర్తించామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త వూల్ఫ్ తెలిపారు. రక్తాన్ని శుద్ధి చేసే నెఫ్రాన్లు కూడా ఇందులో ఉన్నాయని అన్నారు. మానవుల్లోని నెఫ్రాన్లతో దాదాపు సరిపోలిన కొత్త నెఫ్రాన్లలో రక్తనాళం ఒక్కటే తక్కువైందని, ఫలితంగా ఈ కణజాలం చాలా నెమ్మదిగా రక్తాన్ని శుద్ధిచేయగలదని వివరించారు. ఈ లోటును పూరించేందుకు శస్త్రచికిత్స నిపుణులతో కలిసి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పద్ధతిని మరింత అభివద్ధి చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా నిత్యం డయాలసిస్ చేయించుకుంటున్న దాదాపు 20 లక్షల మందికి మేలు చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.



వేళ్ల కదలికలతో కరెంటు...

స్మార్ట్‌ఫోన్ ఛార్జింగ్ తగ్గిపోతే ప్లగ్ ఎక్కడుందని వెతికే కాలం త్వరలోనే వెళ్లిపోనుంది. ఎందుకంటే మన కాళ్లు, వేళ్ల కదలికలతోనే గాడ్జెట్లకు కావాల్సినంత విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలు విజయవంతమయ్యాయి. కొన్ని రకాల ప్లాస్టిక్ సంచులను నలిపినప్పుడు వాటి ఉపరితలంపై స్టాటిక్ ఎలక్ట్రిసిటీ పుట్టే విషయాన్ని మనం గమనించే ఉంటాం. ఇలా జరగడాన్ని భౌతికశాస్త్ర పరిభాషలో ట్రైబోఎలక్ట్రిక్ ఎఫెక్ట్ అంటారు. అచ్చం ఇలాంటివే నానోస్థాయిలో తయారు చేసి వాడటం ద్వారా శరీర కదలికల ఆధారంగా విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చునని చైనీస్ అకాడమీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ ట్రైబోఎలక్ట్రిక్ జనరేటర్లలో రెండు పలుచటి బంగారు పొరల మధ్య పాలీడైమిథైలిసోక్సైన్ పొర ఉంటుంది. సుమారు 1.5 సెంటీమీటర్ల పొడవు... సెంటీమీటర్ వెడల్పు ఉన్న పట్టీతో 124 వోల్టుల విద్యుత్తు పుట్టించవచ్చునని కియాన్‌కియాంగ్ గాన్ అనే శాస్త్రవేత్త తెలిపారు. ఈ పరిశోధనలో ఒక్కో చదరపు సెంటీమీటర్ ద్వారా 0.22 మిల్లీవాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయింది. ఈ విద్యుత్తు స్మార్ట్‌ఫోన్‌ను ఛార్జ్ చేసేందుకు సరిపోకపోయినప్పటికీ 48 చిన్నసైజు ఎల్ఈడీ బల్బులు వెలిగేందుకు మాత్రం సరిపోయింది. ప్రస్తుతం తాము ఈ ట్రైబో ఎలక్ట్రిక్ జనరేటర్ల ద్వారా మరింత ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ విద్యుత్తును నిల్వ చేసుకునేందుకు సూక్ష్మస్థాయి బ్యాటరీ తయారీకి ప్రయత్నాలు సాగుతున్నాయని గాన్ చెప్పారు.



మునిగిపోతున్న ద్వీపం సైజు పెరుగుతోంది!

వినడానికి కొంచెం విచిత్రంగా అనిపిస్తుంది ఇది. ఆస్ట్రేలియాకు, జపాన్‌కు మధ్య తువలూ అనే ఓ ద్వీప దేశం ఉంది. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సముద్రమట్టాలు పెరిగితే మునిగిపోయే తొలి ద్వీపాలు ఇక్కడివేనని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. అయితే ఇటీవల ఆక్‌లండ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఇటీవల జరిపిన అధ్యయనం మాత్రం ఆశ్చర్యకరమైన ఫలితాలిచ్చింది. తువలూలోని మొత్తం 101 ద్వీపాల్లో కనీసం ఎనిమిదింటి సైజు పెరిగిందని తేలడంతో ఇదెలా సాధ్యమని శాస్త్రవేత్తలు తలగోక్కుంటున్నారు. 1971 నుంచి 2014 వరకూ తీసిన ఈ దేశపు ఉపగ్రహ ఛాయాచిత్రాలను పరిశీలించడం ద్వారా వాటి విస్తీర్ణం పెరుగుతున్నట్లు స్పష్టమైంది. మొత్తమ్మీద ఈ దేశపు మొత్తం భూ విస్తీర్ణం 2.9 శాతం వరకూ పెరిగిందని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త పాల్ కెంచ్ అంటున్నారు. సముద్రమట్టాలు పెరిగితే లోతట్టు ద్వీపాలు మునిగిపోతాయి. కానీ తువలూలోని ద్వీపాల విషయంలో దీన్ని భిన్నంగా జరిగింది. దీన్నిబట్టి ఈ ద్వీపసముదాయం నిత్యం మార్పులకు గురవుతోందని తెలుస్తోందని పాల్ చెప్పారు. సముద్రపు అలల తీరు తెన్నులతోపాటు తుఫానుల సమయంలో ఒడ్డుకు కొట్టుకువచ్చే మట్టి కారణంగా దీవుల విస్తీర్ణం పెరిగేందుకు అవకాశముందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.



సాక్షి ఫ్యామిలీ
సోమవారం
12-2-2018

ఈ వారం YouTube హిట్స్

ది వీసా ఇంటర్వ్యూ- షార్ట్ ఫిల్మ్


నిడివి: 10 ని. 10 సె.; హిట్స్: 14,94,800

‘వైవా’ హర్షా మళ్లీ ఎటాక్ చేశాడు. ఈసారి అమెరికా వెళ్లడానికి ఉవ్విళ్లూరేవాళ్లు వీసాకు అటెండ్ అయ్యి ఎలాంటి సమాధానాలు చెప్తారన్న కంటెంట్ మీద వ్యంగ్యం విసిరాడు. ఈ కామెడీ షార్ట్ ఫిల్మ్‌లో హర్షా ఎంబసీలో ఆఫీసర్‌గా కనిపిస్తే మిగిలిన నటులు వీసాకు హాజరైనవారుగా ఉంటారు. వీసా రావాలంటే ‘ఐ లవ్ మై ఇండియా’ అనాలనీ, ఏదో ఒక డిగ్రీ చదవే మిషతో అమెరికాకు వెళ్లి సెటిల్ అయిపోవచ్చని, ఎన్.ఆర్.ఐ వరుణ్ణి కట్టుకుని ప్రిస్టేజి కోసం అమెరికాలో సెటిల్ కావాలనుకునేవారి సమాధానాలన్నీ ఈ ఇంటర్వ్యూలో హాస్యం తెప్పిస్తాయి. వీటన్నింటికి మించి ‘ఫ్రీ చైతన్యా పారాయణ’ ప్రతినిధి వీసా కోసం రావడం ఆకట్టుకుంటుంది. అమెరికాలో ఫ్రీ చైతన్యా పారాయణ ఇన్‌స్టిట్యూట్స్ పెట్టి హాస్టల్స్ తెరిచి వంద మందిని కుక్కి రెండు మూడు ఆత్మహత్యలు చేయిస్తే తప్ప శాంతి లేదన్నట్టుగా ఆ ప్రతినిధి వీసాకు వస్తాడు. కానీ వీసా ఆఫీసర్ లక్కీగా అతడి వీసాను రిజెక్ట్ చేస్తాడు. అలరించిన ఈ షార్ట్ ఫిల్మ్ పోస్ట్ అయిన వెంటనే పది లక్షల హిట్స్‌కు చేరుకుంది.

సమంతా రంగస్థలం- టీజర్


నిడివి: 28 సె.; హిట్స్: 57,80,100

పల్లెటూరి అమ్మాయిలను పల్లెటూరి అమ్మాయిలుగా చూసి చాలా కాలం అవుతోంది. అయితే ‘రంగస్థలం’ ఎనభైల కాలం నాటి కథ కాబట్టి ఆ కాలం నాటి పల్లెటూరి ఆడపిల్లలు ఆ సినిమాలో కనిపించే అవకాశం ఉంది. ఆ మాటకు ఊతమిస్తూ ‘సమంతా’పై విడుదల చేసిన రంగస్థలం టీజర్ విడుదలైన వెంటనే భారీ హిట్ అయ్యింది. నడుము వయ్యారంగా తిప్పుతూ నీళ్ల చెరువులోకి వెళుతున్న సమంతా, సైకిల్ తొక్కుతున్న సమంతా, చాకిరేవులో బట్టలుతుకుతున్న సమంతా ‘ఈ పిల్ల ఎదురైతే మా ఊరికి పద్దెనిమిదేళ్ల వయసొచ్చేలా ఉంటుందండీ’ అని రామ్ చరణ్ డైలాగును నమ్మబలికేలా ఉంది. దాదాపు 50 లక్షల హిట్స్‌కు ఈ టీజర్ చేరువైంది.

గోల్డ్ - టీజర్


నిడివి: 1ని. 7 సె.; హిట్స్: 1,19,40,760

సినిమాటిక్ కథలతో విసిగిపోయిన బాలీవుడ్ బయోపిక్స్ వెంట గత చారిత్రక ఘటనల వెంట పరుగు తీస్తోంది. జనం ఆ సినిమాలను మెచ్చుకుంటున్నారు కూడా. తాజాగా ఇండియా హాకీ వెలుగులను తెలియచేసే ‘గోల్డ్’ అనే సినిమా రాబోతోంది. అక్షయ్‌కుమార్ ప్రధాన పాత్రధారి. భారతదేశం ‘బ్రిటీష్ ఇండియా’గా ఉన్నప్పుడు అనేక మెడల్స్ గెలిచింది. కాని స్వాతంత్ర్యం వచ్చాక 1948 ఒలింపిక్స్‌తో తొలి బంగారు పతకం గెలిచింది. ఆ పతకం గెలవడానికి భారత జట్టు ఎలాంటి కష్టనష్టాలు ఎదుర్కొన్నది అనేది కథ. ఆగస్టులో ఈ చిత్రం విడుదల కానుంది. ఆమిర్‌ఖాన్‌తో గతంలో ‘తలాష్’ తీసిన రీమా కాగ్తీ ఈ సినిమాకు దర్శకురాలు. కోటి హిట్స్‌ను దాటిపోయిన టీజర్ ఇది.

తూనీగలా పరిగెట్టే చురుకైన విరాళికి అకస్మాత్తుగా జ్వరం. 23 రోజులు కోమాలోకి తీసుకెళ్లిన ఆ జ్వరం... 24 గంటలూ చక్రాల కుర్చీకే పరిమితమయ్యేలా చేసింది. వైకల్యం కాళ్లకే గానీ... మనసుకూ, మనిషికీ కాదని గ్రహించాక ఇక వెనుదిరిగి చూడలేదు. మోడలింగ్ చేయాలన్నది ఆమె కల. మనసుకు రెక్కలు మొలిచి... పట్టుదలను చేతుల చేతలకు ఆవాహన చేసుకుంటే... కలలకు కాళ్లొచ్చి లక్ష్యం దాకా తీసుకెళ్తాయని తెలిసింది విరాళికి. అదెలా...? ‘మిస్ ఇండియా వీల్‌చైర్ పాజెంట్’కు ఎంపిక కావడం ద్వారా!!



కలలకు కాళ్లొచ్చాయి!

‘‘నీకు నువ్వు ముఖ్యం. ముందు నీ మీద నువ్వు దృష్టిపెట్టడం మొదలుపెట్టు. సమాజాన్ని మెప్పించాలని ప్రయత్నించకు. అందులోపడి నీ సంతోషాన్ని దూరంచేసుకోకు. శారీరక వైకల్యం నిజంగా వైకల్యమే కాదు. కరుణ, దయ, ప్రేమ లేకపోవడమే అసలైన వైకల్యం! కలల మజిలీ చేరడానికి, లక్ష్యసాధనకు శారీరక వైకల్యం అడ్డే కాదు. ఆత్మస్థయిర్యం ఎంతదూరాన్నైనా నడిపిస్తుంది. ఎన్ని అడ్డంకులనైనా ఎదిరిస్తుంది. ఎన్ని సమస్యలనైనా జయిస్తుంది. నీ హక్కును పొందే వరకు పోరాడుతూనే ఉండు!’’ తన రైటప్ పూర్తి చేసి మళ్లీ ఒక్కసారి చదువుకుంది. సంతృప్తి, ఆత్మవిశ్వాసంతో కూడిన నవ్వు ఆ ముఖంలో! తను పంపించాల్సిన వెబ్‌సైట్‌కు పోస్ట్ చేసింది. పర్సనల్ కంప్యూటర్‌ను టర్నాఫ్ చేసి వీల్‌చైర్‌ని వెనక్కి తిప్పింది తన గదిలోకి వెళ్లడానికి ఆమె. పేరు విరాళి మోది. ప్రస్తుతం ఇండియాలోనే ఉంటోంది. కాని అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలో పెరిగింది.



నేపథ్యం: విరాళి వాళ్ల కుటుంబం ప్రతి యేడాది అమెరికా నుంచి ముంబై (స్వస్థలం) వచ్చేది సెలవులు గడపడానికి. అలా తనకు పధ్నాలుగేళ్ల వయసు (2006)లో కూడా ఒకసారి వచ్చింది. అది వర్షాకాలం. సెలవులు గడిపింది. మళ్లీ అమ్మానాన్నతో కలిసి అమెరికా వెళ్లిపోయింది. అక్కడికెళ్లాక ఆమెలో అనారోగ్యం బయటపడింది. ఉన్నట్టుండి విపరీతమైన తలనొప్పితో జ్వరం మొదలైంది విరాళికి. పిల్లల డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు ఆమె తల్లిదండ్రులు. ‘‘ఏం పర్వాలేదు.. సీజనల్ చేంజ్ వల్ల ఇలా అయింది. నాలుగు, ఆరు గంటలకు ఒకసారి ఈ మాత్రలు వాడండి. అంతా నార్మల్ అయిపోతుంది. భయపడొద్దు’’ అని చెప్పి పంపేశాడు డాక్టర్. ఇంటికెళ్లాక విరాళి పరిస్థితి ఇంకా దిగజారింది. అప్పుడే ఒళ్లంతా కొలిమిలా కాలిపోయేది. ఇంకో రెండుగంటలకు మంచులా చల్లబడేది. విరాళి తల్లిదండ్రులకు భయమేసింది. డాక్టర్ దగ్గరకు మళ్లీ పరిగెత్తారు. పాప కండిషన్ సీరియస్‌గా ఉంది. ఆసుపత్రిలో హడావిడి మొదలైంది. అమ్మాయి స్పృహ తప్పింది. పల్స్ పడిపోతోంది. గుండె ఆగింది. మూడు ఎలక్ట్రిక్ షాక్స్ ఇచ్చి తిరిగి గుండె కొట్టుకునేలా చేశారు. కాని శ్వాస తీసుకోలేకపోతోంది. హార్ట్ మానిటర్స్‌ను అమర్చారు. బ్లడ్‌ప్రెషర్ మెషీన్ పెడుతూనే ఐసీయూలోకి మార్చారు. స్పృహ లేదు. అలా 24 గంటలు గడిచాయి. అయినా ఈ లోకంలోకి రాలేదు విరాళి. కోమా అన్నారు డాక్టర్లు. 23 రోజులు కోమాలోనే ఉంది. 24వ రోజు విరాళి బర్త్‌డే. కళ్లు తెరవకపోయినా కూతురికి పుట్టినరోజు జరపాలనుకుంది. భర్తతో చెప్పింది. సరే అన్నాడు. డాక్టర్ల అనుమతీ తీసుకుంది. అమెరికాలోని తన దగ్గరి స్నేహితులను, బంధువులను పిలిచింది.

ఆ రోజు..: విరాళికి ఇష్టమైన వంటలను వండింది. కేక్ తెచ్చారు. ఆసుపత్రిలో విరాళి గదిని డెకరేట్ చేశారు. నర్సుల సహాయంతో విరాళికి స్పాంజింగ్ చేసి కొత్త బట్టలు వేసింది. కరెక్ట్‌గా పధ్నాలుగేళ్ల కిందట ఆమె పుట్టిన సమయానికి విరాళితో కేక్ కట్ చేయించారు. విరాళిలో చిన్న కదలిక. ఆ తల్లి దృష్టిలో పడ్డా... 23 రోజుల్నించి ఇలాంటి భ్రమలు ఆమెను చాలా ఆశపెట్టాయి. అందుకే పట్టించుకోలేదు. కాని పడుకున్న ఆ శరీరంలో మళ్లీ చిన్న కదలిక. ఈసారి ఆ తల్లి మనసు ఆత్రంగా కళ్లు చేసుకొని చేసుకొని చూసింది. హ్యాపీ బర్త్‌డే టూ యూ విరాళీ అని పాడుతున్న స్నేహితులు, బంధువులను ‘హుష్... ’ అంటూ నోటి మీద వేలేసి చూపిస్తూ ఆపింది. అందరూ ఒక్కసారిగా ఆపేసి ఆమెనే చూశారు. ఆమె విరాళిని చూసింది. విరాళి తల తిప్పింది కుడి నుంచి ఎడమవైపు. ‘బేటా... ’ ఆనందోద్వేగంతో కేక విరాళి తల్లిది. అందరి దృష్టి అటువైపే. బిడ్డ కదిలింది. వెంటనే కళ్లూ తెరిచింది. కనుబొమలు ముడి వేసింది. ‘‘నేనురా.. అమ్మను.. ’’ ఆమెను తోసేస్తూ.. ‘‘బేటా.. మై పాపా’’వాళ్ల నాన్నా.. ఆయనను తోసేస్తూ ‘‘వీరూ బేటా.. మై చాచా’’ ఇలా అందరూ ఒకర్ని కాదని ఇంకొకరు. విరాళిని ఈ లోకంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. విరాళికి అలసటగా ఉంది. మళ్లీ కళ్లు మూసుకుంది. అందరిలో కంగారూ. డాక్టర్లు పరిగెత్తుకొచ్చారు. చకచకా టెస్టులు మళ్లీ. తల్లిదండ్రుల్లో ఆందోళన ఏం చెప్తారో డాక్టర్లు అని. ‘‘అమ్మాయి కోమాలోంచి బయటకు వచ్చింది. కానీ... ’ అని ఆగారు. ‘‘కానీ ఏంటీ’’ భయంగా పేరెంట్స్. మెడ నుంచి కింద వరకు పారలైజ్ అయిపోయింది. కదల్లేదు. దాదాపు జీవితాంతం వీల్ చెయిరే’’ చెప్పారు డాక్టర్లు. కుప్పకూలిపోయారు తల్లిదండ్రులు. ఈ విషయం తెలియని విరాళి తన బర్త్‌డేకు వచ్చిన వాళ్లందరినీ గుర్తుపట్టే ప్రయత్నం చేస్తోంది.

కలల నడక ఆగలేదు: విరాళికి మోడల్ కావాలని, సినిమాల్లో నటించాలని చిన్నప్పటి నుంచీ కల. దానికోసం స్కూలింగ్ అయిపోగానే ట్రెనింగ్ తీసుకోవాలని కూడా నిర్ణయించుకుంది. తల్లిదండ్రులూ ఆమె కోరికను కాదనలేదు. కాని ఇప్పుడు తను అసలు నడవలేదని తెలిస్తే బిడ్డ తట్టుకుంటుందా? అయినా చెప్పక తప్పలేదు. చెప్పారు.


తను నడవలేదు. జీవితమంతా వీల్ చైర్ ఆసరానే అనే నిజాన్ని విరాళీకి చెప్పారు. షాక్ అయింది. ఆ షాక్‌లోనే హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికొచ్చింది. డిప్రెషన్‌తో కుంగిపోయింది. మళ్లీ దానికి ట్రీట్‌మెంట్ / మాత్రలు... హాస్పిటల్.. విసుగొచ్చింది విరాళికి. ఇది కాదు తన జీవితం! ఇలా బతకాలని అనుకోలేదు! మారాలి! ఇంకొకరి సానుభూతితో ఎన్నాళ్లు బతుకీడుస్తుంది? కాళ్ళు లేకపోతే ఏం? మనసుకు రెక్కలున్నాయి. మెదడుకు శక్తి ఉంది! ఎక్కడికైనా వెళ్లగలుగుతుందీ... ఏమైనా చేయగలుగుతుంది. ఆ ధైర్యం తను ఉన్న స్థితిని అంగీకరించేలా చేశాయి. తర్వాత ట్రీట్‌మెంట్‌కు శరీరాన్ని సిద్ధం సింది. కొంత కొంతగా మార్పు వచ్చింది. కాని చక్రాల కుర్చీ వీడేంతగా కాదు. మోడలింగ్.. నటన.. తన లక్ష్యం! తిరిగి ముంబైకి వచ్చేసింది. మోడలింగ్ అవకాశాలకోసం ఫోటో షూట్ మొదలుపెట్టింది.

ఈ క్రమంలోనే ఇండియాలో వికలాంగులకోసం సరైన ప్రయాణ వసతి లేదని ప్రాక్టికల్‌గా అనుభవించి, అర్థం చేసుకుంది. వాళ్ల హక్కులకోసం పోరాడ్డం ప్రారంభించింది. ఆ పోరాట ఫలితం కేరళలోని ఎర్నాకులంలో వికలాంగుల కోసం దేశంలోనే మొట్టమొదటి రైల్వేస్టేషన్ స్టార్టవడం.

ఇంకోవైపు తన కలల సాధన పట్టాలెక్కింది. 2014లో ‘మిస్ ఇండియా వీల్‌చైర్ పాజెంట్’గా కూడా ఎన్నికైంది. అందుకే అంటుంది.. వైకల్యం శరీరానికి ఉండదు అని!

- శరాది

హెల్దీ స్కూల్స్ — అవి పర్యావరణహిత పాఠశాలలు



ఆ రెండు పాఠశాలల్లో స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకోవచ్చు. వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం కనిపిస్తుంది. జలసంరక్షణ ఆనందాన్నిస్తుంది. ఈ కార్యక్రమాలన్నీ జరుగుతున్న అవేమీ కార్పొరేట్ పాఠశాలలు కావు. అవి కేంద్రీయ విద్యాలయాలు.
కేంద్రీయ విద్యాలయ యాజమాన్యం... వ్యర్థాల నిర్వహణ, వాతావరణం కలుషితం కాకుండా చూడడం, జల సంరక్షణ, తదితర అంశాలపై కొన్ని నిర్దేశాలను తన పరిధిలోని పాఠశాలలకు పంపింది. వాటి ఆచరణలో రెండు పాఠశాలలు 70 శాతం మార్కులతో ముందు నిలిచాయి. అవి రెండూ కేరళలోని పగోడ్, ఒట్టపాళియం స్కూళ్లు! బడి విడిచిపెట్టే 5 నిముషాలు వ్యర్థాల సేకరణ జరుగుతుంది. దాంతో రోజుకు 10కిలోల గ్యాస్ ఉత్పత్తవుతోంది. ఈ గ్యాస్‌తో స్కూలు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ విద్యుదవసరాలు తీరుతున్నాయి. ఇక వ్యర్థ జలాలను వృథాగా పోనీయకుండా, శుద్ధిచేసి, మరుగుదొడ్లలో, స్కూలును శుభ్రపరచడానికీ వినియోగిస్తున్నారు. మొక్కలకూ ఈ నీరే.

విద్యార్థులు స్కూలుకు వచ్చేందుకు పెట్రోలు వాహనాలు కాకుండా సైకిళ్ళను ఉపయోగిస్తున్నారు. ఈ స్కూళ్లలో ప్లాస్టిక్ వినియోగం కనిపించదు. మనసుంటే మార్గముంటుందని నిరూపిస్తున్న ఈ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇతర పాఠశాలలకు దారి చూపుతున్నాయి. హరితావరణలను ప్రోత్సహించేందుకు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సిఎస్ఇ) గ్రీన్ స్కూల్స్ ప్రోగ్రామ్ (జిఎస్‌పి) విధానాన్ని అవలంబిస్తున్న... 54 స్కూళ్లలో కేరళలోని పగోడ్, ఒట్టపాళియం కేంద్రీయ విద్యాలయాలు ప్రథమ స్థానంలో నిలిచాయని సిఎస్ఇ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్



డాక్టర్ ఇ.సి. వినయ కుమార్
హెచ్‌ఓడి & ఈఎన్‌టి సర్జన్,
అపోలో హాస్పిటల్స్,
హైదరాబాద్

ముక్కులు మూసుకుపోతున్నాయి ఫ్రీ అయ్యేదెలా..?

నా వయసు 26 ఏళ్లు. నా ఎడమ చెవిలో వినికిడి సమస్యతో గత రెండేళ్లుగా బాధపడుతున్నాను. కుడి చెవి బాగానే ఉంది. పదిహేను రోజుల క్రితం ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాను. ఆయన నా చెవులను పరీక్షించి ఎడమ చెవిలో ఎముక కొద్దిగా మందం అయింది, అందువల్లనే మాటలు అర్థం చేసుకోలేకపోతున్నానని చెప్పారు. అంతేకాకుండా ఈ సమస్య చాలా అరుదుగా వస్తుందని, లేజర్ సర్జరీ అవసరం కావచ్చని చెప్పారు. కొన్ని మందులు రాశారు. నా సమస్య ఏమిటో నాకు అర్థం కావడం లేదు. ఇప్పుడు నేనేం చేయాలి? నాకు లేజర్ సర్జరీ అవసరమవుతుందా?

– మదన్‌మోహన్, నల్లగొండ

మీ సమస్యను విశ్లేషించడానికి మీరు ఇచ్చిన వివరాలు సరిపోవు. మీరు మొదట ఆడియాలజీ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. వాటిలో మీకు ఉన్న సమస్య తీవ్రత ఎంత, చెవిలోని ఏ భాగంలో సమస్య ఉంది అన్న వివరాలు తెలుస్తాయి. అయితే... మీరు చెప్పిన వివరాలను బట్టి చూస్తే మీరు ‘ఓటోస్క్లిరోసిస్’ అనే సమస్య ఉన్నట్లు అనిపిస్తోంది. మధ్య చెవిలోని ఎముకల గొలుసులో ఉండే చిన్న ఎముక అయిన ‘స్టెపీస్’లో ఒక ఎముక మందం కావడం, స్పాంజిజోన్ పెరగడం వల్ల ఈ సమస్య వస్తుంది. ఇది ఉన్నవారికి శబ్దం, మాటలు వినిపిస్తాయి. కానీ అవి అర్థం కావు. సమస్య తీవ్రత పెరిగే కొద్దీ వినికిడి సమస్యలు కూడా పెరుగుతాయి. మీరు వెంటనే ప్యూటర్‌టోన్ ఆడియోమెట్రీ, ఇంపిడెక్స్ ఆడియోమెట్రీ, ఓటోస్కోపీ మొదలైన పరీక్షలు చేయించుకోవాలి. అవసరాన్ని బట్టి సీటీ స్కాన్ చేయించి మీ సమస్యను నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమస్యలు సాధారణంగా మందులతో తగ్గవు. సమస్య తీవ్రతను, పరిస్థితిని బట్టి చేయాలో నిర్ణయించాల్సి ఉంటుంది. ఒకవేళ మీకు పైన చెప్పిన సమస్య ఉన్నట్లయితే మీరు హియరింగ్ ఎయిడ్ వాడటం లేదా ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఉండవచ్చు.

ముక్కుఎప్పుడూ ఏదో అడ్డండి తగ్గేదెలా?

నాకు ముక్కులో ఎప్పుడూ ఏదో అడ్డం పడినట్లుగా అనిపిస్తుంది. ఎంత ప్రయత్నించినా ఈ సమస్య వదలడం లేదు. చాలా రకాల మందులు వాడాను. మార్కెట్‌లో దొరికే చుక్కల మందు వాడుతున్నాను. అది వాడినప్పుడు మాత్రం సమస్య తగ్గినట్లే తగ్గి మళ్లీ వస్తోంది. ఆ మందుకు అలవాటు అవుతానేమో అని మానేశాను. రాత్రిపూట రెండు ముక్కు రంధ్రాలు మూసుకుపోతున్నాయి. చాలాసార్లు నోటితో గాలి తీసుకోవాల్సి వస్తోంది. నా సమస్య ఏమిటి? దీనికి తగిన పరిష్కారం తెలియజేయగలరు.

– పి. సూర్యనారాయణ, నెల్లూరు

ఈమధ్య కాలుష్యం వల్ల, జీవనశైలిలో మార్పుల వల్ల చాలామందిలో అలర్జీ సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలర్జీ సంబంధిత సమస్యలలో మొదట ఉండేది ముక్కుకు సంబంధించిన సమస్యలే. మీరు చెప్పిన వివరాలను బట్టి మీకు ముక్కుదూలం వంకరపోవడం లేదా అలర్జీ లేదా ముక్కులో పాలిప్స్ లేదా ఈ అన్ని సమస్యలు కలగలిసి ఉండవచ్చు. మీరు మొదట నిపుణులైన ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించి ముక్కుకు సంబంధించిన పరీక్షలు చేయించి, అవసరమైతే సీటీ స్కాన్ (పీఎన్ఎస్) కూడా తీయించాక మీ వ్యాధిని నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

మీకు ముక్కుదూలం వంకరపోతే దాన్ని ఒక చిన్న ఆపరేషన్‌తో సరిచేయవచ్చు. దీనినే సెప్టోప్లాస్టీ అంటారు. లేదా ముక్కులో పాలిప్స్ ఉన్నట్లయితే వాటిని కూడా ఆపరేషన్‌తో తొలగించవచ్చు. అలర్జీ వల్ల వచ్చే సమస్య అయి ఉంటే అందుకు కారణమైన అంశాలకు దూరంగా ఉండటం, ముఖ్యంగా కాలుష్యానికి దూరంగా ఉండటం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాజా పదార్థాలు మాత్రమే తినడం, చల్లటి వాతావరణానికి, వస్తువులను దూరంగా ఉండటం వంటి చేయడం వల్ల మీ సమస్యను నివారించవచ్చు. కొన్ని రకాల నేసల్ స్ప్రేలు వాడటం వల్ల మీ సమస్యను అదుపులో ఉంచవచ్చు.

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 02


● మృణాళిని

ప్రిన్సిపల్‌లో తేడా



కాలేజీకి కొత్త ప్రిన్సిపాల్ వస్తున్నట్టు ఉప్పందింది. అదీ ఒక ఆడ ప్రిన్సిపాల్ రాబోతున్నట్టు గుప్పుమంది. ఇది తెలిసి ఒక మగాడు ఉసూరుమంటే ఒక మగాడు హుషారు పడ్డాడు.

‘ఇంతబతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టు ఒక ఆడ ప్రిన్సిపాల్ కింద పని చేయాలా?’ అన్నాడు ఒక మగ లెక్చరర్.

‘అయితే ఏమిటోయ్. మన పని ఈజీ కాలేదూ’ అన్నాడు మరో మగ లెక్చరర్.

స్టాఫ్‌రూమ్‌లో అంతా సందడి సందడిగా ఉంది.

‘ఏం ఈజీ’ అన్నాడు మగ లెక్చరర్.

‘వచ్చినామె డ్యూటీ చేస్తుందనుకున్నావా? లీవులు పెట్టడమే సరిపోతుంది’ అన్నాడు ఈ లెక్చరర్.

‘ఎందుకు పెడుతుందండీ’ అన్నారెవరో.

‘మరి? చీటికిమాటికి లీవు పెట్టడమేగా ఆడవాళ్ల పని. పూజలనీ, వ్రతాలనీ, తద్దినాలనీ, పిల్లలకు జ్వరాలనీ, ఊర్నుంచి అత్తగారు వచ్చారనీ... సీటులో ఎప్పుడు ఉండి చస్తారు కనుక. సెలవు ముందుపుట్టి ఆడవాళ్లు ఆ వెంటనే పుట్టారు’ అన్నాడతడు.

అంతటితో ఆగలేదు. థియరీ చెప్పాడు.

‘ఇక వీళ్లు టైమ్‌కు రావడం గగనం. పిల్లలను స్కూళ్లకు పంపి, మొగుళ్లను రెడీ చేసి, అద్దం ముందు నిలబడి గంటలు గంటలు సింగారించుకుని వచ్చేసరికి పుణ్యకాలం కాస్త పూర్తయిపోతుంది. ఈలోపు మనదే రాజ్యం. మాహిష్మతి మనదే కట్టప్పా’

చాలా హుషారుగా ఉన్నాడతను. కారణం ఉంది. కాలేజీలో ఆల్రెడీ ఒక లేడీ లెక్చరర్ వైస్ ప్రిన్సిపాల్‌గా ఉంది. ఇప్పుడు ప్రిన్సిపాల్‌గా ఇంకో లేడీ వస్తే అది కోఎడ్యుకేషన్ కాలేజీ కనుక ఇద్దరూ ఆడవాళ్లుండటం సమ్మతం కాదు కనుక వైస్ ప్రిన్సిపాల్ పోస్ట్ తనకే వస్తుందని ఇతని ధీమా.

‘ఆవిడగారు లీవు పెట్టినప్పుడల్లా నేనే కదా బాసు. అప్పుడు చూపిస్తా తడాఖా’ అన్నాడు.

ఈ మాట మగ లెక్చరర్లను ఆలోచనలో పడేసింది.

‘నువ్వే బాస్ అయితే గనక మమ్మల్ని కొంచెం చూసీ చూడనట్టుగా వదిలేస్తావుగా’ అన్నాడొకడు.

‘క్లాస్ సగంలో ఉండగా బయటికొచ్చి సిగరెట్లు కాల్చుకోవచ్చుగా?’ అని అడిగాడు ఇంకొకడు.

‘సంతకం పడేసి క్లబ్బుకు వెళ్లొచ్చు కదా’ అన్నాడు ఒకడు.

‘నేనసలు క్లాసులే తీసుకోను’ అన్నాడు వేరొకడు.

ఈ పరిపరి విన్నపాలు విని చిద్విలాసంగా అభయం ఇచ్చాడు లెక్చరర్.

శుభముహూర్తం వచ్చింది.

మగ లెక్చరర్లకు మళ్లీ ఉప్పందింది.

లేడీ ప్రిన్సిపాల్ ఉదయం ఎనిమిది గంటలకే వచ్చేసిందట. బాప్ రే వచ్చేసిందా. ఆ రోజంతా కాలేజీ హడావిడి హడావిడిగా ఉంది. లేడీ ప్రిన్సిపాల్ అసలు తన రూమ్‌లోనే కూచోలేదు. కాలేజ్ అంతా తిరుగుతూనే ఉంది. క్లాసులు మానిటర్ చేసింది. లెక్చరర్లు ఎంతసేపు క్లాసు చెపుతున్నారో గమనించింది. అసలు ఎలా చెబుతున్నారో గమనించింది. దొంగ పర్మిషన్లు బుట్టదాఖలు అయ్యాయి. సిక్ లీవ్‌లో ఉన్న లెక్చరర్ క్లాసును తనే తీసుకుని చెప్పినప్పుడు ఆ వాగ్ధాటికి పిల్లలు రెప్పవేయకుండా విన్నారన్న వార్త కూడా కారిడార్లలో పాకి అక్కడి నుంచి ఒకరిద్దరి వెన్నులో కూడా పాకింది. సాయంత్రం అయిదున్నరకి స్టాఫ్‌తో చిన్న మీటింగ్.

‘ఇన్ని రోజులు ఎలా గడిచాయో తెలియదు నాకు. ఇక మీదట ఇవాళ గడిచినట్టు గడుస్తాయి’ అంది.

మగలెక్చరర్ల ముఖాలు మెల్లగా మాడిపోయాయి.

వైస్ ప్రిన్స్‌పాల్ పోస్టు ఆశించిన లెక్చరర్ మనసులో ఆశ మినుకుమినుకుమంటోంది.

‘మరి వైస్‌ప్రిన్సిపాల్ సంగతి?’ నసిగాడు.

‘ఏంటి ప్రాబ్లమ్?’ అడిగిందామె.

‘ఇంకా పాత ముతక సామెతల్లోనే ఉన్నారా? రెండు కొప్పులకు పడదని భావిస్తున్నారా? ఇక్కడకు వచ్చేముందే వైస్ ప్రిన్స్‌పాల్ గురించి తెలుసుకున్నాను. ఆమె చాలా బాగా పని చేస్తున్నదని రిపోర్ట్ ఉన్నాయి. వైస్ ప్రిన్స్‌పాల్‌గా ఆమే కంటిన్యూ అవుతుంది. ప్రిన్స్‌పాల్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా మగాళ్లే ఉండి కాలేజీలు నడుపుతున్నప్పుడు మేమెందుకు నడపకూడదు. ఇంకా బాగా నడిపి చూపిస్తాం’ అంది.

మగాళ్లు పూర్తిగా నేల కరుచుకుపోయారు.

మెల్లగా లేచారు వెళ్లడానికి.

‘కూర్చోండి. ఎక్కడకు వెళతారు. చాయ్ తాగరా’ అందామె.

‘చాయ్ తాగడానికి ఇంతకుమించిన అకేషన్ ఏముంది?’ అని తిరిగి రెట్టించింది.

‘అవునవును ఏముంది’ అని చతికిలపడ్డారు మగలెక్చరర్లు.

ఆనాటి పొగలు కక్కే చాయ్ వాళ్లకు చాలారోజుల పాటు గుర్తుండిపోయింది.

కథ ముగిసింది.

మృణాళిని రాసిన ‘లేడీ బాస్’ కథ ఇది.

బాస్ అంటే ప్యాంటూ షర్టూ వేసుకుని ఉండాలన్న అభిప్రాయం మగాళ్లలో పాతుకుపోయింది. మీసం ఉండాలని, మగవాడు అయి ఉండాలని, మగవాడి కిందే పని చేయాలని.... ఇంట్లో నాన్న పెత్తనం అలవాటయ్యి ఆఫీసులో మగ పెత్తనం ఆశిస్తారు. సంతకం పెట్టే చేయికి, నిర్ణయం తీసుకునే బుర్రకి స్త్రీ, పురుష తేడా ఎందుకుంటుంది అనే ఆలోచన లేదు.

డాబా మీద వడియాలు ఆరవేయడానికి వెళ్లినప్పుడు మాత్రమే స్త్రీలు ఆకాశం వైపు చూడాలనుకునే మగవారు అంతరిక్షంలో చక్కర్లు కొట్టిన సునీతా విలియమ్స్ వంటివారిని మెడనొప్పి పుట్టినా సరే చూడక తప్పదు.

రోజులు మారాయి.

అదిగో సుఖోయ్ విమానంలో నిర్మలా సీతారామన్.

పునః కథనం: ఖదీర్

ఆస్కార్ 2018

కొత్త బెస్ట్ యాక్టర్!!




ఈరోజుకి ఇరవై రోజులు ముందుకెళ్తే లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఓ పెద్ద వేడుకను సినీ అభిమానులంతా చూస్తూ కూర్చుంటారు. ఆ వేడుక పేరే ఆస్కార్స్. హాలీవుడ్ అంతా ఈ వేడుక కోసం ఎదురు చూస్తోంది. "అండ్ ది అవార్డ్ గోస్ టూ.." అన్న లైన్ ఇరవై నాలుగుసార్లు వినిపిస్తుంది ఆ రోజు. అందులో బెస్ట్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్ అవార్డుల తర్వాత ఆ లైన్లో అందరూ ఎదురు చూసే మూడో విభాగం బెస్ట్ యాక్టర్. ఎప్పట్లానే ఈసారి కూడా బెస్ట్ యాక్టర్ లిస్ట్‌లో గట్టి పోటీనే ఉంది. ఐదుగురిలో ఇద్దరు ఫస్ట్ టైమ్ నామినేషన్ పొందినవారు కావడం ఇక్కడ విశేషం. అలాగే వాళ్లిద్దరిలోనే ఒకరికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని సినీ పండితులు లెక్కలేస్తూ ఉండడం మరింత విశేషం. నామినేషన్స్ దక్కించుకున్నది ఎవరెవరో చూద్దాం...



తిమోతీ ఛాలమేట్ ('కాల్ మీ బై యువర్ నేమ్')

ఈ ఏడాది బెస్ట్ యాక్టర్‌కు నామినేషన్స్ దక్కించుకున్నవారిలో చిన్నవాడు తిమోతీ. 22 ఏళ్లు ఇతనికి. ఇంతకుముందు ఎప్పుడూ నామినేషన్ దక్కించుకోలేదు. అవార్డు గనక ఇతనికే వస్తే అతి చిన్న వయసులో బెస్ట్ యాక్టర్‌గా ఆస్కార్ అందుకున్నవాడిగా రికార్డులకెక్కుతాడు. 'కాల్ మీ బై యువర్ నేమ్' సినిమాలో తిమోతీ ఒక టీనేజ్ బాయ్‌గా నటించాడు. అందరూ అద్భుతంగా నటించిన సినిమాలో తిమోతీ వాళ్లందరినీ మరిపించేలా నటించాడని విమర్శకులు ప్రశంసల వర్షం కురిపించారు. ఆస్కార్ రేసులో అందరికంటే తిమోతీనే ముందున్నాడని చెప్పుకోవచ్చు. మరి ఆస్కార్ అతన్ని వరిస్తుందా?



డేనియ్ డే లూయీజ్ ('ది ఫాంటమ్ థ్రెడ్')

1950 కాలంలో నడిచే 'ది ఫాంటమ్ థ్రెడ్' అనే సినిమాలో ఓ ఫేమస్ డ్రెస్‌మేకర్‌గా లూయిజ్ కనిపించాడు. ఈ పాత్రలో ఆయన నటనకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. లూయిజ్ ఇప్పటికే మూడుసార్లు బెస్ట్ యాక్టర్‌గా అవార్డు అందుకున్నాడు. అతని నటన గురించి ప్రత్యేకించి ఈరోజు చెప్పుకోవడానికి ఏమీ లేదు. 'మై లెఫ్ట్ ఫూట్' (1990)తో 18 ఏళ్ల క్రితమే ఆస్కార్ అందుకొని అప్పట్నుంచీ ఆయన తానేంటో నిరూపించుకుంటూ వస్తున్నాడు. 'దేర్ విల్ బి బ్లడ్' (2003), 'లింకన్' (2013) తర్వాత ఇప్పుడు మళ్లీ ఆస్కార్ కొడితే లూయిజ్‌కి ఇది నాలుగో ఆస్కార్ అవుతుంది. ఇవి కాకుండా లూయిజ్.. 'నేమ్ ఆఫ్ ది ఫాదర్' (1994), 'గ్యాంగ్స్ ఆఫ్ న్యూయార్క్' (2003) సినిమాలకు నామినేషన్స్ దక్కించుకున్నాడు.




డేనియల్ కలూయా ('గెట్ ఔట్')

డేనియల్ కలూయా బెస్ట్ యాక్టర్‌గా నామినేషన్స్ దక్కించుకున్న చిన్నవాళ్ల లిస్ట్‌లో ఉంటాడు. ఇతనికిప్పుడు 28 ఏళ్లు. 'గెట్ ఔట్' సినిమాకు గాను డేనియల్ కలూయా ఈ నామినేషన్ దక్కించుకున్నాడు. ఇది ఇతనికి ఫస్ట్ నామినేషన్. ఒకవేళ ఇతనే గనక అవార్డు దక్కించుకుంటే బెస్ట్ యాక్టర్‌గా ఆస్కార్ అందుకున్న అతి చిన్నవాడిగా రికార్డులకెక్కుతాడు. తెల్లజాతి అమ్మాయిని ప్రేమించిన నల్లజాతి అబ్బాయి, ఆ అమ్మాయి ఇంటికి వెళ్లడం, వాళ్ల ఫ్యామిలీని కలుసుకోవడం.. ఈ క్రమంలో కథ రకరకాల మలుపులు తిరగడమే సినిమా. డేనియల్ నటనకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. లిస్ట్‌లో గట్టి పోటీ ఇచ్చేట్టే కనిపిస్తున్నాడు. తిమోతీ, కలూయా.. ఇద్దరిలో ఎవరో ఒకరు ఆస్కార్ దక్కించుకుంటారని ఎక్కువమంది అంచనా. ఎవరు దక్కించుకున్నా ఆస్కార్ అందుకున్న చిన్న వయసు యాక్టర్‌గా రికార్డు దక్కించుకుంటారు.



గ్యారీ ఓల్డ్‌మన్ ('డార్కెస్ట్ అవర్')

'టింకర్ టైలర్ సోల్జర్ స్పై' (2012) సినిమాకుగాను గతంలో గ్యారీ ఓల్డ్‌మన్ ఒకసారి ఆస్కార్‌కు నామినేట్ అయ్యాడు. కాకపోతే అప్పుడు అవార్డు ఆయనను వరించలేదు. ఈసారి 'డార్కెస్ట్ అవర్'తో ఓల్డ్‌మన్ తన రెండో ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్నాడు. ఈసారి గ్యారీ ఓల్డ్‌మన్ ఆస్కార్‌ను అందుకుంటాడా? లేదా? అన్నది ఇప్పుడు ఆసక్తికరం. ఈ మధ్యే ఇదే సినిమాకుగాను బెస్ట్ యాక్టర్‌గా గ్యారీ గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకున్నాడు. దీంతో ఆస్కార్ కూడా ఈయన్నే వరిస్తుంది అనేవారు కూడా చాలామందే ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా నడుస్తుంది. అప్పటి బ్రిటీష్ ప్రధానిగా విన్‌స్టన్ చర్చిల్ తీసుకునే ఒక కీలక నిర్ణయం చుట్టూ సినిమా నడుస్తుంది.



డెంజెల్ వాషింగ్టన్ ('రోమన్ జె. ఇజ్రాయెల్ ఎస్క్')

డేనియల్ లూయిజ్ తర్వాత ఈ లిస్ట్‌లో ఆస్కార్‌కు దగ్గరి వ్యక్తి అంటే డెంజెల్ వాషింగ్టన్. గతంలో గ్లోరీ (1989), ట్రెనింగ్ డే (2002) సినిమాలకు ఆస్కార్ అందుకున్న డెంజెల్, ఇవి కాకుండా ఎనిమిది నామినేషన్స్ కూడా దక్కించుకున్నాడు. నామినేషన్స్, అవార్డులు కలిపి చూస్తే ఈ లిస్ట్‌లో ఆస్కార్‌కు బాగా దగ్గరి వ్యక్తి అంటే డెంజెల్ అనే చెప్పుకోవాలి. తన జీవితాన్నంతా న్యాయం కోసం పోరాడటానికే అంకితం ఇచ్చేసిన న్యాయవాది పాత్రలో డెంజిల్ ఈ సినిమాలో కనిపిస్తాడు.

ఆస్కార్ 2018 'బెస్ట్ యాక్టర్ అవార్డు' ఎవరికి వస్తుందనే దానిపై ఎన్ని చర్చలు జరిగినా, అసలు ఫలితం తేలాలంటే మార్చి 4 వరకూ ఆగాల్సిందే! ఈ ఐదుగురూ ఎవరికి వారే గట్టి పోటీ ఇచ్చేవాళ్లే కావడంతో 'అండ్ ది అవార్డ్ గోస్ టూ..' అనే టైమ్‌కి ఎవరు లేచి నిలబడి, స్టేజ్ వరకూ వెళ్లి అవార్డు అందుకుంటారో వేచి చూడాలి!!

మార్వెల్ అద్భుతం.. బ్లాక్‌పాంథర్!



● బ్లాక్‌పాంథర్ పోస్టర్

మార్వెల్ కామిక్స్ తవ్వుతూ పోతే ఎక్కడ తేలతామో ఎవ్వరికీ తెలీదు. అంతటి చరిత్ర ఉంది మార్వెల్ కామిక్స్‌కు. ఇందులో స్టాన్లీ సృష్టించిన బ్లాక్‌పాంథర్ పాత్ర 1966లో మొదటిసారి కామిక్స్‌లో ప్రచురితమైంది. ఆ తర్వాత అప్పట్నుంచి ఎన్ని సూపర్‌హీరో క్యారెక్టర్స్ సినిమాకెక్కినా, బ్లాక్‌పాంథర్ మాత్రం 2016 వరకూ తెరమీదకు రాలేదు. 2016లో 'కెప్టెన్ అమెరికా : సివిల్ వార్'లో కనిపించే వరకూ బ్లాక్‌పాంథర్ పుస్తకాలకే పరిమితమైంది. ఇక 'కెప్టెన్ అమెరికా'తో సూపర్ అనిపించుకున్న ఈ సూపర్ హీరో ఇప్పుడు తాజాగా మళ్లీ మెప్పించేందుకు సిద్ధమైంది. అదీ ఫుల్ లెంగ్త్ సూపర్ హీరో ఫిల్మ్ రూపంలో!

'బ్లాక్‌పాంథర్' పేరుతోనే తెరకెక్కిన ఈ కొత్త సూపర్ హీరో సినిమా ఫిబ్రవరి 16న భారీ ఎత్తున విడుదలకు సిద్ధమైంది. ఫస్ట్ వీకెండ్‌కే ఈ సినిమా 120 మిలియన్ డాలర్లు (సుమారు 760 కోట్ల రూపాయలు) వసూలు చేస్తుందని ట్రేడ్ అంచనా వేస్తోంది. ర్యాన్ కూగ్లర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో చద్విక్ బోస్‌మన్ బ్లాక్‌పాంథర్ సూపర్ హీరోగా కనిపించనున్నాడు. 2016వరకూ బ్లాక్‌పాంథర్ స్క్రీన్ మీదకు ఎందుకు రాలేకపోయింది? అని ఎవరైనా అడిగితే, మార్వెల్ స్టూడియోస్ వంద సాకులు చెప్తోందట. ఏదైతేనేం ఇప్పటికైనా వచ్చిందని సూపర్‌హీరో ఫ్యాన్స్ మాత్రం ఆల్ హ్యాపీ!!

నన్ను చంపాలని అనుకున్నారు!

హాలీవుడ్ స్పైస్


● ఉమా థర్మన్


● క్వెంటిన్ టరంటీనో

'ఆరోజు ఆ షూటింగ్ స్పాట్‌లో, ఆ యాక్సిడెంట్‌తో నన్ను చంపాలనుకున్నారు..' అంటూ హాలీవుడ్ స్టార్ ఉమా థర్మన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ వారం రోజులుగా సంచలనం సృష్టిస్తోంది. ఆమె తనను చంపాలనుకున్నట్టు చెబుతూ ప్రకటించిన పేర్లలో హాలీవుడ్ టాప్ స్టార్ డైరెక్టర్ క్వెంటీన్ టరంటీనో ఉండడం ఇక్కడ చర్చకు కారణమైంది. దాదాపు పదిహేనేళ్ల కిందట జరిగిన యాక్సిడెంట్ అది. ఇప్పుడు చర్చ జరుగుతున్నది దాని మీదే.

ఎలా జరిగిందీ యాక్సిడెంట్?

క్వెంటిన్ టరంటీనో దర్శకత్వంలో 'కిల్‌బిల్' (2003) సినిమా తెరకెక్కుతోంది. అందులో ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఉమా థర్మన్ అడవిలో ఉన్న ఒక రోడ్ మీద వేగంగా కారు నడుపుతూ వెళ్లాలి. గంటకు అరవై కిలోమీటర్ల వేగంతో థర్మన్ కారు నడుపుతూ చెట్ల మధ్యలోంచి దూసుకెళ్తోంది. సడెన్‌గా ఓ దగ్గర మలుపొచ్చింది. ఆమె ఆ మలుపును చూసి కార్‌ను కంట్రోల్ చేస్కోలేక రోడ్డుకి పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఆ యాక్సిడెంట్‌లో ఆమె మోకాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఉదర భాగానికి స్టీరింగ్ గట్టిగా ఢీ కొట్టింది. ప్రాణాలే పోయాయనుకుంది ఆ క్షణం. పదిహేనేళ్లు దాటినా థర్మన్‌ను ఆ గాయాలింకా బాధపెడుతూనే ఉన్నాయి.

థర్మన్ ఏమంటోందంటే..

హార్వీ వెయిన్‌స్టీన్ అనే నిర్మాతపై లైంగిక ఆరోపణలు రావడం, తద్వారా 'మీటూ' అన్న ఒక ఉద్యమమే పుట్టడం గతేడాది చూశాం. ఆ ఉద్యమం ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా హార్వీ వెయిన్‌స్టీన్‌పై థర్మన్ కూడా ఆరోపణలు చేసింది. ఈ క్రమంలోనే 'కిల్‌బిల్' టైమ్‌లో తనకు జరిగిన యాక్సిడెంట్ గురించి కూడా చెప్పిందామె. "అది నన్ను చంపడానికి వేసిన ప్లాన్. స్టంట్‌మెన్‌తో ఆ సీన్ చేయించమని చెప్పినా టరంటీనో దానికి ఒప్పుకోలేదు. ఆ కారు కండీషన్ బాగాలేదు. కావాలనే ఇన్నేళ్లైనా ఆ యాక్సిడెంట్ విజువల్స్ సాక్ష్యాలకు అందకుండా నిర్మాత వెయిన్‌స్టీన్ నాకు చూపించలేదు" అని వాదించింది థర్మన్. ఆ యాక్సిడెంట్‌లో తనకు అయిన గాయాలు ఈరోజుకీ బాధిస్తున్నాయని చెప్పిందామె.

టరంటీనో ఏమంటున్నాడు...

"నా కెరీర్‌లోనే కాదు. నా జీవితంలోనే నేను చేసిన దిద్దుకోలేని తప్పది.." అన్నాడు టరంటీనో, తనపై థర్మన్ చేసిన ఆరోపణలకు సమాధానంగా. కాకపోతే అది కావాలని చేసింది కాదని కూడా ఆయన అన్నాడు. "ఆ రోడ్ అంతా స్ట్రెయిట్‌గా ఉందని నేనను కున్నా. అసలా మలుపు ఉందన్న విషయం గ్రహించలేదు. అది నా తప్పే. జీవితంలో నేను చేసిన అతిపెద్ద తప్పు.." అని చెబుతూ, థర్మన్‌కు క్షమాపణలు చెప్పాడు టరంటీనో. ఆ యాక్సిడెంట్ విజువల్స్‌ను థర్మన్‌కు తానే స్వయంగా పంపించాడు కూడా!

చివరకు ఈ కథ ఎక్కడికొచ్చింది?

ఈ కథ పదిహేనేళ్ల తర్వాత మొన్నే మళ్లీ మొదలైంది. ఇంకా చివరకు రాలేదు కానీ, ఎవరెవరు ఏమేం చెప్పాలనుకుంటున్నారో చెప్పేసుకున్నారు. టరంటీనో ఇచ్చిన సమాధానం తర్వాత అతణ్ణి థర్మన్ పొగిడింది. "ఈ విజువల్స్‌ను బయటకు తేవడానికి టరంటీనో పెద్ద సాహసమే చేసి ఉండాలి. ఆయన చూపిన తెగువకు గర్వంగా కూడా ఉంది" అంటూ నిర్మాతలు హార్వీ వెయిన్‌స్టీన్, లారెన్స్ బెండర్, ఇ. బెన్నెట్‌లు ఇంతకాలం ఈ వీడియో తనకు అందకుండా ఎన్నో ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చింది థర్మన్. నిర్మాతలైతే దీన్ని ఖండిస్తున్నారు.

సోషల్ మీడియాలో ఇప్పుడు ఈ ఎపిసోడ్ అంతా బాగా ట్రెండింగ్. టరంటీనోను థర్మన్ క్షమించినా నెటిజన్లు మాత్రం క్షమించడం లేదు. ఇందులో అసలు ట్విస్ట్ అంటే ఇదే! ఇంకా ఈ కథ ఏయే మలుపులు తిరుగుతుందో చూడాలి!!

'మీటూ' టు 'టైమ్ ఈజ్ అప్'!


● జెస్సికా బేల్
● కేట్ హడ్సన్


● హార్వీ వెయిన్‌స్టీన్

మీటూ.. నాలుగు నెలలుగా ప్రపంచాన్ని ఊపేస్తోన్న ఉద్యమం. హార్వీ వెయిన్‌స్టీన్ అనే నిర్మాత తమపై చేసిన లైంగిక వేధింపులను ఒక్కొక్కరుగా హాలీవుడ్ నటీమణులు బయటపెట్టడంతో ఈ ఉద్యమం మొదలైంది. ఈ నాలుగు నెలల్లో ఈ ఉద్యమం హాలీవుడ్ స్టార్స్ దగ్గర్నుంచి ఇండియాలోని సాధారణ యువతి వరకూ చేరింది. ఆడవాళ్లు తమపై జరిగిన లైంగిక దాడులను బయటకొచ్చి చెప్పుకునేందుకు ఈ ఉద్యమం తోడుగా నిలిచింది. అలాంటి ఉద్యమానికి కొనసాగింపుగా హాలీవుడ్‌లో తాజాగా 'టైమ్ ఈజ్ అప్' అనే ఉద్యమం ఊపందుకుంటోంది. లైంగిక వేధింపులకు గురై బయటకు చెప్పుకోలేకపోతున్న అమ్మాయిల కోసం, వాళ్లు చేసే పోరాటాలకు అండగా నిలబడ్డం కోసం 'టైమ్ ఈజ్ అప్' పనిచేస్తుంది. ఈ టైమ్ ఈజ్ అప్ కోసం నెల రోజులుగా భారీ ఎత్తున ఫండ్స్ వచ్చిపడుతున్నాయి. అయితే ఆ ఫండ్స్ అన్నీ కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డ దర్శకులు, నిర్మాతల సినిమాలకు పనిచేసిన నటులు తాము ఆయా సినిమాలకు తీసుకున్న రెమ్యునరేషన్‌ను వెనక్కి ఇచ్చే క్రమంలో పుట్టినవే! "మేం ఆ దర్శకుడి/నిర్మాత సినిమాకు పనిచేసి తప్పు చేశాం. ఆ సినిమాకు తీసుకున్న రెమ్యునరేషన్ అంతా టైమ్ ఈజ్ అప్‌కు డొనేట్ చేస్తున్నాం" అని అన్నది ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో బాగా కనిపిస్తోన్న, చాలామంది స్టార్స్ చేస్తోన్న ఓ పోస్ట్.


● మెరిల్ స్ట్రీప్


● టేలర్ స్విఫ్ట్


● జెన్నిఫర్ అనిస్టన్